

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

విజయవాడ

fb.com/vaartha Digital


అమెరికా పౌరసత్వం ఇక మరింత ఖరీదు

టిఎంసిలో పెరిగిన ఆధిపత్య పోరు

5లో


Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

24-6-2026 బుధవారం సంపుటి: 32 సంచిక: 144 పేజీలు: 10+4 వెల: 6.50


# రిటైర్మెంట్ 62కు పెంపు

## ప్రభుత్వరంగ సంస్థలు, గురుకులాలు, సొసైటీ ఉద్యోగుల విరమణ వయసు పెంచిన ప్రభుత్వం

## 11వేల మంది ఉద్యోగులకు పాత పెన్షన్ విధానమే

## రూ. 34 వేల కోట్లు పైగా పెట్టుబడులకు కేబినెట్ ఆమోదం

## సిఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన కేబినెట్ భేటీలో పలు అంశాలపై కీలక నిర్ణయాలు



మంగళవారం సిఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశం దృశ్యం

**విజయవాడ,జూన్ 23,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్ర ప్రదేశ్‌లో 30 వేల మంది ప్రభుత్వ ఉద్యోగులకు రాష్ట్ర కేబినెట్ శుభవార్త చెప్పింది. సుదీర్ఘకాలం నుంచి పెండింగ్‌లో ఉన్న పెన్షన్ సమస్యకు ప్రభుత్వం పరిష్కారం చూపింది. మంగళవారం ఉదయం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ప్రభుత్వరంగ సంస్థల్లో పనిచేసే ఉద్యోగుల పదవీ విరమణ వయసు పెంచుతూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వరంగ సంస్థలు, గురుకుల విద్యాసంస్థలు, సొసైటీ ఉద్యోగుల పదవీ విరమణ వయసును 60 ఏళ్ల నుంచి 62 ఏళ్లకు పెంపుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. మెమో 57 ప్రకారం 2004 సంవత్సరానికి ముందు నోటిఫికేషన్ ద్వారా నియ మితులైన సుమారు 11 వేల మంది ఉద్యోగులకు కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సిపిఎస్ ) నుంచి పాత పెన్షన్ విధానం (ఒపిఎస్) అమలు చేసేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పెట్టుబడుల స్థాపనకు పెద్దపీట వేస్తూ మంత్రివర్గం కీలక నిర్ణయాలు తీసుకుంది. పరిశ్రమలు, ఐటీ, పర్యాటకం, రాజధాని అభివృద్ధి, డేటా సెంటర్లు, పునరుత్పాదక ఇంధన రంగానికి సంబంధించిన ప్రతిపాదనలకు ఆమోదం తెలి పింది. ఇటీవల పెట్టుబడుల ప్రోత్సాహక మండలిలో తీసుకున్న దాదాపు రూ.34 వేల కోట్ల పెట్టుబడుల స్థాపన ద్వారా 35 వేల ఉద్యోగాల కల్పన సంబంధించిన నిర్ణయాలకు మంత్రులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.

ఇపిబి సమావేశంలో ఆమోదించిన కంపెనీలు, పెట్టుబడుల వివరాలు గమనిస్తే ఎన్టీపీసీ రెన్యూవ బుల్ ఎనర్జీ, రూ. 6000 కోట్ల పెట్టుబడి, 750 మందికి ఉద్యోగ అవకాశాలు అనంతపురంలో ఆరాధ్య బయోఫ్యూయెల్ ప్రై.లిమిటెడ్ రూ. 75.78 కోట్ల పెట్టుబడి, 402 మందికి ఉద్యోగాలు, కృష్ణా జిల్లాలో సమయ్ బయో సీఎన్జీ చిత్తూర్ ప్రై.లిమిటెడ్ రూ.120 కోట్లు పెట్టుబడి, 260 ఉద్యోగాలు, చిత్తూరుజిల్లాలో శ్రీవాయు బయోఫ్యూయెల్స్, రూ.67.22 కోట్ల పెట్టుబడి, 150 మందికి ఉద్యోగాలు, కాకినాడ జిల్లాలో. ఆంధ్రా బయో ఎనర్జీ, రూ.96.40 కోట్ల పెట్టు బడి, 518 మందికి ఉద్యోగాలు, అనకాపల్లిజిల్లాలో .విక్సిత్ అగ్రి గ్రీన్ ఎనర్జీ, రూ.141.65 కోట్లపెట్టుబడి, 300 మందికి ఉద్యోగాలు, >>2



రాష్ట్రపతి నుంచి పద్మాలు అందుకుంటున్న కెటి థామస్, నోరి దత్తాత్రేయుడు, మమ్ముట్టి, మురళీమోహన్, రాజేంద్రప్రసాద్

# వికసిత 'పద్మా'లు

## రెండో విడత పురస్కారాలు ప్రదానం చేసిన రాష్ట్రపతి ముర్ము

**పద్మవిభూషణ్:** పి. నారాయణన్, జస్టిస్ కెటి థామస్

**పద్మ భూషణ్:** మమ్ముట్టి, నోరి దత్తాత్రేయుడు, డా. విజయ్ అమృతరాజ్, అల్కాయాజ్ఞిక్ మొ॥

**పద్మశ్రీ:** మురళీమోహన్, రాజేంద్ర ప్రసాద్, మాధవన్, రోహిత్ శర్మ, వెంపటి శశిశేఖర్ మొ॥

**న్యూఢిల్లీ,జూన్ 23:** దేశంలో పద్మ అవార్డుల రెండో విడత ప్రధానం అత్యంత ఘనంగా జరిగింది. రాష్ట్రపతిభవన్‌లోని దర్బారీహాలులోజరిగిన ఈకార్యక్రమంలో మళయాళ పాత్రికేయుడు పి.నారాయణన్, సుప్రీం మాజీ న్యాయమూర్తి జెస్టిస్ కెటి థామస్‌లు పద్మవిభూషణ్‌లు అందుకోగా సినీరంగ ప్రముఖులు ముమ్ముట్టి, అల్కా యాగ్నిక్‌తోపాటు ప్రఖ్యాత వైద్యులు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు, ప్రముఖ టెన్నిస్ క్రీడాకారుడు డా.విజయ్ అమృత్‌రాజ్, డా.ఎస్కేఎం మేలినాధన్, శిబుసోరెన్ (మరణా >>2

# పరవాడ ఫార్మాసిటీలో భారీ అగ్ని ప్రమాదం



అగ్ని ప్రమాద దృశ్యం

## ఇద్దరు కార్మికులు సజీవదహనం

## దక్షిణ ఎనర్జీ పరిశ్రమలో హఠాత్తుగా చెలరేగిన అగ్నికీలలు

## సిఎం చంద్రబాబు, డి.సిఎం పవన్, మంత్రి లోకేష్ దిగ్భ్రాంతి

## అత్యవసర సహాయచర్యలకు ఆదేశం

**అనకాపల్లి (పరవాడ), జూన్ 23, ప్రభాతవార్త:** పరవాడ ఫార్మాసిటీలో మరో విషాద ఘటన చోటుచేసుకుంది. దక్షిణ ఎనర్జీ పరిశ్రమలో మంగళవారం తెల్లవారుజామున సంభ వించిన భారీ అగ్నిప్రమాదంలో ఇద్దరు కార్మికులు మంటల్లో చిక్కుకుని సజీవదహన మయ్యారు. పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాల అమలుపై మరోసారి ప్రశ్నలు తలెత్తుతు న్నాయి. ఫార్మాసిటీలోని దక్షిణ ఎనర్జీ పరిశ్రమలో ప్లాస్టిక్ పైరోలిసిస్ ఆయిల్, కార్బన్ బ్లాక్, ఇంధన ఆయిల్స్ తయారీ జరుగుతోంది. సోమవారం రాత్రి విధులు నిర్వహిస్తున్న సమయంలో మంగళవారం తెల్లవారుజామున ఒక్కసారిగా అగ్నికీలలు ఎగిసిపడ్డాయి. ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉండటంతో చోడవరం మండలం అంబేర్‌పురానికి చెందిన వేపాడ వెంకటేష్ (34), అచ్యుతాపురం మండలం జగ్గన్నపేటకు చెందిన బోడేపు త్రినాథ్ (24) మంటల్లో చిక్కుకుని ప్రాణాలు కోల్పో యారు. సమాచారం అందుకున్న వెంటనే రెండు అగ్నిమాపక వాహా >>2



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న దృశ్యం



మంగళవారం న్యూఢిల్లీలో రాష్ట్రపతి ముర్ముతో భేటీ అయిన ప్రధాని మోదీ

## రాష్ట్రపతి ముర్ముతో ప్రధాని మోడీ భేటీ

కేబినెట్ విస్తరణ కోసమేనా? 2లో

త్వరలో ఎన్నికలు జరిగే రాష్ట్రాలకు విస్తరణలో ప్రాధాన్యం

# కేంద్ర మంత్రి జార్జ్ కురియన్ రాజీనామా

## రాష్ట్రపతి ముర్ము ఆమోదం



## ముగిసిన రాజ్యసభ పదవీకాలం

**న్యూఢిల్లీ, జూన్ 23:** రాజ్యసభ సభ్యత్వ కాలం ముగియడంతో, కేంద్ర మైనారిటీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి జార్జ్ కురియన్ మంత్రిమండలికి రాజీనామా చేశారు. ఇటీవల జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో బిజెపి ఆయనను తిరిగి నామినేట్ చేయలేదు. దీంతో ఆయన తన పదవిని వదులుకోవాల్సి వచ్చింది. కురియన్ రాజీనామాను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదించినట్లు రాష్ట్రపతి భవన్ మంగళవారం తెలిపింది. కురియన్ మత్స్య, పశుసంవర్ధక, పాడి పరిశ్రమశాఖలో కూడా కేంద్ర సహాయ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిం >>2

# గేట్లు సిద్ధం.. తుంగ'భద్రం'

## రేపు ప్రారంభించనున్న సిఎం చంద్రబాబు

**విజయవాడ జూన్ 23 ,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాలకు వర ప్రదాయిని అయిన తుంగభద్ర ప్రాజెక్టు ఇప్పుడు కొత్తగేట్ల అమరికతో సరికొత్త రూపును సంతరించుకుంది. రూ.51 కోట్ల వ్యయంతో మొత్తం 33 గేట్ల ఏర్పాటు పనులు పూర్తికాగా, వీటిని ఈ నెల 25వ తేదీన కర్నాటక ముఖ్యమంత్రి శివకుమార్, తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి, కేంద్రమంత్రి సిఆర్ పాటిల్‌తో కలిసి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించనున్నారు. 73 ఏళ్ల క్రితం నిర్మించిన తుంగభద్ర ప్రాజెక్టు రెండు రాష్ట్రాల్లో లక్షల ఎకరాల ఆయకట్టుకు జీవనాడిగా నిలుస్తోంది. అయితే 2024 ఆగస్టులో వచ్చిన వరద ప్రవాహానికి 19వ గేటు కొట్టుకుపోయింది. అప్పటికప్పుడు నీటి వృధాను అడ్డుకునేందుకు ఎపి ప్రభుత్వ చొరవతో, సిఎం చంద్రబాబు సూచనతో సీనియర్ ఇంజనీర్ కన్నయ్య నాయుడు నేతృత్వం వహించి స్టాప్‌లాక్ గేటును అమర్చారు. స్పిల్ వే గేట్లు అన్నీ మార్చాలని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటి నివేదిక ఇవ్వడంతో 6 నెలల్లో కొత్తగేట్లను పూర్తి చేసి ఎపి కర్ణాటక రాష్ట్రాలు పునరుజ్జీవం పోశాయి. తుంగభద్ర ప్రాజెక్టు ద్వారా లక్షలాది ఎకరాలకు సాగు నీరు, వందల గ్రామాలకు తాగునీరుతో ఎపి, కర్నాటక, తెలంగాణ రాష్ట్రాలకు కీలకంగాఉంది. ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే తుంగభద్ర ప్రాజెక్టు >>2

## కిరాణా షాపునుంచి డేటా సెంటర్ దాకా

# సింగిల్ పోర్టల్ ద్వారా పర్మిషన్లు

## ఇక ప్రతినెల ప్రధాన ప్రాజెక్టుల భూమిపూజ, ప్రారంభోత్సవాలు

## 20 లక్షల ఉద్యోగాల కల్పనపై లోకేష్ నేతృత్వంలో మంత్రుల బృందం భేటీ



మంగళవారం 20లక్షల ఉద్యోగాల కల్పనపై లోకేష్ నేతృత్వంలో మంత్రుల బృందం భేటీ దృశ్యం

**విజయవాడ,జూన్23,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నాం, కిరాణా కొట్టు నుంచి డేటా సెంటర్ వరకు సింగిల్ పోర్టల్ ద్వారా అనుమతులు మంజూరు చేసే విధానాన్ని రూపొందించాలని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అధికారులకు ఆదేశించారు. రాష్ట్రంలో 20లక్షల ఉద్యోగాల కల్పనకు మంత్రి లోకేష్ నేతృత్వంలో ఏర్పాటైన మంత్రుల బృందం సమావేశం ఉండవల్లి నివాసంలో నిర్వహించారు. ఈ సమావేశానికి మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, కందుల దుర్గేష్, టిజి భరత్ (ఆన్ లైన్ ద్వారా) హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకువచ్చిన 750 భారీ పరిశ్రమలు వివిధ దశల్లోఉన్నాయి, ఇవి పూర్తిస్థాయిలో పట్టాలెక్కితే పెద్దఎత్తున రాష్ట్రంలోని యువతకు ఉద్యోగాలు అందుబాటులోకి వస్తాయి, సాధ్యమైనంత త్వరగా ఆయా పరిశ్రమలు గ్రౌండింగ్అయ్యేలా పరిశ్రమలశాఖ, ఎకనమిక్ డెవలప్‌మెంట్‌బోర్డు అధికారులు ఎప్పటిక ప్పుడు ట్రాక్ చేస్తూ ప్రత్యేకశ్రద్ధ వహించాలని అన్నారు. పనులను వేగవంతంచేసి ప్రతినెలా ప్రాజెక్టుల భూమిపూజ, ప్రారంభోత్సవాలు ఉండేలా అధికారులు చొరవచూపాలని కోరారు.

**పరిశ్రమల ఆకర్షణకు పెద్దఎత్తున రోడ్ షోలకు ప్రణాళికలు**

నవంబర్‌లో నిర్వహించే పార్టనర్ షిప్ సమ్మిట్ నాటికి సాధ్యమైనంత గరిష్టంగా పరిశ్రమలు గ్రౌండింగ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. గత సమ్మిట్‌కి >>2

## టాటా వాహనం

# బోల్తా

## రంగంపేట మండలంలో దుర్ఘటన

## ముగ్గురు కార్మికులు మృతి

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి ,జూన్ 23(ప్రభాతవార్త):** తూర్పుగోదావరి జిల్లాలోని రంగంపేట మండలం పరిధిలో ఒడిసిలేరు రంగంపేట మధ్య మంగళవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది నిర్మాణ పనులు ముగించుకుని స్వగ్రామాలకు తిరిగి వస్తున్న కార్మికుల ప్రయాణిస్తున్న టాటా ఏస్ వాహనం టైర్ పంచర్ కావడంతో అదుపుతప్పి బోల్తా పడింది ఈ విషాద ఘటనలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందగా మరో ఎనిమిది మంది గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే.. కాకినాడజిల్లా సామర్లకోట పట్టణం పిఠాపురం మండలంలోని మల్లం, జల్లూరు గ్రామాలకు చెందిన 11మంది కార్మికులు బాపట్ల జిల్లా కొల్లూరు ప్రాంతానికి నిర్మాణపనుల నిమిత్తం వెళ్లారు రెడీమిక్స్ వాల్స్ నిర్మాణం పనులు పూర్తి చేసుకుని మిగిలిన సామాగ్రితో కలిసి స్వగ్రామంతిరిగి వస్తుం డగా ఈ ప్రమాదం జరిగింది తెల్లవారు >>2



# కొత్తగా 10 బిసి గురుకులాలు

## ఒక్కో గురుకులంలో 37 పోస్టుల భర్తీకి నిర్ణయం

## ఇటీవలే 6 ఎంజెపిలు కళాశాలలుగా అప్‌గ్రేడ్

## నూతన గురుకులాల ఏర్పాటుపై మంత్రి సవిత హర్షం

**విజయవాడ,జూన్ 23,ప్రభాతవార్తప్రతినిధి:** విద్యతోనే బిసిలు మరింత ఉన్నత స్థానాలకు చేరుకోగలరనేది సీఎం చంద్రబాబు నాయుడు బావన. ఇటీవల ఆరు మహాత్మా జ్యోతిరావు పూలే బిసి గురుకుల పాఠశాలలను జూనియర్ కళాశాలలుగా అప్ గ్రేడ్ చేసింది. ఇపుడు బిసి విద్యార్థులకు మేలు కలిగేలా నూతన విద్య సంస్థలు నెలకొల్పాలని నిర్ణయించారు. రాష్ట్రంలో కొత్తగా పది మహాత్మా జ్యోతిరావు పూలే బిసి గురుకుల పాఠశాలల ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది.ఈ కొత్త గురుకులాల్లో 37 మంది చొప్పున్న ఉద్యోగులను భర్తీ చేయను న్నారు. ఈమేరకు మంగళవారం సిఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలో జరిగిన కేబినెట్ భేటీలో ఈ నిర్ణయం తీసు కున్నారు. రాష్ట్రంలో బిసి బిడ్డలందరూ విద్య అభ్యసించేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. బడి బయట ఏ బిసి బిడ్డా ఉండకూడదనేది సీఎం చంద్రబాబు ప్రధాన ఉద్దేశం. దీనిలో భాగంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఒక వైపు బిసి హాస్టళ్లు, మరో ఎంజేపీ గురుకులాల అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తోంది. సకా లంలో డైట్‌బిల్లులు, కాస్మోటిక్ ఛార్జీలు చెల్లిస్తోంది. మారుతున్న పరిస్థితులకనుగుణంగా సాంకేతిక విద్యకు కూడా ప్రాధాన్య మిస్తోంది. దీంతో బిసిహాస్టళ్లు, ఎంజెపిస్కూళ్లలో తమ పిల్లలను చేర్పించడానికి విద్యార్థుల తల్లిదండ్రులు ఆసక్తి చూపతున్నారు. దీంతో కూటమి ప్రభుత్వం ఎంజేపీ గురుకుల పాఠశాలలను జూనియర్ కళాశాలలుగా అప్ గ్రేడ్ చేయడం, కొత్త గురుకులాలను ఏర్పాటు చేయడం వంటి చర్యలు చేపట్టింది.

**ఇటీవల 6 గురుకులాలు అప్ గ్రేడ్..**

ఎంజేపీ గురుకులాల సీట్లకు డిమాండ్ ఏర్పడిన నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ఇటీవల ఆరు బిసి గురుకులాలను జూనియర్ కళాశాలలుగా అప్ గ్రేడ్ చేసింది. కొత్తవలస >>2

## సాయి కృష్ణ మిస్సింగ్ కేసు



# మాజీ సిఐ నాగరాజు అరెస్టు

## స్టేషన్‌లో సిసి ఫుటేజిలు మాయం

## మే నుండి జూన్ నెల వరకు రెండు రోజుల ఫుటేజి మాత్రమే ఉంచిన వైనం

## కీలక ఆధారాలు మాయం చేశారనే కోణంలో దర్యాప్తు వేగవంతం

**విజయవాడ క్రైం,జూన్ 23,ప్రభాతవార్త:** గాదె సాయికృష్ణ అదృశ్యం కేసు కీలక మలుపులు తిరుగుతోంది. ఈ కేసులో కృష్ణలంక మాజీ సిఐ నాగరాజును సిట్ బృందం మంగళవారం సింగ్‌నగర్‌లో అదుపులోకి తీసుకుంది.ఉదయం తొలుత కృష్ణలంక స్టేషన్‌ను పరిశీలించిన సిట్ ప్రత్యేక దర్యాప్తు బృందం కృష్ణలంక పోలీస్‌స్టేషన్‌తో పాటు స్వర్గపురి రికార్డులనుకూడ తనిఖీచేసింది. ఈ తనిఖీలో కృష్ణలంక పోలీస్‌స్టేషన్‌లో ఉన్న సిసి ఫుటేజి మాయం అవ్వడంతో సిట్ బృందం ఆశ్చర్యపోయింది. సిసి >>2



అగ్నిప్రమాదంలో కాలిపోయిన యంత్ర పరికరాలు

# భారీ అగ్ని ప్రమాదం

>> నాలు ఘటనాస్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకు వచ్చాయి. అయితే అప్పటికే ఇద్దరు కార్మికులు మృతిచెందినట్లు అధికారులు నిర్ధారించారు. ఘటనపై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబాలకు అవసరమైన సహాయం అందించాలని అధికారులను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ శౌర్యమాన్ పటేల్ సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించారు. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు కేజీహెచ్ మార్చురీలో మృతదేహాలను పరిశీలించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. మృతుడు వెంకటేష్‌కు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉండగా, యువకుడు త్రినాథ్ మృతితో అతని కుటుంబం విషాదంలో మునిగిపోయింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టగా, ప్రమాదానికి గల కారణాలు, భద్రతా లోపాలపై విచారణ కొనసాగుతోంది. పరవాడ ఫార్మాసిటీలో వరుస ప్రమాదాలు చోటుచేసుకుంటుండటంతో పరిశ్రమల భద్రతపై కార్మిక సంఘాలు, స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**దక్షిణ ఎనర్జీ బాధిత కుటుంబాలకు చేరో రూ.33 లక్షల పరిహారం**

పరవాడ ఫార్మాసిటీలోని దక్షిణ ఎనర్జీ పరిశ్రమలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో మృతి చెందిన కార్మికులు వేపాడ వెంకటేష్, బోడేపు త్రినాథ్‌రావు కుటుంబాలకు చెరో రూ.33 లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లించేందుకు యాజమాన్యం అంగీకరించింది. ఈ మేరకు పరిశ్రమ యాజమాన్యం, బాధిత కుటుంబ సభ్యులు, కార్మిక సంఘాల నాయకుల మధ్య జరిగిన చర్చలు సఫలమవగా, పరిహారంపై ఒప్పందం కుదిరింది. అనంతరం యాజమాన్య ప్రతినిధులు మృతుల కుటుంబ సభ్యులకు ఒప్పంద పత్రాలను అందజేశారు. దక్షిణ ఎనర్జీ పరిశ్రమలో సంభవించిన అగ్నిప్రమాదంలో ఇద్దరు కార్మికులు మృతి చెందడంతో వారి కుటుంబాలు తీవ్ర విషాదంలో మునిగిపోయాయి. ఈ నేపథ్యంలో బాధిత కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు యాజమాన్యం చెరో రూ.33 లక్షల పరిహారం ప్రకటించడం కొంత ఊరటనిచ్చింది. ప్రమాద ఘటనపై పోలీసులు ఇప్పటికే కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

**దుర్ఘటనపై సిఎం చంద్రబాబు, డిసిఎం పవన్, మంత్రి లోకేష్ దిగ్భ్రాంతి**

అనకాపల్లి జిల్లా పరవాడ ఫార్మాసిటీలో చోటు చేసుకున్న దుర్ఘటనపై సిఎం చంద్రబాబు, డిసిఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్ దిగ్భ్రాంతిని వ్యక్తం చేసారు. ఘటనపై సిఎం విచారణకు ఆదేశించారు. హోంమంత్రి అనిత పరిస్థితులను సమీక్షిస్తున్నారు. ఈ దుర్ఘటనపై సిఎం చంద్రబాబు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. బాధితులను ఆదుకోవాలని, గాయపడినవారికి మెరుగైన చికిత్స అందించాలని సిఎం ఆదేశించారు. పరవాడ ఫార్మాసిటీ అగ్నిప్రమాదంపై ఉపముఖ్యమంత్రి పవన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. పరవాడ ఫార్మాసిటీ అగ్నిప్రమాదంపై మంత్రి లోకేశ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకున్నామని, క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానని అన్నారు.

పరవాడ ఫార్మాసిటీ అగ్నిప్రమాదంపై హోంమంత్రి అనిత ఆరా తీశారు. కలెక్టర్, ఎస్పీతో ఫోనులో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. సహాయచర్యలు వేగవంతం చేయాలని అధికారులకు హోంమంత్రి ఆదేశాలు జారీ చేశారు. మంత్రి సుభాష్ పరవాడ ఫార్మాసిటీలో అగ్నిప్రమాదం అత్యంత విషాదకరమని అన్నారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. జాయింట్ కలెక్టర్ శౌర్యమాన్ పటేల్ సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించారు.

పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు కేజీహెచ్ మార్చురీలో మృతదేహాలను పరిశీలించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. మృతుడు వెంకటేష్‌కు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉండగా, యువకుడు త్రినాథ్ మృతితో అతని కుటుంబం విషాదంలో మునిగిపోయింది.

# గేట్లు సిద్ధం.. తుంగ'భద్రం'

>> కింద 1.46 లక్షల హెక్టార్లకు సాగునీరు అందుతోంది. కుడి కాలువ ద్వారా కర్నూలు, కడప, అనంతపురం జిల్లాలకు సాగు నీరందుతోంది. ఈ నేపథ్యంలో ప్రాజెక్టు భద్రతను ఎపి, కర్నాటక రాష్ట్రాలు ప్రతిష్టాత్మకంగా తీసుకుని గేట్ల ఏర్పాటును త్వరితగతిన పూర్తి చేశాయి. 25వ తేదీన గేట్ల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని హోస్‌పేటలో జరిగే బహిరంగ సభలో పాల్గొంటారు.

# వికసిత 'పద్మా'లు

>> నంతరం), వెల్లపల్లి నటేషన్ పద్మభూషణ్ పురస్కారాలు అందుకున్నారు. తెలుగు రాష్ట్రాలనుంచి సినీ నటులు మాగంటి మురళీమోహన్, రాజేంద్రప్రసాద్‌లు పద్మశ్రీ పురస్కారాలు అందుకున్నారు. వీరితోపాటు తమిళనటుడు మాధవన్, క్రికెటర్ రోహిత్‌శర్మ ఇతర పలు రంగాలప్రముఖులకు పద్మ పురస్కారాలు వరించాయి. మొత్తం 131 మందిని పద్మపురస్కారాలకు ఎంపికచేయగా తొలివిడతలో 66 మందికి ఎంపికచేస్తే మిగిలినవారికి మంగళవారం ప్రధానంచేసారు. ఈ కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి సిపిరాధాకృష్ణన్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, ప్రధాని మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్; కేంద్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, పియూష్‌గోయల్, ధర్మేంద్రప్రధాన్, గజేంద్రసింగ్ షెకావత్ తదితరులు పాల్గొన్నారు. పద్మశ్రీ అవార్డులు పొందినవారిలో నూరుద్దీన్ అహ్మద్, తిరువారూర్ భక్తవత్సలం, డా.కృష్ణమూర్తి బాలసుబ్రహ్మణ్యన్, బ్రిజ్‌లాల్‌భట్, తరుణ్ భట్టాచార్య, జ్యోతిష్ దేబ్‌నాథ్, డా.జోగేష్ దేవురీ, భిక్యాల లడక్యా ధిండా, డా.అర్మింద ఫెర్నాండెజ్, డాక్టర్ చంద్రమౌలి గడ్డమనుగు, డాక్టర్ ప్రేమ్‌లాల్ గౌతమ్, డా.రాజాస్తపతి కలియప్ప గౌండర్, డా.పద్మ గుర్మెట్, అశోక్‌కుమార్ హల్దార్, డాక్టర్ సురేష్ హంగావాడి, శ్రీచరణ్ హేంబ్రమ్, డా.శుభా వెంకటేశ ఐయ్యంగార్, టిటి జగన్నాథన్ (మరణానంతరం), సంత్ నిరంజన్‌దాస్‌జీ, ప్రొఫెసర్ వీఝినాథన్ కామకోటి, ప్రొఫెసర్ మంగలా కపూర్, డాక్టర్ అశోక్ ఖాడే, డి. లియుడ్‌మీలా ఖోఖోల్వా, డా.ప్రభాకర్ బసాప్రభుకోరే, శ్రీమతి పోఖిలా లేఖథేపీ, మామిడి రామారెడ్డి(మరణానంతరం), ఆర్‌విఎస్ మణి, శ్రీమంతి కళామండలం విమలా మీనన్, వ్లాదిమీర్ మెస్త్ విరిష్‌విలి (మరణానంతరం), మోహన్‌నాగర్, డా.పుణ్యమూర్తి నటేషన్, శర్‌కుమార్‌పాత్ర, గురుసంగ్యసంగ్ పాంగెనేర్, సవితా పూనియా, కవీంద్ర పురకాయస్థ (మరణానంతరం), హగవాన్‌దాస్ రైక్‌వార్(మరణానంతరం), ప్రొఫెసర్ కె.రామస్వామి, శ్రీమతి రంజని, శ్రీమతి గాయత్రి, డా.అనిల్‌కుమార్ రోగ్, ప్రొఫెసర్ మహేంద్రనాథ్‌రాయ్, సతీష్‌షా(మరణానంతరం), ప్రొఫెసర్ ప్రతీక్ శర్మ, రోహిత్ గురునాథ్‌శర్మ, సర్దార్ ఇందర్ జీత్ సింగ్‌సిద్ధు, రఘుపత్‌సింగ్(మరణానంతరం), ఖేమ్‌రాజ్ సుంద్రియాల్, డా.భుద్రి తాతి, డా.కుమార స్వామి తంగరాజ్, రబిలాల్ తుడు(మరణారంతరం) నరేష్ చంద్రదేవ్‌వర్మ, వెంపటి శశిశేఖర్, చిరంజిలాల్ యాదవ్‌లు రాష్ట్రపతి చేతులమీదుగా పద్మశ్రీ పురస్కారాలు అందుకున్నారు.

# టాటా వాహనం బోల్తా

>> జామున సుమారు 3 గంటల సమయంలో వాహనం టైర్ పంచర్ కావడంతో డ్రైవర్ నియంత్రణ కోల్పోయి వాహనం రోడ్డుపై బోల్తా పడింది ఈ ప్రమాదంలో సామర్లకోటకి చెందిన మసకపల్లి బాబు, మురమళ్ళ రాజు, కాకడ రాజు అనే ముగ్గురు కార్మికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు మిగిలిన 8 మందిని 108 అంబులెన్స్ సహాయంతో పెద్దాపురం ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు ప్రమాదంలో మృతి చెందిన వారి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు మరో అరగంటలో తమ గమ్యస్థానాలు చేరుకునే సమయంలో ఈ విషాదం చోటు చేసుకోవడం కుటుంబ సభ్యులను విషాదంలో ముంచెత్తింది సమాచారం అందుకున్న రంగంపేట పోలీసులు వెంటనే ఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# కొత్తగా 10 బిసి గురుకులాలు

>> (విజయనగరం), ఆత్మకూరు, గోలగముడి (నెల్లూరు), కలికిరి(అన్నమయ్య), ఒనిపెంట (కడప), నాసనకోట (శ్రీ సత్యసాయి జిల్లా) ఎంజేపీ గురుకుల పాఠశాలలను అప్ గ్రేడ్ చేశారు. ఆయా గురుకులాలల్లో తరగతలు సైతం ప్రారంభమయ్యాయి.

**కొత్తగా 10 గురుకులాల ఏర్పాటు**

తాజాగా కొత్త గురుకుల పాఠశాలలను కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు మంగళవారం జరిగిన కేబినెట్ భేటీలో మంత్రమండలి ఆమోదం కూడా తెలిపింది. చ్చెర్ల(శ్రీకాకుళం), నక్కపల్లి(అనకాపల్లి), మాచెర్ల(పల్నాడు), గిద్దలూరు(మార్కాపురం), గుంతకల్లు(అనంతపురం), రాయచోటి (అన్నమయ్య), పత్తికొండ, మంత్రాలయం(కర్నూలు), పెనుకొండ, కదిరి(శ్రీసత్యసాయి)లో ఎంజేపీ గురుకులాలను ఏర్పాటు చేయనున్నారు. ఒక్కో గురుకులంలో 37 బోధన, బోధనేతర పోస్టులు భర్తీ చేయనున్నారు. ఈగురుకుల పాఠశాలలో అయిదు బాలికలు, మరోఅయిదు బాలుర పాఠశాలలను ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచే తరగతలను ప్రారంభించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. నూతన ఎంజేపీ గురుకులాల ఏర్పాటుతో ఆయా ప్రాంతాల్లోని బీసీ బిడ్డలకు మరింత మేలు జరగనుంది.

**సిఎం చంద్రబాబుకు మంత్రి సవిత ధన్యవాదాలు..**

బడి బయట ఏ ఒక్క బిసి బిడ్డా ఉండకూడదనే సిఎం చంద్రబాబు లక్ష్యాన్ని రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత కొనియాడారు. బిసిల విద్యకు ప్రాధాన్యమిస్తూ, కొత్తగా పది ఎంజేపీ గురుకుల పాఠశాలల ఏర్పాటుపై ఆమె హర్షం వ్యక్తంచేశారు. ఈ గురుకులాల ఏర్పాటుతో మరింతమంది పేద బిసి బిడ్డలు చదువుకునే అవకాశం కలుగుతుందన్నారు. ఎంజేపీ గురుకులాల్లో ఆహార భద్రత, రక్షణతో కూడిన నాణ్యమైన విద్య అందిస్తున్నారన్నారు. గత నెలలో విడుదలైన టెన్త్, ఇంటర్ ఫలితాల్లో బిసి బిడ్డలు అత్యుత్తమ ఫలితాలు సాధించారన్నారు. ఇటీవలే ఆరు బిసి గురుకులాలను జూనియర్ కళాశాలలుగా కూటమి ప్రభుత్వం అప్ గ్రేడ్ చేసిందన్నారు. బిసిల విద్య కోసం ప్రత్యేక దృష్టి సారిస్తున్న సీఎం చంద్రబాబుకు, మంత్రి నారా లోకేశ్ కు మంత్రి సవిత ధన్యవాదాలు తెలియజేశారు.

## వారం - వర్జ్యం

**24-06-2026, బుధవారం**
**శ్రీ పరాభవ నామ సంవత్సరం,**
**నిజ జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం**
**గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం,** ఆరుద్ర కార్తె
దశమి సా.6.15
చిత్త మ.2.01
వర్జ్యం : రా.8.12-రా.9.58
దు. ఉ.11.43-మ.12.35
శుభసమయం:ఉ.7.00-8.00
రాహుకాలం - మ.12.00-1.30

## వార్తాఫలం

**మేషం:** ముఖ్యమైన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. మోసకారి మాటలు చెప్పే వారి నుండి దూరంగా ఉండండి.

**వృషభం:** ఎదుటివారిని బాగా అంచనా వేయగలుగుతారు. తద్వారా లాభపడతారు. ఉద్యోగాలపరంగా రాణిస్తారు. వస్త్రలాభం.

**మిథునం:** కుటుంబ సభ్యులతో ఏర్పడిన వివాదాలు పరిష్కారమవుతాయి. దూర ప్రాంతాల నుండి శుభవార్తలు వింటారు.

**కర్కాటకం :** చర్చాగోష్ఠులలో పాల్గొంటారు. సహోదర, సహోదరీ వర్గం వారికి విశేషంగా సహాయ సహకారాలు అందిస్తారు.

**సింహం:** ఆస్తుల విలువ అనూహ్యంగా పెరుగుతుంది. ఉద్యోగంలో నూతన బాధ్యతలు స్వీకరిస్తారు. వాహన సౌఖ్యం.

**కన్య :** మిత్రులతో ఏర్పడిన వివాదాలు పరిష్కారమవుతాయి. పనుల నిదానంగా పూర్తిచేస్తారు. గృహనిర్మాణ యత్నాలు.

**తుల :** వ్యతిరేక వాతావరణంలో అనుకూల ఫలితాలు సాధిస్తారు. విదేశాలలోని బంధువులకు సాయం అందిస్తారు.

**వృశ్చికం:** దూరప్రాంతాల నుండి అరుదైన ఆహ్వానాలు అందుకుంటారు. విద్యార్థులకు అనుకూలమైన కాలం. కాంట్రాక్టులు లాభిస్తాయి.

**ధనుస్సు:** ఏ పనిని చేపట్టినా విజయవంతంగా పూర్తి చేస్తారు. పెద్దల సలహాలతో కీలక నిర్ణయాలు తీసుకుంటారు.

**మకరం:** వృత్తిలో వత్తిడి ఎక్కువ అవుతుంది. దీర్ఘకాలిక సమస్యలు తీరి ఊరట చెందుతారు. వాహనాల కొనుగోలు.

**కుంభం:** వివాదాస్పదమైన అంశాలతో తలదూర్చకండి. "తప్పించుకు తిరుగువాడు ధన్యుడు సుమతీ" అన్నారు.

**మీనం :** తియ్యని మాట తీరు ఎంతటి కార్యాన్నయినా సులువు చేస్తుందని గ్రహిస్తారు. సహోద్యోగులతో సామరస్యంగా మెలగుతారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



మంగళవారం సర్ ప్రక్రియలో పాల్గొని అధికారులకు వివరాలు అందిస్తున్న మంత్రి లోకేష్

# 'సర్' ప్రక్రియలో పాల్గొన్న మంత్రి లోకేష్

**విజయవాడ,జూన్ 23,ప్రభాతవార్తప్రతినిధి:** కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ప్రక్రియలో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. ఉండవల్లిలోని తమ నివాసానికి వచ్చిన బూత్ లెవల్ ఆఫీసర్ అడిగిన సమాచారం, డాక్యుమెంట్లను మంత్రి లోకేష్ సమర్పించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతిఒక్కరూ ఈ ప్రక్రియలో పాల్గొనాలని మంత్రి లోకేష్ విజ్ఞప్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సర్ ప్రక్రియలో పాల్గొనే ప్రజలు ఏదైనా డౌట్లు ఉంటే ఆయా వార్డుల్లో నియమితులైన బిఎల్ఓలను సంప్రదించాలని, ఇందుకోసం సహకరించేందుకు తెలుగుదేశం పార్టీ తరపున బూత్ లెవల్ ఏజంట్లు కూడా అందుబాటులో ఉంటారని చెప్పారు.

# జార్జ్ కురియన్ రాజీనామా

>> చారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ సలహా మేరకు, కేంద్ర మంత్రిమండలి నుండి కురియన్ రాజీనామాను భారత రాష్ట్రపతి తక్షణమే అమల్లోకి వచ్చేలా ఆమోదించారని అధికారిక ప్రకటన పేర్కొంది. కేంద్ర ప్రభుత్వంలో క్రైస్తవ వర్గానికి చెందిన ఏకైక మంత్రి బహుశా కురియన్ మాత్రమే. జూన్ 21వ తేదీన ఆయన రాజ్యసభ పదవీకాలం ముగిసింది. కేంద్ర మంత్రులు రవ్‌నీత్ సింగ్ బిట్టు, కురియన్‌ల పదవీకాలం ముగుస్తున్నప్పటికీ, జూన్ 18న జరిగిన రాజ్యసభ ఎన్నికలకు వారిని తిరిగి నామినేట్ చేయలేదు. 65 ఏళ్ల కురియన్ 1980లో బిజెపి ఆవిర్భావం నుండే పార్టీలో సభ్యుడిగా ఉన్నారు. ఆయన బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యుడిగా, భారతీయ జనతా యువ మోర్చా జాతీయ ఉపాధ్యక్షుడిగా, బిజెపి కేరళ విభాగం ఉపాధ్యక్షుడిగా వివిధ పదవులను చేపట్టారు. భారత సుప్రీంకోర్టులో న్యాయవాదిగా కూడా ప్రాక్టీస్ చేశారు. ఆయన జూన్ 9, 2024న కేంద్ర సహాయ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. అంతకు ముందు, కురియన్ జాతీయ మైనారిటీల కమిషన్ ఉపాధ్యక్షుడిగా పనిచేశారు.

# రాష్ట్రపతి ముర్ముతో ప్రధాని మోడీ భేటీ

**న్యూఢిల్లీ,జూన్ 23:** రాష్ట్రపతిభవన్‌లో అట్టహాసంగా జరిగిన పద్మ పురస్కారాలప్రధానం అనంతరం రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో ప్రధాని నరేంద్రమోడ ీభేటీ కావడం రాజకీయ ప్రాధాన్యతనున సంతరించుకుంది. కేంద్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ ప్రచారం జోరుగా సాగుతున్నవేళ ప్రధానిమోడీ భేటీకి ప్రాధాన్యం పెరిగింది. వీరి భేటీకి సంబంధించి చిత్రాలను రాష్ట్రపతి కార్యాలయం ఎక్స్‌వేదికగా విడుదలచేసింది. కేరళ బిజెపినేత జార్జి కురియన్ కేంద్ర సహాయ మంత్రిపదవికి రాజీనామాచేసారు. ఆయన రాజీనామాకు రాష్ట్రపతి ఆమోదం కూడా తెలిపారు. ఈ పరిణామంతో కేంద్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ ఉంటుందన్న ప్రచారం జోరందుకుంది. ఇటీవల పలువురు కేంద్ర మంత్రులకు వారి వారి రాష్ట్రాల్లో పార్టీ బాధ్యతలను అప్పగించడం దీనికి మరింత బలం చేకూరింది. కేంద్ర రోడ్డురవాణా సహాయమంత్రి హర్ష్ మల్హోత్రాను ఢిల్లీబిజెపి అధ్యక్షుడుగా పార్టీ అధ్యక్షుడు నితిన్‌నబిన్ నియమించారు. త్వరలో ఎన్నికలకు వస్తున్న రాష్ట్రాలకు మంత్రివర్గంలోప్రాధాన్యం ఇస్తారన్న అంచనాలూన్నాయి. అదేక్రమంలో ఇతర పార్టీలనుంచి బిజెపిలోకి, ఎన్డీయేలోకి వచ్చినవారిని మరికొందరిని కేబినెట్‌లోకి తీసుకుంటారని చర్చలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలోనే పద్మ పురస్కారాల తర్వాతనే మోడీ రాష్ట్రపతితో భేటీ కావడం కేబినెట్ విస్తరణ అంశాలు తెరపైకి వచ్చాయి.

# రిటైర్మెంట్ 62కు పెంపు

>> ఎన్టీఆర్ జిల్లాలో కంట్రోల్ ఎస్ డేటా సెంటర్, రూ.2788.30 కోట్ల పెట్టుబడి, 160 మందికి ఉద్యోగాలు, అనకాపల్లిజిల్లాలో జెట్ ఫ్యాబ్ ఇండియా, రూ.740 కోట్ల పెట్టుబడి, 1049 మందికి ఉద్యోగాలు, తిరుపతి జిల్లాలో, ఇన్ ఫినిక్స్ టెక్నాలజీ సొల్యూషన్స్, రూ.170 కోట్ల పెట్టుబడి, 4000 మందికి ఉద్యోగాలు, విశాఖజిల్లాలో, ఎక్లాట్ హెల్త్ సొల్యూషన్స్, రూ.50 కోట్లు, 1000 మందికి ఉద్యోగాలు, విశాఖపట్నం జిల్లాలో లభిస్తాయి. ఇప్యాక్ డ్యూరబుల్, ఇప్యాక్ మాన్యుఫాక్చరింగ్ టెక్నాలజీస్, రూ.1084.31 కోట్ల పెట్టుబడి, 1600 మందికి ఉద్యోగాలు, నాయుడుపేట, శ్రీసిటి, తిరుపతి జిల్లాలో ఆంబర్ ఎంటర్ ప్రైజెస్, రూ.445 కోట్ల పెట్టుబడి, 1250 మందికి ఉద్యోగాలు, శ్రీసిటి తిరుపతి జిల్లాలో ఎంసిఎన్ఇఎక్స్ ఇండియా, రూ.347 కోట్లు, 1633 మందికి ఉద్యోగాలు, శ్రీసిటీ తిరుపతి జిల్లాలో లభిస్తాయి. వరుణ్ హాస్పిటాలిటీ ప్రై.లిమిటెడ్, రూ.280.33 కోట్ల పెట్టుబడి, 600 మందికి ఉద్యోగాలు, అమరావతిలో .ఇంద్రోయల్ హాస్పిటాలిటీ సర్వీసెస్, రూ.539 కోట్ల పెట్టుబడి, 600 మందికి ఉద్యోగాలు, అమరావతిలో, విజయనగర్ ఇన్వెస్ట్మెంట్స్ ఇన్‌ఫ్రా, రూ.53.35 కోట్ల పెట్టుబడి, 225 మందికి ఉద్యోగాలు, ఆనందపురం, విశాఖ జిల్లాలో లభిస్తాయి, దైవిక్ హోటల్స్ ప్రైలిమిటెడ్ రూ.186.84 కోట్ల పెట్టుబడి, 500 మందికి ఉద్యోగాలు, అమరావతిలో .శుభసంకల్ప్, రూ.174.52 కోట్లు, 300 మందికి ఉద్యోగాలు లభిస్తాయి, వెసెల్లా 5 స్టార్ హోటల్స్, రిసార్ట్స్ రూ.210.14 కోట్ల పెట్టుబడి, 300 మందికి ఉద్యోగాలు, కర్నూలుజిల్లాలో దుర్గా కండేవ్‌పద్మా హాస్పిటాలిటీ కన్సార్టియం, రూ.163.36 కోట్ల పెట్టుబడి, 400 మందికి ఉద్యోగాలు, విశాఖపట్నం జిల్లాలో వైట్ ఓక్ రిసార్ట్స్ , రూ.79.01 కోట్లు పెట్టుబడి, 250 మందికి ఉద్యోగాలు, విశాఖపట్నం జిల్లాలో లభిస్తాయి. ఎస్ఏఫ్ ఒన్ ఇండియాఎస్పీ కాంపాక్ట్ లిమిటెడ్ రూ.1900 కోట్ల పెట్టుబడి, 2500 మందికి ఉద్యోగాలు, కాకినాడజిల్లాలో లభిస్తాయి..ప్రోటీరియల్ ఇండియా, రూ.2,250 కోట్లు, 530 మందికి ఉద్యోగాలు, అనకాపల్లిజిల్లాలో లభిస్తాయి..నాన్ మాగ్నెటెక్ ప్రై.లిమిటెడ్, రూ.1250 కోట్లు, 400 మందికి ఉద్యోగాలు, తిరుపతి జిల్లాలో లభిస్తాయి. ఏపీ జెఎస్ డబ్ల్యూ స్టీల్స్ , రూ. 1230.20 కోట్లు, 155 మందికి ఉద్యోగాలు, ప్రకాశం జిల్లాలో లభిస్తాయి..వయోనా ఎనర్జీ, రూ.468 కోట్లు పెట్టుబడి, 1300 మందికి ఉద్యోగాలు, నెల్లూరు జిల్లాలో లభిస్తాయి. బెర్జర్ పెయింట్స్ , రూ.176.82 కోట్ల పెట్టుబడి, 40 మందికి ఉద్యోగాలు, సత్యసాయి జిల్లాలో లభిస్తాయి. డివైస్ ఫార్మా టెక్ రూ.213.9 కోట్ల పెట్టుబడి, 114 మందికి ఉద్యోగాలు, తిరుపతి జిల్లాలో లభిస్తాయి..ప్రసాద్ సీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్, రూ.63.94 కోట్ల పెట్టుబడి, 200 మందికి ఉద్యోగాలు, ఏలూరు జిల్లాలో లభిస్తాయి. రెనాటస్ ప్రోడక్ట్స్ , రూ.350 కోట్లు, 370 మందికి ఉద్యోగాలు, తిరుపతి జిల్లాలో లభిస్తాయి. ప్రీమియర్ ఎనర్జీస్ ఇంగాట్ వేఫర్, రూ.3936.20 కోట్ల పెట్టుబడులు, 540 మందికి ఉద్యోగాలు, తిరుపతి జిల్లాలో లభిస్తాయి. జీరో 21 రెన్యూవబుల్ ఎనర్జీ రూ.525 కోట్లు పెట్టుబడి, 625 మందికి ఉద్యోగాలు, కర్నూలు జిల్లాలో లభిస్తాయి. అనంత్ టెక్నాలజీస్ రూ.1000 కోట్ల పెట్టుబడి 750 మందికి ఉద్యోగాలు నెల్లూరు జిల్లాలో లభిస్తాయి. స్పేస్ ఫీల్డ్స్ ప్రై.లిమిటెడ్, రూ.46.83కోట్ల పెట్టుబడి, 300మందికిఉద్యోగాలు, అనంతపురం జిల్లాలో లభిస్తాయి. ఐకామ్ టెలీ, రూ.895 కోట్లు పెట్టుబడి, 1320 మందికి ఉద్యోగాలు, జగ్గయ్యపేటలో లభిస్తాయి. అవెరాన్ పానల్స్, రూ.1123 కోట్ల పెట్టుబడి, 1200 మందికి ఉద్యోగాలు, గుడిపల్లె, శాంతిపురం చిత్తూరుజిల్లా లభిస్తాయి..సర్లా ఏవియేషన్, రూ.330 కోట్ల పెట్టుబడి, 40 మందికి ఉద్యోగాలు, తిమ్మ సముద్రం, అనంతపురం జిల్లా లభిస్తాయి.

న్యూట్రీ ఫీడ్స్ అండ్ ఫార్మ్స్, రూ.216 కోట్ల పెట్టుబడి, 480 మందికి ఉద్యోగాలు, చిత్తూరు జిల్లాలో .పతంజలి ఆయుర్వేద్, రూ.370.10 కోట్ల పెట్టుబడి, 2000 మందికి ఉద్యోగాలు, విజయనగరం జిల్లాలో లభిస్తాయి. అమరావతి క్వాంటం వ్యాలీ లో పెట్టుబడి ప్రతిపాదనలు,.క్యూపిఐ ఏఐ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, రూ.47.16 కోట్లు, 9 మందికి ఉద్యోగాలు, అమరావతిలో లభిస్తాయి..ఇంజిన్యువటీ నెక్సస్ టెక్నాలజీస్, రూ. 0.5 కోట్లు, 21 మందికి ఉద్యోగాలు, అమరావతిలో లభిస్తాయి,.సెంటర్ ఫర్ డెవలప్మెంట్ ఆఫ్ టెలిమాటిక్స్ సి.డాట్ రూ.10 కోట్లు, 5 మందికి ఉద్యోగాలు లభిస్తాయి. క్యూబిట్ ఫోర్స్, రూ.100 కోట్లు, 100 మందికి ఉద్యోగాలు, అమరావతి క్వాంటం వ్యాలీలో లభిస్తాయి. ఆటోమోనిక్స్, రూ.79.8 కోట్లు, 190 మందికి ఉద్యోగాలు, అమరావతి క్వాంటం వ్యాలీలో లభిస్తాయి..క్రిప్ట్ షీల్డ్, రూ10 కోట్లు, 20 మందికి ఉద్యోగాలు, అమరావతిలో లభిస్తాచి.. క్వాంటం బయో సైన్సెస్, రూ.22.5 కోట్లు, 10 మందికి ఉద్యోగాలు, అమరావతిలో లభిస్తాయి..ఫ్రూగల్ ఏఐ, రూ.2.6 కోట్లు, 6 మందికి ఉద్యోగాలు,అమరావతిలో లభిస్తాయి,.క్యూరియమ్ రూ.0.45 కోట్లు, 5 మందికి ఉద్యోగాలు, అమరావతిలో లభిస్తాయి. క్యూక్రిషి, రూ.25 కోట్లు, 100 మందికి ఉద్యోగాలు, అమరావతిలో లభిస్తాయి..ఎస్ఏఎస్ క్యూట్ ఎలక్ట్రానిక్స్ రూ.60 కోట్లు, 100 మందికి ఉద్యోగాలు, అమరావతిలో లభిస్తాయి..మొత్తం రూ. 30515 కోట్ల పెట్టుబడులతో పాటు 29677 మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. ఈ తీర్మానాలన్నింటికి మంత్రి మండలి అనుమతినిచ్చింది.

# మాజీ సిఐ నాగరాజు అరెస్టు

>> పుటేజిలో మే నెల నుండి జూన్ నెల వరకు మధ్యలో రెండు రోజులు మినహా మిగిలిన సిసి పుటేజి మొత్తం కనుమరుగయ్యింది. మాజీ సిఐ నాగరాజే ఈ సిసి పుటేజిని మాయం చేసి ఉంటాడని సిట్ బృందం భావిస్తోంది. అనంతరం స్వర్గపురిని చేరుకున్న సిట్ బృందం అక్కడ ఉన్న రికార్డులను పరిశీలించింది. వాటిలో రెండు మృతదేహాలు పంపుతున్నట్లుగా లేఖ వ్రాసి ఒకటే మృతదేహాన్ని కృష్ణలంక అప ్రటి సిఐ నాగరాజు పంపినట్లు రికార్డులలో తేటతెల్లమైంది. అంతేకాక స్టేషన్ నుండి వచ్చిన లెటరులో వయస్సును దిద్దినట్లుగా కనిపించడాన్ని కూడ సిట్ బృందం పరిశీలించింది. మే నెల 23న ఈ ఘటన జరిగినట్లు సిట్ బృందం అనుమానిస్తోంది. దీంతో ఈ కేసులో కీలక ఆధారాలను మాజీ సిఐ నాగరాజు మాయం చేశారని సిట్ బృందం భావిస్తూ ఆ దిశగా దర్యాప్తును వేగవంతం చేసింది. తొలగించిన సిసి పుటేజీ భాగాన్ని రికవరీ చేసేందుకు టెక్నికల్‌గా సిట్ బృందం చర్యలు చేపట్టినట్లు సమాచారం. దర్యాప్తుకు సంబంధించిన కీలకాంశాలను ఉన్నతాధికారులకు సిట్ బృందం తెలియచేసినట్లు సమాచారం. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం 18 నెలల పాటు సిసి పుటేజిని భద్రపర్చాల్సి ఉండగా స్టేషన్‌లోనే అవి మాయవవ్వడం పలు అనుమానాలకు తావిస్తోంది.

**నాగరాజు విచారణ**

మాజీ సిఐ నాగరాజును అదుపులోకి తీసుకున్న సిట్ ప్రత్యేక దర్యాప్తు బృందం అతనిని కూలంకుషంగా విచారణ చేపట్టింది. అసలు ఏం జరిగింది, ఎలా జరిగింది అనే విషయాన్ని సిఐని పలువిధాలుగా ఆధారలు చూపించి సిట్ బృందం విచారించినట్లు సమాచారం. నాగరాజుతో పాటు మరి కొందరు కానిస్టేబుళ్లతో పాటు స్టేషన్‌కు చెందిన పలువురు ఎస్ఐలు కూడ ఈ ఘటనలో పాలు పంచుకున్నారని సిట్ దర్యాప్తు బృందం ఒక నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. సిసి పుటేజి మాయం కావడం అనే అంశాన్ని దర్యాప్తు బృందం తీవ్రంగా పరిగణిస్తోంది. దాని రికవరీ కోసం తీవ్ర ప్రయత్నం చేస్తోందని సమాచారం.

**సిఐ మద్దతుదారుల ధర్నా**

సిఐ నాగరాజును అదుపులోకి తీసుకోడానికి పోలీసులు సింగ్‌నగర్‌కు వచ్చిన సమయంలో అక్కడ హై డ్రామా చోటు చేసుకుంది. సిఐ మద్దతుదారులంటూ కొంత మంది సిఐను అరెస్ట్ చేయద్దని నినాదాలు చేస్తూ ధర్నా నిర్వహించారు. అడ్డుగా నిలబడిన వారిని పోలీసులు బలవంతంగా తప్పించి సిఐ నాగరాజును అదుపులోకి తీసుకున్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం కల్గించిన సాయికృష్ణ అదృశ్యం కేసులో అసలు మిస్టరీ మరి కొద్ది రోజుల్లో వీడే అవకాశం ఉంది. దీనిలో సూత్రధారులు, పాత్రధారుల పాత్ర కూడ మరి కొద్ది రోజుల్లో తేటతెల్లమవనుంది. ఇంత దారుణంగా ఒక వ్యక్తిని మాయం చేయడం వెనుక నాగరాజు వెనుక మరిన్ని అదృశ్య శక్తులేవైనా ఉన్నాయా అనే విషయంపై కూడ బృందం లోతుగా విచారిస్తోంది.

# సింగిల్ పోర్టల్ ద్వారా పర్మిషన్లు

>> మించి ఈసారి పెద్దసంఖ్యలో రాష్ట్రానికి పరిశ్రమలను ఆకర్షించేలా విదేశాలతోపాటు దేశవ్యాప్తంగా పెద్దఎత్తున రోడ్ షోల నిర్వహణకు ప్రణాళికలు రూపొందించాలని మంత్రి లోకేష్ ఆదేశించారు. గత నెలరోజుల వ్యవధిలో 210 భారీ పరిశ్రమలు తర్వాత దశకు చేరుకున్నాయని అధికారులు చెప్పారు. ఐటీ అండ్ ఎలక్ట్రానిక్స్‌కు సంబంధించిన 26 ప్రాజెక్టుల పనులు చురుగ్గా కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రాజెక్టుల పురోగతికి సంబంధించి ప్రతి 15రోజులకోసారి కలెక్టర్లు, జిల్లాస్థాయి అధికారులతో రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు సమీక్షించాలని మంత్రి లోకేష్ కోరారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఆయా పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన పవర్, వాటర్, మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టిసారించాలని సూచించారు. రాష్ట్రంలో భారీగా విద్యుత్ డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో వివిధ స్టేజిల్లో ఉన్న రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. భారీ పరిశ్రమలతోపాటు రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటవుతున్న ఎంఎస్ఎంఇలను కూడా ఆన్ బోర్డు చేయాలనిఅన్నారు. త్వరలో భోగాపురం ఎయిర్ పోర్టు అందుబాటులోకి రానున్న నేపథ్యంలో విశాఖపట్నంలో సాధ్యమైనంత ఎక్కువగా హోటల్ గదులు అందుబాటులోకి తెచ్చేలా చర్యలు చేపట్టాలని పర్యాటకశాఖ అధికారులకు సూచించారు.

**స్లరీ పైప్ లైన్ పై అధ్యయనం చేయండి..**

స్పీడ్, స్టెబిలిటీ, సర్వీస్ మన ప్రభుత్వ ప్రత్యేకతలు, సులభతరమైన సర్వీస్ డెలివరీ అందించాలని మంత్రి లోకేష్ ఆదేశించారు. రాష్ట్రంలో గార్మెంట్ పరిశ్రమలను ఆకర్షించడానికి చేపట్టాల్సిన చర్యలు, అందించాల్సిన ప్రోత్సాహకాలపై సమావేశంలో చర్చించారు. ఎంప్లాయ్ మెంట్ లింక్డ్ ఇన్సెంటివ్స్ అందించే అంశాన్ని పరిశీలించాలని మంత్రి లోకేష్ ఆదేశించారు. ఇప్పటికే రాష్ట్రంలో ఉన్న టెక్స్ టైల్ పరిశ్రమలు క్యాప్టివ్ పవర్ ఉత్పత్తి చేసుకునేందుకు ఏడాదిపాటు బ్యాంకింగ్ ఫెసిలిటీ ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తామని అన్నారు.

అనకాపల్లి - విశాఖ - విజయనగరం జిల్లాలు స్టీల్ హబ్‌గా ఆవిష్కృతమవుతున్న నేపథ్యంలో కొత్తగా రాష్ట్రానికి వచ్చేందుకు మరికొన్ని ఉక్కు పరిశ్రమలు ఆసక్తిచూపుతున్నాయి,

ఇందులో ప్రధానమైన ముడిసరుకు సరఫరా కోసం స్లరీ పైప్ లైన్ కావాలని ఆయా సంస్థలు కోరుతున్నాయి, దీనిపై అధికారులు అధ్యయనం చేయాల్సిందిగా మంత్రి లోకేష్ సూచించారు. ఈ సమావేశంలో రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్, ఐటీ శాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్, పంచాయితీరాజ్, రూరల్ డెవలప్ మెంట్ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే, టూరిజం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్, ఎకనమిక్ డెవలప్ మెంట్ బోర్డు సీఈవో షన్మోహన్, స్కిల్ డెవలప్ మెంట్ డైరెక్టర్ గణేష్ కుమార్, ఏపీఐఐసీ ఎండీ ఏఎస్ దినేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# 11వేల కుటుంబాలకు పెన్షన్ భరోసా

• రాష్ట్ర సచివాలయ సంఘం అధ్యక్షులు రామకృష్ణ



**సచివాలయం, జూన్ 23 ప్రభాతవార్త:** రాష్ట్రంలో 2004 ప్రభుత్వ ఉద్యోగ నోటిఫికేషన్ కంటే ముందు ఉద్యోగాల్లో జాయినై, ప్రస్తుతం వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులను కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ నుంచి ఓల్డ్ పెన్షన్ స్కీమ్ పరిధిలోనికి తీసుకురావడానికి, వారికి ఆప్షన్ ఇవ్వడానికి మంత్రివర్గం ఆమోదం తెలిపిందని ఏపి సచివాలయ సంఘం అధ్యక్షులు రామకృష్ణ తెలిపారు. మంగళవారం సచివాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సుమారు 11,000మంది ఉద్యోగులు, వారి కుటుంబాల జీవితాల్లో ఈరోజు ఒక సుదినంగా మారిందని, చరిత్ర సృష్టించడంలో, చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకోవడంలో చంద్రబాబు నాయుడు ఎల్లప్పుడూ ముందుంటారని మరోసారి నిరూపితమైందని స్పష్టం చేశారు. రాష్ట్రం ప్రస్తుతం తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ, ఉద్యోగులకు మంచి చేయాలనే ఏకైక సంకల్పంతో ముఖ్యమంత్రి ఈ భారీ ఆర్థిక భారాన్ని లెక్కచేయకుండా ధైర్యంగా ముందుకు వెళ్లారని రామకృష్ణ కొనియాడారు. ఈ నిర్ణయం వల్ల ఒక్కో ఉద్యోగికి సుమారు రూ.3 కోట్ల వరకు జీవితకాల లబ్ధి చేకూరుతుందని ఆయన సవివరంగా వివరించారు. సచివాలయ సంఘం తరపున సిఎంకి, మంత్రి వర్గానికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ప్రకటించారు. ఉద్యోగుల పట్ల ఇంతటి ఆదరణ చూపిస్తున్న చంద్రబాబు నాయుడు ప్రభుత్వానికి తమ సచివాలయ సంఘం ఉద్యోగ లోకం అంతా ఎల్లప్పుడూ అండదండలుగా ఉంటుందని, ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ప్రతిష్టాత్మక సంక్షేమ పథకాలను లబ్ధిదారులైన ప్రజలందరికీ అత్యంత వేగంగా, సమర్థవంతంగా చేరవేసేలా ఉద్యోగ యంత్రాంగం అంతా రాత్రింబగళ్ళు కష్టపడి ప్రభుత్వానికి అన్ని విధాల సహకరిస్తుందని సచివాలయ సంఘం అధ్యక్షులు రామకృష్ణ స్పష్టం చేశారు.

## కేబినెట్ నిర్ణయంపై ఏపి జెఏసి హర్షం



**శ్రీకాకుళం, జూన్ 23 ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ జాయింట్ యాక్షన్ కమిటీ (ఏపిజెఏసి), ఏపి ఎన్జీవోస్ అసోసియేషన్ ఉద్యోగుల సంక్షేమం కోసం సాగించిన పోరాటంలో మరో రెండు చారిత్రాత్మక విజయాలు నమోదయ్యాయి. గత నాలుగు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల కీలక డిమాండ్లకు రాష్ట్ర మంత్రివర్గ సమావేశం (క్యాబినెట్) ఆమోదం తెలపడం పట్ల ఏపిజెఏసి శ్రీకాకుళం జిల్లా శాఖ తీవ్ర హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా ఏపి జెఏసి శ్రీకాకుళం జిల్లా చైర్మన్ హనుమంతు సాయిరాం, జిల్లా సెక్రటరీ జనరల్ బి.వెంకటేశ్వర్లు సంయుక్తంగా ఒక ప్రకటన విడుదల చేస్తూ, క్యాబినెట్ ఆమోదించిన రెండు కీలక నిర్ణయాల వివరాలను వెల్లడించారు. గత నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలు, గురుకుల విద్యాలయాల ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 60 నుండి 62 సంవత్సరాలకు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. జీఓ ఎంఎస్ నెంబర్ 57 ప్రకారం 01-09-2004 కంటే ముందు నోటిఫై చేయబడి, వివిధ కారణాలతో నిలిచిపోయిన సుమారు 11,000 మంది ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని (ఓపిఎస్) వర్తింపజేసేందుకు క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ చారిత్రాత్మక నిర్ణయాలకు ఆమోదం తెలిపిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఏపి జెఏసి శ్రీకాకుళం జిల్లా పక్షాన జిల్లా చైర్మన్ హనుమంతు సాయిరాం, జిల్లా సెక్రటరీ బి.వెంకటేశ్వర్లు హృదయపూర్వక కృతజ్ఞతలు, శుభాభినందనలు తెలియజేశారు. అలాగే ఈ విజయం సాధించిన జెఏసి రాష్ట్ర కార్యవర్గ సభ్యులందరికీ ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## అందుబాటులోకి కార్మిక సంక్షేమ బోర్డు వెబ్‌సైట్

**విజయవాడ, జూన్ 23 ప్రభాతవార్త:** కార్మిక సంక్షేమ కార్యక్రమాలను పారదర్శకంగా, వేగవంతంగా కార్మికులకు చేరవేసేందుకు కార్మికసంక్షేమబోర్డు రూపొందించి వెబ్‌సైట్‌ను రాష్ట్రకార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆవిష్కరించారు. విజయవాడలోని స్వర్ణప్యాలెస్ మీటింగ్‌హాల్లో కార్మిక సంక్షేమబోర్డు 45వ సమావేశం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిధిగా హాజరైన మంత్రి సుభాష్ మాట్లాడుతూ ఈవెబ్‌సైట్ ద్వారా కార్మికుల నమోదు, సంక్షేమ పథకాల దరఖాస్తులు, లబ్ధిదారుల వివరాలు, పథకాల మార్గదర్శకాలు, ఫిర్యాదుల పరిష్కారం వంటి సేవలు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో కార్మిక సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తున్నట్లు మంత్రి తెలిపారు. కార్మికులకు ప్రభుత్వ సేవలు మరింత చేరువయ్యేలా డిజిటల్ వేదికలను అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఈసమావేశంలో సంక్షేమ పథకాల అమలు, నమోదు ప్రక్రియల సరళీకరణ, కార్మికుల భద్రత, సామాజిక భద్రతా కార్యక్రమాల విస్తరణ తదితర అంశాలపై చర్చించారు. ఈకార్యక్రమంలో కార్మికశాఖ కార్యదర్శి యం.వి.శేషగిరిబాబు, కమీషనర్ గంధం చంద్రుడు, వెల్ఫేర్‌బోర్డు వైస్‌చైర్మన్ వెంకట శివుడ్ యాదవ్, బోర్డు సభ్యులు వై.వెంకటరమణి, ఆరా మహేశ్వరి, అరవరాజు నేలపాల, గదుల సాయి బాబు, బి.విశ్వనాధనాయుడు, డి.నారపరెడ్డి, చింత రేణుకరాజు, నల్లగొప్పుల వెంకటచలపతిరావు, పిడుగు వెంకటరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

# ఆస్పత్రిలో ముద్రగడ

## ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసిన జగన్



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి. జూన్ 23 ప్రభాతవార్త:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సభ్యులు, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం ఆరోగ్య పరిస్థితిపై ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. గత కొన్ని రోజులుగా అస్వస్థతతో హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ముద్రగడ ఆరోగ్య సమాచారాన్ని ఆయన నిరంతరం అడిగి తెలుసుకుంటున్నారు. ఈ క్రమంలోనే ముద్రగడ తనయుడు, ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇంచార్జ్ ముద్రగడ గిరిబాబుతో వై.ఎస్. జగన్ సోమవారం ఫోన్‌లో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ప్రస్తుతం అందుతున్న వైద్య చికిత్స వివరాలను, ఆయన ఆరోగ్య పురోగతిని గిరిబాబును అడిగి తెలుసుకున్న జగన్, కుటుంబ సభ్యులకు కొండంత ధైర్యాన్నిచ్చారు. ముద్రగడ వైద్యానికి అవసరమైన నిపుణులైన వైద్యుల బృందాన్ని కూడా జగన్ ఏర్పాటు చేసినట్లు తెలిసింది. కాగా, మెరుగైన చికిత్స అందుతుండటంతో ముద్రగడ మంగళవారం నాటికి చాలా వరకు కోలుకున్నట్లు సమాచారం అందింది.

**వైద్యులతో నిరంతరం మాట్లాడుతున్నా:** ముద్రగడ ఆరోగ్యంపై కుటుంబ సభ్యులు, అభిమానులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జగన్ పేర్కొన్నారు. ఆయన తప్పకుండా త్వరలోనే పూర్తి ఆరోగ్యంతో కోలుకుంటారని ఆశాభావం వ్యక్తంచేశారు. ముద్రగడకు అందుతున్న చికిత్సకు సంబంధించి తాను స్వయంగా వైద్యులతో మాట్లాడానని, ఆయన ఆరోగ్య పరిస్థితిని తాను దగ్గరుండి నిరంతరం పర్యవేక్షిస్తున్నానని ఈ సందర్భంగా గిరిబాబుకు వివరించారు. "మీరు నాకు కుటుంబ సభ్యుల్లాంటి వారు. ఎలాంటి ఆందోళన పెట్టుకోవద్దు, ధైర్యంగా ఉండండి"అని జగన్ ముద్రగడ కుటుంబానికి ధైర్యం చెప్పారు. మీకు ఏ చిన్న సహాయం కావాలన్నా నేరుగా తనకు ఫోన్ చేయవచ్చుని జగన్ స్పష్టంచేశారు. జగన్ స్వయంగా ఫోన్ చేసి మాట్లాడటంతో ముద్రగడ గిరిబాబుతో పాటు ఆయన కుటుంబ సభ్యులు, అభిమానులు, ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ శ్రేణులు కాస్త ఊరట చెందారు.

# అమరావతిలో రూ.426 కోట్లతో మౌలిక సదుపాయాల కల్పన



• జ్యుడీషియల్ అకాడమీ నిర్మాణానికి రూ.130 కోట్ల పనులకు అనుమతి
• అమరావతి ల్యాండ్ పూలింగ్ స్కీమ్‌ల కోసం సిఆర్‌డిఎ డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్లకు సంబంధించి 95 తాత్కాలిక పోస్టుల మంజూరు
• మంత్రివర్గ సమావేశం నిర్ణయాలు వెల్లడించిన మంత్రి కొలుసు పార్థసారథి

**విజయవాడ, జూన్ 23 ప్రభాతవార్త ప్రతినిధి:** అమరావతి పరిధిలోని ఉండవల్లి ప్రాంతంలో రూ.426 కోట్లతో మౌలిక సదుపాయాల కల్పన పనులకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని ఏపీ సమాచార,ప్రజా సంబంధాలశాఖ మంత్రి కొలుసు పార్థసారధి తెలిపారు.మంగళవారం సచివాలయంలోని సమాచార శాఖ సమావేశ ప్రాంగణంలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ పార్థసారధి కేబినేట్‌లో ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.ఏపీ జ్యుడీషియల్ అకాడమీ నిర్మాణానికి రూ.130 కోట్ల పనులకు మంత్రివర్గం అనుమతినిచ్చింది. అమరావతిలో 5 స్టార్ హోటళ్లు, కన్వెన్షన్ సెంటర్లకు ప్రోత్సాహకాలు ఇచ్చే ప్రతిపాదనలకు మంత్రిమండలి ఆమోదించిందని మంత్రి వివరించారు. బిసి బిడ్డల విద్యకు కూటమి ప్రభుత్వం భరోసా కల్పించింది. 10 ఎంజెపి గురుకులాలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. వీటిని ఎచ్చెర్ల (శ్రీకాకుళం), నక్కపల్లి (అనకాపల్లి), మాచర్ల (పల్నాడు), గిద్దలూరు (మార్కాపురం), గుంతకల్లు (అనంతపురం), రాయచోటి (అన్నమయ్య), పత్తికొండ, మంత్రాలయం (కర్నూలు), పెనుకొండ, కదిరి (శ్రీసత్యసాయి)లో ఏర్పాటు చేయనున్నారు. ఇందులో ఐదు బాలికలవి కాగా మరో ఐదు బాలురవి. అదేవిధంగా ఒక్కో గురుకులంలో 37 పోస్టులు భర్తీ చేయనున్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచే ఇవి ప్రారంభం కానున్నాయని తెలిపారు. అమరావతి ల్యాండ్ పూలింగ్ స్కీమ్ ఒకటి, రెండో దశల కోసం సీఆర్డీఏ డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్లకు సంబంధించి 95 తాత్కాలిక పోస్టుల మంజూరుకు కేబినెట్ ఆమోదం లభించింది. మచిలీపట్నం, రామాయపట్నం పోర్టుల పరిధిని 15 కిలోమీటర్లకు హేతుబద్ధీకరిస్తూ నిర్ణయం తీసుకుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఫుడ్ ప్రాసెసింగ్ మరియు వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను భారీగా ప్రోత్సహించే లక్ష్యంతో 'మెసర్స్ న్యూట్రి ఫీడ్స్ అండ్ ఫార్మ్స్ ప్రైవేట్ లిమిటెడ్', 'మెసర్స్ పతంజలి ఆయుర్వేద లిమిటెడ్' సంస్థలకు ప్రత్యేక ప్యాకేజీ కింద రాయితీలు మంజూరు చేసే సమగ్ర ప్రతిపాదనకు క్రింది విధంగా ఆమోదం తెలిపినట్లు మంత్రి వివరించారు. మెసర్స్ న్యూట్రి ఫీడ్స్ అండ్ ఫార్మ్స్ ప్రైవేట్ లిమిటెడ్ చిత్తూరు జిల్లాలో అత్యంత అధునాతన సాంకేతికతతో "ఇంటిగ్రేటెడ్ చికెన్ ప్రాసెసింగ్" కేంద్రాన్ని స్థాపించేందుకు ఈ సంస్థ సమర్పించిన పారిశ్రామిక ప్రతిపాదనకు అంగీకారం తెలపడమైనది. ఈ ప్రాజెక్ట్ ద్వారా సంస్థ మొత్తం రూ. 216.00 కోట్ల పెట్టుబడిని పెట్టడంతో పాటు, స్థానికంగా సుమారు 480 మందికి ప్రత్యక్ష ఉపాధి అవకాశాలను కల్పించనుంది. సదరు సంస్థకు సంబంధిత పాలసీల ప్రకారం ప్రత్యేక రాయితీలను మంజూరు చేయడానికి అనుమతించినట్లు వివరించారు.

# అమరావతిలో భారీ జెయింట్ వీల్

## 139 మీటర్లు 28 క్యాప్సూల్స్, భూమి కేటాయింపు

**విజయవాడ, జూన్ 23 ప్రభాతవార్త ప్రతినిధి:** రాజధాని అమరావతి పరిధిలో 139 మీటర్ల ఎత్తులో భారీ జెయింట్ వీల్ ఏర్పాటు చేయనున్నారు. దీనిలో మొత్తం 28 క్యాప్సూల్స్ ఉండనున్నాయి. ఒక్కో క్యాప్సూల్‌లో 20 నుంచి 25 మంది పట్టేలా ఏర్పాటు చేస్తున్నారు. దీనికి సంబంధించి ప్రణాళిక వివరాలను సిఆర్‌డిఎ వెబ్‌సైట్లో అప్‌లోడ్ చేశారు. అమరావతి గ్రోత్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యాన అమరావతి ఐ జెయింట్ ఐకానిక్ అబ్జర్వేషన్ వీల్ పేరుతో దీన్ని ఏర్పాటు చేయనున్నారు. పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ కింద డిబిఎఫ్‌ఒటి పద్ధతిలో 30 ఏళ్ల లీజు ఒప్పందం కింద దీన్ని నిర్వహించనున్నారు. అమరావతి (ప్రభుత్వ కార్యాలయాల కాంప్లెక్స్‌కు తూర్పు వైపున) కృష్ణా నది ఒడ్డున ఏర్పాటు చేయనున్నారు. ఇది అమరావతి స్తూపం, ధ్యాన బుద్ధ, అమరేశ్వర ఆలయ పర్యాటక ప్రాంతాలకు సమీపంలో ఉంటుందని ప్రణాళికలో పేర్కొన్నారు. భూమి మట్టం నుండి 139 మీటర్లు (లండన్ ఐ కంటే ఎత్తయినది, భారతదేశంలోనే అత్యంత ఎత్తయిన అబ్జర్వేషన్ వీల్)గా ఉంటుందని పేర్కొన్నారు.

128 మీటర్ల చక్రానికి 28 (పూర్తిగా ఎయిర్‌కండిషన్డ్, మెకానికల్ స్టెబిలైజ్డ్) క్యాప్సూల్స్ ఉండనున్నాయి. ఈ వీల్ ఒక రౌండ్ తిరగడానికి బోర్డింగ్‌తో కలిపి సుమారు 27 నిమిషాలు పట్టనుంది. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు నిర్వహించనున్నారు. ఏడాదికి 255 రోజులూ ఆదాయం వస్తుందని తెలిపారు. ప్రాజెక్ట్ ఆర్థికంగా లాభసాటిగా మారేందుకు వీలుగా దీనిని రెండు భాగాలుగా (కేవలం వీల్ ప్రాజెక్ట్, కమర్షియల్ డెవలప్‌మెంట్) విభజించారు.

వీల్ ప్రాజెక్టును ఐదెకరాల్లో రూ. 120 కోట్లతో చేపట్టనున్నారు. తొలి ఏడాది టికెట్ ఆదాయం (2027) రూ. 32.34 కోట్లు ఉంటుందని ప్రాజెక్టు నివేదికలో పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుకు అనుబంధంగా ఎకరం స్థలంలో కమర్షియల్ మార్కెట్ పెట్టనున్నారు. వీల్ నిర్వహణలో వచ్చే నష్టాన్ని దీని ద్వారా పూడ్చనున్నారు.ఢిల్లీ ఐ వైఫల్యం నేపథ్యంలో అమరావతి ఐ ప్రాజెక్టులో ఆ లోపాలు లేకుండా నిర్వహించాలని నిర్ణయించినట్లు అందులో పేర్కొన్నారు. అమరావతి కొత్త నగరం కావడం వల్ల ప్రారంభంలో సందర్శకుల సంఖ్య పరిమితంగా ఉండవచ్చని అంచనా వేశారు. వర్షాకాలం (110 రోజులు) ఆదాయం తగ్గుతుందని పేర్కొన్నారు. అదే సమయంలో గంటల ప్రయాణ దూరంలో 1.3 కోట్ల మంది స్థానిక జనాభా, ఏటా రాష్ట్రానికొచ్చే 25.5 కోట్ల పర్యాటకుల భారీ మార్కెట్ కూడా ఉంటుందని వివరించారు.

# ప్రకృతి వ్యవసాయంతో పశుగ్రాస భద్రతకు శ్రీకారం

• పచ్చిమేత కొరత నివారణకు చర్యలు • కరపత్రాలను విడుదల చేసిన మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

**విజయవాడ, జూన్ 23 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో రానున్న వ్యవసాయ సీజన్‌లో ఎల్‌నినో ప్రభావంతో తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాల నేపథ్యంలో పశుసంపద రక్షణ, పశుపోషకుల ప్రయోజనాల కోసం ప్రభుత్వం ముందస్తు కార్యాచరణ చేపట్టింది. వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొంటూ పశువులకు పచ్చిమేత కొరత తలెత్తకుండా చూడాలనే లక్ష్యంతో పశుసంవర్ధక శాఖ ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పశుగ్రాసాల సాగును ప్రోత్సహిస్తోంది. ఇందులో భాగంగా "ప్రిమాన్సూన్ డ్రై సోయింగ్" విధానంపై రూపొందించిన అవగాహన కరపత్రాలను రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మంగళవారం విజయవాడలోని తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ, వాతావరణ మార్పుల ప్రభావం వ్యవసాయంతో



పాటు పశుసంపదపై కూడా పడుతున్న నేపథ్యంలో రైతులు, పశుపోషకులు పరిస్థితులకు అనుగుణంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. తక్కువ వర్షపాతం నమోదైనప్పటికీ ప్రకృతి వ్యవసాయ సాంకేతికతలను అనుసరించడం ద్వారా మెరుగైన పశుగ్రాస దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. పచ్చిమేత లభ్యత, పశుగ్రాస నిల్వ, తాగునీటి వసతులు, పశుసంరక్షణ చర్యలపై సమగ్ర సమాచారం అందించేందుకు ఈ కరపత్రాలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. గ్రామస్థాయిలో పశుసంవర్ధక శాఖ సిబ్బంది ద్వారా రైతులు, పశుపోషకులకు ఈ కరపత్రాలను పంపిణీ చేసి విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు మంత్రి తెలిపారు. పశుసంపద పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఎలాంటి ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఎదురైనా పశుపోషకులకు అండగా నిలుస్తుందని స్పష్టంచేశారు. పశుసంవర్ధక శాఖ సంచాలకులు డా. టి. దామోదర నాయుడు మాట్లాడుతూ వాతావరణ మార్పుల నేపథ్యంలో ముందస్తు ప్రణాళికతో వ్యవహరించడం ద్వారా పశుసంపదను సంరక్షించుకోవచ్చన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులు, పశుపోషకులకు అవగాహన కల్పించేందుకు ఈ కరపత్రాలను ముద్రించి పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పీతల సుజాత, పశుసంవర్ధక శాఖ సంచాలకులు డా. టి. దామోదర నాయుడు, శాఖ ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఏలూరు- పోలవరం కాలువల అనుసంధానానికి నిధులు మంజూరు

## ఫలించిన గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ కృషి

భూములకు సాగునీటి ఇబ్బందులు తొలగించేందుకు గానూ ఏలూరు- పోలవరం కాలువల అనుసంధానినికి ఎట్టకేలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఏలూరు కాలువ ఆయకట్టు చివరి మండలాలైన కృష్ణాజిల్లా ఉంగుటూరు, బాపులపాడు, ఏలూరుజిల్లా పెదపాడు, ఏలూరు మండలాల పరిధిలోని పంటభూములకు ఖరీఫ్ సీజన్‌లో సాగునీటి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈనేపథ్యంలో బాపులపాడు మండలంలో పోలవరం కాలువ, ఏలూరు కాలువలు పక్క పక్కనే వెళుతున్నప్పటికీ నీరు ప్రకాశం బ్యారేజ్ వద్దకు చేరుకుని తిరిగి ఈమండలాలకు దాదాపు 100 కిలోమీటర్లు ప్రవహించాల్సి ఉంది. ఈ ప్రాంత రైతుల సాగునీటి ఇబ్బందులు తొలగించేందుకు 2018లో అప్పటి టిడిపి ప్రభుత్వం బాపులపాడు మండలం బండారుగూడెం వద్ద నుండి పోలవరం కాలువ నీటిని ఏలూరు కాలువకు మళ్ళించేందుకు రూ.15.35కోట్లు నిధులు శంకుస్థాపన చేసారు. తదుపరి వైసిపి ప్రభుత్వం రావటంతో ఈపనులను రద్దుచేసారు. గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ ఎన్నికల సమయంలో ఈరెండు కాలువలు అనుసంధానానికి నిధులు మంజూరు చేయించి రైతుల సాగునీటి ఇబ్బందులు తొలగిస్తానని రైతులకు హామీ ఇచ్చారు. అనంతరం అధికారంలోకి వచ్చిన తరువాత జలవనరులశాఖ ఇంజనీర్లతో తాజాగా అంచనాలు రూపొందించి, జలవనరులశాఖకు ప్రతిపాదనలు అందించారు. ఈప్రాజెక్టు అనుమతులు, నిధుల మంజూరుకు తన వంతు ప్రయత్నాలు చేసారు. నిధుల మంజూరు కోసం పలు ధఫాలు మంత్రి నిమ్మల రామానాయుడును, ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి ఈరెండు కాలువల అనుసంధానం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించి నిధులు మంజూరు చేయించారు. పోలవరం కుడికాల్వ 137.290కిలోమీటర్ల వద్ద బండారుగూడెం వద్ద ఎత్తిపోతల పథకం నిర్మించి గోదావరినీటిని వాగులోకి ఎత్తిపోస్తారు. ఇక్కడి నుండి 3.5కిలోమీటర్లు వాగు ద్వారా ప్రవహించి ఏలూరుకాల్వ 36 కిలోమీటర్ల వద్ద ఏలూరు కాల్వలో కలుస్తుంది. ఈపథకం కోసం ప్రభుత్వం జివోనెం 335 ద్వారా రూ.38.21కోట్లు మంజూరు చేస్తూ జివో విడుదల చేసింది. రెండు కాలువల అనుసంధానం వల్ల నాలుగు మండలాల్లోని ప్రజలకు తాగునీరు, సాగునీటి ఇబ్బందుల నుండి ఉపశమనం లభించనుంది. ఈమేరకు సోమవారం గన్నవరం ఎయంసి చైర్మన్ గూడవల్లి నరసింహారావు, ఎన్ఎస్‌పి ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షులు ఆళ్ల గోపాలకృష్ణ, టిడిపి నాయకులు దొంతు చిన్న, గొడ్డళ్ళ చిన్నరామారావు, గూడపాటి తులసీమోహన్, చిరుమామిళ్ళ సూర్యం, తదితరులు మీడియా సమావేశం నిర్వహించి నిధుల మంజూరుకు కృషిచేసిన ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్‌కు, నిధులు మంజూరుకు సహకరించి మంత్రి నిమ్మల రామానాయుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడకు కృతజ్ఞతలు తెలిపారు.

## మాజీ సిఐ నాగరాజుకు అనుకూలంగా ధర్నాలు..

# కూపీ లాగుతున్న ఇంటెలిజెన్స్?

ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ఉద్యమించిన వారిపై చర్యలకు సన్నద్ధం

**విజయవాడ (క్రైం),జూన్ 23 ప్రభాతవార్త:** గాదె సాయికృష్ణ అదృశ్యం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ సిఐ నాగరాజుకు అనుకూలంగా అతని మద్దతుదారులు ర్యాలీలతో పాటు నాగరాజు అరెస్ట్‌ను అడ్డుకోవడానికి యత్నించడంతో వారిపై ప్రభుత్వం కన్నెర్ర చేసింది. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా నాగరాజుకు అనుకూలంగా ఉద్యమించిన వారి డేటాను సేకరించమని ఇప్పటికే ఇంటలిజెన్స్ వర్గాలకు ఆదేశాలిచ్చినట్లు సమాచారం. వారి వివరాలు తెలిసిన తర్వాత వారిపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ పెద్దలు సిద్ధమైనట్లు తెలియవచ్చింది. వారు నాగరాజు ద్వారా లబ్ధి పొందారని, అందువలనే ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ఉద్యమిస్తున్నారని ప్రభుత్వ పెద్దలు ఆలోచిస్తున్నట్లు సమాచారం. మొత్తానికి ఈ హై డ్రామా వెనుక ఉన్న తలకాయల ఆనుపానులు త్వరలో తెలియనున్నాయి.

**నోరు మెదపని సిఐ నాగరాజు... నార్కో అనాలసిస్ టెస్ట్ జరగాల్సిందేనా?:** విచారణలో గాదె సాయికృష్ణ అదృశ్యం విషయంపై ఆరోపణలు ఎదుర్కొంటున్న సిఐ నాగరాజు సిట్ బృందం ఎదుట నోరు విప్పలేదని గుసగుసలు వినవస్తున్నాయి. దాంతో అసలు ఏం జరిగింది,ఎప్పుడు జరిగింది,టాస్క్‌ఫోర్స్ ఎసిపి లతాకుమారి బృందం మార్కాపురం నుండి సాయికృష్ణను తీసుకువచ్చిన అనంతరం సిఐ నాగరాజు ఎందుకు అదుపులోకి తీసుకున్నాడు ఇత్యాది విషయాలపై సిట్ దర్యాప్తు బృందం ఇప్పటికే విచారించింది. అయితే నాగరాజు గాదె సాయికృష్ణ అదృశ్యం గురించి నోరు విప్పక పోవడంతో న్యాయస్థానానికి దీని గురించి ఏం చెప్పాలో అనే విషయంపై అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. పరిస్థితులను బట్టి న్యాయస్థానం అనుమతితో నార్కో అనాలసిస్ టెస్ట్ చేయిస్తేనే కానిస నాగరాజు నుండి అసలు నిజాలు బయటకు రావని పలువురు అధికారులు యోచిస్తున్నట్లు సమాచారం.ఒక వ్యక్తిని మాయం చేసి ప్రభుత్వానికి మాయని మచ్చ తెచ్చిన నాగరాజు విషయంపై ప్రభుత్వ కూడ సీరియస్‌గా చర్యలు తీసుకోనున్నట్లు తెలియవచ్చింది.

# క్రిమినల్స్‌తో వైసిపి రాజకీయం

• జాగ్రత్త అంటూ మంత్రులకు సిఎం హితబోధ

**విజయవాడ, జూన్ 23 ప్రభాతవార్త ప్రతినిధి:** క్రిమినల్స్‌ను వైసిపి వెనకేసుకొస్తూ రాజకీయం చేస్తోందని సిఎం చంద్రబాబు ఆరోపించారు. కేబినెట్ సమావేశం అనంతరం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పలు కీలక వ్యాఖ్యలు చేశారు. వైసిపి నేతలు కుల మీటింగ్‌లు పెడుతూ కులాల మధ్య చిచ్చుపెట్టే కుట్రల్ని దీటుగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కర్నూలులో ఇటీవల చోటుచేసుకున్న ఘటనను ప్రస్తావించిన ముఖ్యమంత్రి, గ్రామస్థులే బహిష్కరించిన వ్యక్తులకు వైసిపి మద్దతుగా నిలవడం విచారకరమని వ్యాఖ్యానించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను అనవసర వివాదాల్లోకి లాగేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని, అలాంటి సందర్భాల్లో కూటమి ఐక్యతను చాటే విధంగా మంత్రులంతా స్పందించాలని సూచించారు. ప్రభుత్వ పనితీరును మరింత సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లాలంటే ప్రతి మంత్రి అన్ని శాఖలపై అవగాహన పెంచుకోవాలని అన్నారు. అభివృద్ధి కార్యక్రమాలపై కూడా సిఎం కీలక ప్రకటనలు చేశారు. జొన్నగిరి గ్రామాన్ని 'స్వర్ణ గ్రామం'గా నామకరణం చేయాలని ప్రతిపాదించారు. అలాగే జులై 3న కడప స్టీల్ ఫ్యాక్టరీకి శంకుస్థాపన చేయనున్నట్లు సిఎం చంద్రబాబు వెల్లడించారు.

# వడ్డెరలకు క్వారీల్లో 33శాతం వాటా

• ప్రభుత్వ ఉత్తర్వులు జారీ • తమది మాటల ప్రభుత్వం కాదు.. చేతల ప్రభుత్వం • మంత్రి నారా లోకేశ్



మంత్రి మండలి సమావేశంలో నారా లోకేష్

**విజయవాడ, జూన్ 23 ప్రభాతవార్త ప్రతినిధి:** వడ్డెర సహకార సంఘాలకు క్వారీ లీజుల కేటాయింపునకు ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు ఎపిఎంఎంసి నియమావళిని గనుల శాఖ సవరించింది. ఖనిజాల కోసం క్వారీ లీజుల్లో వడ్డెర సహకార సంఘాలకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు క్వారీల గనుల లీజుల్లో వడ్డెరులకు ప్రత్యేక ప్రాధాన్యతను కల్పిస్తామని ఎన్నికల సమయంలో వాగ్దానం చేసారు. ఇటీవల మంత్రి మండలి ఈ దిశలో నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో వడ్డెర సహకార సంఘాలకు క్వారీ లీజుల కేటాయింపునకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. మంగళవారం మంత్రివర్గ సమావేశంలో జరిగిన చర్చలో మంత్రి నారా లోకేష్ ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలన్నింటిని అమలు చేస్తోందని, ఈ విషయాన్ని ప్రజల్లో తీసుకుని వెళ్దామన్నారు. గత మంత్రిమండలిలో తీర్మానం మేరకు వడ్డెరలకు క్వారీల్లో 33శాతం వాటా ఇస్తూ ప్రభుత్వం జిఒ విడుదల చేసింది. తమది మాటల ప్రభుత్వం కాదు.. చేతల ప్రభుత్వం అని మంత్రి నారా లోకేశ్ అన్నారు. ఇచ్చిన ప్రతి హామీనీ నెరవేర్చే దిశగా కూటమి ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. 'యువగళం పాదయాత్రలో ప్రజలు పడుతున్న కష్టాలు ప్రత్యక్షంగా చూశా. నాటి పాదయాత్ర సమయంలో తమ కులవృత్తిని కొనసాగించేందుకు క్వారీలు కేటాయించాలని వడ్డెర సోదరులు నన్ను కలిశారు. ఆనాడు నేను ఇచ్చిన హామీ మేరకు క్వారీల్లో 33శాతం వాటాను వడ్డెరలకు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో నెం. 126 జారీ చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజా సంక్షేమం, సామాజిక న్యాయమే ధ్యేయంగా ముందుకు సాగుతోంది' అని అన్నారు. ప్రభుత్వ తాజా నిర్ణయంపైట్ల వడ్డెర సంఘాల నేతలు, కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## నేడు కృష్ణా జిల్లాలో మంత్రి లోకేష్ పర్యటన

**గన్నవరం(కృష్ణా), జూన్ 23 ప్రభాతవార్త:** రాష్ట్రవిద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష బుధవారం కృష్ణాజిల్లాలో పర్యటించనున్నారు. ఈమేరకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేసారు. లోకేష్ పర్యటన వివరాలు షెడ్యూల్ ప్రకారం ఇలా ఉన్నాయి. బుధవారం ఉదయం 10గంటలకు అవనిగడ్డ నియోజకవర్గం మోపిదేవి మండలం కొక్కిలిగడ్డ గ్రామంలో నూతనంగా నిర్మించిన జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను ప్రారంభించనున్నారు. ఉదయం 11.10 గంటలకు మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవాలయాన్ని సందర్శించి స్వామివారిని దర్శించుకుంటారు. మధ్యాహ్నం 12గంటలకు మోపిదేవి గ్రామంలోని ఎస్.విహార్ హోటల్‌లో అవనిగడ్డ నియోజకవర్గ టిడిపి కార్యకర్తలు, నేతలతో సమన్వయ సమావేశంలో పాల్గొంటారు. అనంతరం అవనిగడ్డ మండలం పులిగడ్డ గ్రామంలోని గురుకుల పాఠశాల వద్ద మత్యకారులతో సమావేశం అవుతారు.

# ఆధ్యాత్మికతకు ప్రాంతీయ సరిహద్దులుండవు

## మలేసియాలో ఆధ్యాత్మిక మహాసభలో ఉమర్ ఆలీషా




**విజయవాడ, జూన్ 23 ప్రభాతవార్త:** ఆధ్యాత్మికతకు ప్రాంతీయ సరిహద్దులు ఉండవని అది విశ్వశాంతికి, ప్రపంచ మానువులందరినీ ఒక్కటిగా నిలిపే అఖండ సోదరభావానికి మూలస్తంభమని శ్రీవిశ్వవిజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠం 9వ పీఠాధిపతి, రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (యుఏఆర్‌డిటి) చైర్మన్ డాక్టర్ ఉమర్ ఆలీషా పేర్కొన్నారు. మలేషియా రాజధాని కౌలాలంపూర్‌లోని బ్రిక్స్‌ఫీల్డ్స్ షిరిడీ సాయిబాబా సొసైటీ ప్రాంగణంలో శ్రీవిశ్వవిజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠం మలేషియాశాఖ ఆధ్వర్యంలో 5వ ఆధ్యాత్మిక మహాసభ ఆదివారంరాత్రి జరిగింది. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిధిగా హాజరైన ఉమర్ ఆలీషా అనుగ్రహ భాషణ చేస్తూ నేటి తరం యువత మూఢనమ్మకాలకులోను కాకుండా వైజ్ఞానిక దృక్పథాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. ఆధ్యాత్మిక వివేకంతో సమాజసేవలో పాలుపంచుకోవాలని కోరారు. అందరూ సోదరభావంతో ముందుకు సాగాలని, కులమతాలకు అతీతరంగా ఐకమత్యంతో ఉండాలని హితవు పలికారు. మానవసేవే మాధవసేవ అని సాటి మానవులకు సేవ చేస్తే అది దైవానికి చేసినట్లే అన్నారు. ప్రతి ఒక్కరూ విలువలతో కూడిన జీవనం సాగించాలని సూచించారు. తమస ంస్థ గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు వైద్య, పౌష్టికాహారం పంపిణీ, విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈకార్యక్రమంలో పార్లమెంట్ సభ్యులు బి.సరస్వతి కందస్వామి, గిడుగు ఫౌండేషన్ వ్యవస్థాపకులు గిడుగు కాంతికృష్ణ, తెలుగు అసోసియేషన్ ఆఫ్ మలేషియా మాజీ అధ్యక్షులు డాక్టర్ అచ్చయ్యకుమార్, మలేషియా షిరిడీసాయిసొసైటీ డిప్యూటీ చైర్మన్ రాజ్‌కుమార్, ఇన్నోవాట్జ్ గ్రూప్ వ్యవస్థాపకులు నిఖిల్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY (APCRDA)
Rayapudi, Thullur Mandal, Amaravati-522237 (A.P.)
NIT No: MAU61-USI0HB/4/2026-HB/2nd call, Dt: 22-06-2026
E PROCUREMENT TENDER NOTICE (SECOND CALL)
Name of Work: "APCRDA-H&B Maintenance-Operation and Maintenance of Street Lighting in VIP Routes of Amaravati Capital Region and Seed Access Road for one year" Estimate Amount: Rs. 1,03,50,000/-. The bid can be downloaded on AP e-procurement portal from 24.06.2026 to 09.07.2026 up to 14.00 Hrs. Due date for submission of Bid 09.07.2026 up to 15.00 Hrs, Technical bid opening 09.07.2026 @ 16.00 Hrs. For further details please refer to www.apeprocurement.gov.in and www.crda.ap.gov.in
Sd/- Commissioner, APCRDA, Rayapudi


వార్త

కోపాన్ని జయించలేనివాడికి ఇతరుల సామర్థ్య లోపాన్ని విమర్శించే హక్కు ఉండదు.

- ఇ.గిబ్బన్


# ప్రమాద నివారణకు దారిలేదా?

కాదు కాదని ఎంత బుకాయించినా, ఇలాంటివి ఇకపై తగ్గిద్దాంలే అంటూ ఎన్ని మాయమాటలు చెప్పినా ఇరుకిరుకు నివాసాల్లో భవంతుల్లో ఆకాశ హర్మ్యాల్లో సైతం ఊహించని అగ్నిప్రమాదాలను ఆపలేం. కళ్లెదుట మాడి మసైపోతున్న మానవ శరీరాలను చూసి నోరెళ్ల బెట్టడమే మనకు మిగిలింది. మానవ తప్పిదాన్ని కూడా కప్పెట్టే అధికార నైజం, సిబ్బంది నిర్లక్ష్యం ఇవన్నీ వెరసి దేశం ఎక్కడికెళ్తుందో తెలియని అయోమయ పరిస్థితి. నిన్న జరిగిన అగ్నిప్రమాదం, అందులోంచి బయటపడిన విగత జీవులు, అగ్నికి ఆహుతైన క్షణాలు గమనిస్తే ఎవరికైనా కళ్లు చెమరుస్తాయి. నాన్నా! నన్ను కాపాడమంటూ కోచింగ్ విద్యార్థులు పొగచూరిన గదుల్లో చిక్కుకుపోయి కన్నవారికి సెల్‌ఫోన్‌లలో చేసిన కన్నీటి వేడికోళ్లే వారి చివరి సంభాషణలు. కళ్ల కన్నీరు కారుస్తాయి. అయినా అధికారంగణం స్పందించదు. మరో ప్రమాదం జరుగకుండా ఆపగలిగిన పరిస్థితి కనపడదు. ఇలాంటి జాబితాలో తాజాగా ఉత్తరప్రదేశ్ రాష్ట్రం లఖ్‌నవూలో జరిగిన సంఘటనే తార్కాణం. లఖ్‌నవూలో మరో కోచింగ్ సెంటర్‌లో 15 మంది సజీవ దహనమైపోయారు. కోచింగ్ సెంటర్, గేమింగ్ జోన్ ఉన్న భవంతిలో సోమవారం భారీ అగ్నిప్రమాదం జరిగింది. లఖ్‌నవూలోని ఆలీగంజ్ ప్రాంతంలోని ఓ మూడంతస్తుల భవనంలో మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో జరిగిన అగ్నిప్రమాదంలో ఆ భవనం అంతా కాలిపోయి మసి బొగ్గులా ప్రత్యక్షమైంది. భవనంపైన యానిమేషన్ కోచింగ్ క్లాసులు జరుగుతుండగా కింది అంతస్తు నుంచి మంటలు పైకెగిసాయి. ప్రమాదం జరిగిన ఆ సమయంలో 30 మంది విద్యార్థులున్నారు. వారిలో కొందరు చుట్టూ పొగలు వ్యాపిస్తున్నా మంటలు ముఖం మీదపడగా హాహాకారాలు చేస్తూ వారిలో కొందరు తమ ప్రాణాలు కాపాడేందుకు కిందికి దూకేసారు. అలా దూకలేనివారు మాత్రం కాలి బూడిదయ్యారు. ఈ సంఘటనపై చెప్తూ ఉపముఖ్యమంత్రి బ్రిజేష్ పాఠక్ సైతం కన్నీళ్ల పర్యంతమయ్యారు. ఉషామెహతా మార్గ్‌లోని కమర్షియల్ ఏరియాలో ఉన్న ప్రమాద స్థలిలో గ్రౌండ్ ఫ్లోర్‌లో పెంపుడు జంతువుల దుకాణం, పై అంతస్తుల్లో కోచింగ్, గేమింగ్ సెంటర్‌లున్నాయి. నిరంతరం విద్యార్థులు తమ కోచింగ్‌పై అక్కడే ఉంటుంటారు. మంటలు భారీగా వ్యాపించాయి. విద్యార్థులకు తప్పించుకునే దారి దొరకలేదు. దాదాపు పద్దెనిమిది మంది పై అంతస్తు నుంచి దుమికారు. స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఒకే భవనంలో చిన్న అగ్ని ప్రమాదంగా జరిగినా అగ్నిమాపక సిబ్బంది తీరిగా అరగంట దాటాక ప్రమాదస్థలి చేరుకోవడంలో బాధితు లకు సహాయ సహకారాలేమీ అందలేదు. తక్షణమే వచ్చి ఉంటే పై అంతస్తులో చిక్కిపోయిన వారిలో మరి కొందరినైనా బయటకు తెచ్చే పరిస్థితి ఉండేది. 19 ఫైర్ ఇంజిన్‌లు, ఒక భారీ హైడ్రాలిక్ ప్లాట్‌ఫారం మంటలను ఆర్పేందుకు అక్కడికి చేరుకున్నాయంటే ఇదెంత భారీ అగ్నిప్రమాదమో చెప్పుకోవచ్చు. గ్రౌండ్ ఫ్లోర్‌లో దుకా ణంలోని పక్షిజాతి జంతువులన్నీ అగ్నికిఆహుతయ్యాయి. ఎప్పటికప్పుడు ఇలాంటి అగ్ని ప్రమాదాల కొత్తేమీ కాదని సరిపెట్టుకోవడం విచిత్రం. ఒక దుస్సంఘటన మరో దుస్సంఘటనకు మార్గదర్శకం కాకూడదు. జరిగినలోపాల బేరీజుతో వాటిని సరిదిద్దుకోవాలి తప్పితే ఇక మనం చేయగలిగేదేమీ లేదని సరిపెట్టుకోవడం మంచిదికాదు. ప్రభుత్వ శాఖలు అగ్నిమాపక సంస్థలు తమ విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించడమే ఇందుకు కారణం. నిరంతర పర్యవేక్షణ ఉంటే ఇలాంటి అగ్ని ప్రమాదాల స్థాయి తగ్గించగలుగుతారు. ప్రాణనష్టాలు జరుగుతున్న సందర్భాలన్నీ దిగ్భ్రాంతి కలిగించేవే. పలువురిలో చర్చ నీయాంశంగా కూడా ఉంటాయి. ప్రభుత్వ వైఫల్యాలపై నిఘా లేకుంటే మళ్లీ మళ్లీ ఇటువంటి ఘోర ప్రమాదాలు జరగవని గ్యారంటీ ఇవ్వలేం. సంఘటనలు జరిగాక సమీక్షించుకుని కఠిన చర్యలు తీసుకుంటే అటువంటి ప్రమాదాలు మరోసారి జరగవు. కోచింగ్ సెంటర్లకు వచ్చిన విద్యార్థులు ప్రమాదాల బారిన పడి మృతిచెందడం ఇదే మొదటి సారి కాదు. ఢిల్లీలో ఇలాంటి సంఘటనే జరిగింది. లక్నో ఘటన పూర్తి నిర్లక్ష్యానికి సమూల సాక్ష్యం. కోచింగ్ సెంటర్లు, ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యార్థులతో నిండిపోయి ఉంటాయి. వాటికి అత్యవసర నిష్క్రమణ మార్గాలు, ఫైర్ అలారంలు, స్ప్రింక్లర్ వ్యవస్థలు, భద్రతా శిక్షణ వంటి అంశాలపై ఏ ప్రభుత్వ సంస్థా వాటి అమలుకు ప్రయత్నించదు. భద్రతా చర్యలు ఏవైనా ఉన్నా అవి కాగితాలపైనే ఉంటాయి. వాళ్లు తీసుకోగలిగిన జాగ్రత్తల విషయమై నిర్దిష్టంగా వారే అమలు చేయాల్సిన అవసరాన్ని ప్రభుత్వమే జరిగిన ప్రమాదాల నుంచి గుణపాఠాలు నేర్చుకోవడం మంచిది. వాణిజ్య సంస్థలు భద్రతా నిబంధనలు ఉల్లంఘిస్తే ఎలాంటి చర్యలు తీసుకుంటామో విశదీకరించాలి. ఆయా సంస్థల అడుగులకు మడుగులొత్తుతూ జరిగిననేరాల నుంచి వారిని తప్పించేందుకు సహకరించకూడదు. ఇలాంటి సందర్భాల్లో ప్రాణనష్టానికి బాధ్యత ఎవరు వహించాలో స్పష్టంగా నిర్ణయించగలిగితే తప్పుడు విధానాలు అవలంబించే సమయంలో అడ్డుకోవచ్చు. మానవ నిర్లక్ష్యంలో జరిగిన విపత్తులలో ఘోరవిపత్తులకు కారకులైన వారిని ఎట్టి పరిస్థితులలోనూ వదలరాదు. అనుమతిలేని అక్రమ నిర్మాణాలకు అవకాశమీయరాదు. అప్పుడే అగ్నిప్రమాదాలను నివారించగలం. విద్యాసంస్థలు, కోచింగ్ సంస్థల్లోని అంతస్తులో ఫైర్ ఎక్స్టింగ్విషర్లు ఉండాలి. ఎమర్జెన్సీ ఎగ్జిట్ అందుబాటులో ఉండాలి. ప్రాణభద్రతను కాగితాల మీద కాకుండా కార్యరూపంలో అమలు చేయడం అవసరం.



పదేళ్ల పుస్తక పఠనం కంటే, విజ్ఞుడితో గడియ ముచ్చట్లు మేలు.

టి. ఫుల్లర్



పొగిడే వాడి పట్ల జాగ్రత్తగా ఉండు. లేనిచో ఖాళీ కంచంతో నీ కడుపు నింపగలడు.

ఆస్కార్ వైల్డ్

## ప్రజావాక్కు

### పరిమితులకు లోబడి సాంకేతికత

పదహారేళ్లలోపు వయసున్న పిల్లలకు సామాజిక మాధ్యమాలవాడకాన్ని పూర్తిగానిషేధించాల్సిన ఆవశ్యకత ప్రస్తుతంఎంతైనా ఉంది. ఆధునిక కాలంలో సాంకేతికత విస్తరించడం వల్ల చిన్న వయసులోనే పిల్లలు డిజిటల్ ప్రపంచానికి బానిసలుగా మారుతున్నారు. దీనివల్ల వారి మానసిక ఆరోగ్యం దెబ్బతినడమే కాకుండా, శారీరక శ్రమ తగ్గిపోతోంది. సామాజిక మాధ్యమాలలో వచ్చే అపరిమితమైనసమాచారం, హానికరమైన కంటెంట్, సైబర్ వేధింపులు పిల్లల సున్నితమైన మనస్సులపై తీవ్ర ప్రతికూల ప్రభావాన్ని చూపుతున్నాయి. వారు తమ అమూల్యమైన బాల్యాన్ని, చదువును విస్మరించి తెరలకే పరిమితమవుతున్నారు. ఈ తీవ్రమైన సమస్యను గుర్తించిన కొన్ని దేశాలుఇప్పటికే దీనిపై కఠినమైన నిర్ణయాలు తీసుకున్నాయి. ఆస్ట్రేలియా, బ్రిటన్ వంటి దేశాలు పదహారేళ్ల లోపు పిల్లలు సామాజిక మాధ్యమాలను ఉపయోగించకుండా చట్టపరమైన నిషేధాన్ని విధించాయి. ఫ్రాన్స్, డెన్మార్క్ వంటి ఇతర దేశాలు కూడా తక్కువ వయసున్న మైనర్ల కోసం ఇలాంటి వయోపరిమితి నిబంధనలను, తెర సమయ నియంత్రణలను అమలు చేస్తున్నాయి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### ప్రకృతి వైద్యం

కొన్ని వేల ఏళ్లక్రితం మనిషి జీవనంలో ప్రకృతి విస్తృతంగా ఉండేది. దానిమీదే దినం గడిపే వారు. కాయకష్టం వల్ల శరీరాలు ధారుడ్యం, పూర్తి రోగనిరోధక శక్తి ఉండేది. ఆకులు, గింజల వైద్యం వారికి శరణ్యం. అది అప్పటి పరిస్థితి. గానీ ఇప్పుడు వైద్యశాస్త్రం విస్తృతంగా పెరిగి రోగ నిర్ధారణతో వైద్యం ఫలితం ఇస్తుంది. కొందరి దేహస్థితి కొన్ని పదార్థాలకు వికృతంగా కనిపిస్తుంది. అందుకు శరీర లక్షణాలు చూడకుండా అల్లోపతి వైద్యం చేయరాదు. అలానే పాత ఆకుల రసం అందరికీ పనిచేయదు.

- బొల్లోజు మేఘ్నం, విశాఖపట్నం

### పంటలు పండితేనే రైతు సుభిక్షం

అన్నదాతను కరుణించని వాన మృగశిర ముగిసి ఆరుద్ర ఆరంభమైన ఇంక కరుణించని వాన దేవుడు. ఆందోళనలో అన్నదాతలు సరిగా పడని వర్షం ఇంకెప్పుడు వర్షం పడేది ఇంకెప్పుడు పెద్దగా అయ్యేది అని ఎదురుచూస్తున్న రైతన్నలు వానలు సరిగ్గా కురిసి పంటలు పండితేనే రైతన్న సుభిక్షంగా ఉంటాడు. లేదంటే అంధకారమే.

-మోటె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### విశ్వాసం కోల్పోతున్న బ్యాంకులు

ఆంధ్రప్రదేశ్‌లోని 'ఏలూరు' జిల్లా జంగారెడ్డిగూడెం పట్టణంలో గుర్తింపు పొందిన జాతీయ బ్యాంకులో బంగారం తనఖా పెట్టి మోసపోయిన బాధితులు రోజురోజుకూ పెరుగుతున్నారు. ఈ నెలలో ఖాతాదారులకు చెందిన బంగారు ఆభరణాలు భారీగా మాయమైన విషయం వెలుగులోకి వచ్చింది. బంగారం మాయమైన ఘటనతో ఖాతాదారుల్లో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి. పేద ప్రజలు ఎంతో కష్ట నష్టాలను ఓర్చుకొని రూపాయి రూపాయి కూడ పెట్టుకుని బంగారం కొనుగోలు చేసి బ్యాంకులో అయితే భద్రంగా ఉంటాయి, వడ్డీ తక్కువ ఉంటుందని బ్యాంకులను ఆశ్రయిస్తే బ్యాంకులే ఈ విధంగా మోసం చేస్తే సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటి? ఈ సంఘటన వెలుగులోకి రావడంతో తాము తాకట్టు పెట్టిన బంగారం భద్రంగా ఉందాలేదా అనే భయాందోళనలతో జాతీయబ్యాంకులపై విశ్వాసం కోల్పోతున్నారు. బ్యాంకు సిబ్బంది సహకారంతోనే ఈ మోసం జరిగిందా?. వెంటనే ఈ విషయంలో 'రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా' సమగ్ర విచారణ జరిపించి దోషులను శిక్షించాలి.

- దాసం వెంకటరెడ్డి, బెంగుళూరు

### వివాహాలు ఇలా చేయండి !

ఈ రోజు పిల్లలకు వివాహాలు చెయ్యాలంటే లక్షలు లక్షలు కట్నం, లక్షలు పెట్టీ కళ్యాణమండపాలు, బ్యాండు మేళాలు, ఒక్కోభోజనంమూడొందలూ, నాలుగొందల ఖర్చున, ముహూర్తాలు, నలుగురైదుగురు పంతుళ్లు, ఈరకంగా ఒక్కో వివాహానికి 30నుంచి 40లక్షల ఖర్చు. వీటికోసం ఆస్తులు అమ్ముకోవటం, ఒకళ్ళని చూసి ఒకళ్ళు ఇలా ఆడంబరాల వివాహాలు చేస్తున్నారు. ఇలాంటి ఇబ్బందులే కుండా రిజిస్టర్ కార్యాలయానికి వెళ్ళిస్పెషల్ మ్యారేజ్ యాక్ట్ 1954 కింద అప్లికేషన్ తీసుకొని, వధూవరుల రెండురెండు ఫోటోలు, నేటివిటీ సర్టిఫికెట్లు ఇచ్చి, ఇద్దరు పెద్దమనుషుల సంతకాలతో పూర్తి చేసి ఇచ్చినట్లయితే 30రోజుల తరువాత సర్టిఫికెట్ ఇస్తారు.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### కలిసివుంటే కలదు సుఖం

ఒకప్పుడు ఎక్కడ చూసినా ఉమ్మడి కుటుంబాలు కళకళాడుతుండేవి. అన్ని వయస్సులవారిఆప్యాయతలు బాల్యం నుంచి అందుతూ ఎదుగుదల హాయిగా సాగేది. కాలక్రమేణా సమష్టి కుటుంబాలు చాలావరకు తగ్గిపోయాయి. వారాంతం పండుగలు పబ్బాలు జాతర్లలో కలుస్తూ కలిసి వుంటే కలదు సుఖం అంటూ ఉల్లాసంగా గడుపుతుండడం శుభసూచకం.

-కె.రామారావు, నల్గొండ జిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# ప్రత్యామ్నాయ జల మార్గం అవసరం!

***అనేక విధాలుగా సాఫ్ట్వేర్ రంగంలో భారతీయులు అమెరికాకు చేదోడు వాదోడుగా వుండి వారి ఆర్థికాభివృద్ధికి కొంత కారకులైన మాట నిజం! చైనా పాకిస్థాన్లను దగ్గరకు తీయటానికి అమెరికా ఈ మధ్యకాలంలో ప్రయత్నిస్తుండటం అందరూ చూస్తున్న విషయమే! ఒక విధంగా భారత్ అంతర్జాతీయ విషయాలలో స్పష్టమైన వైఖరితో ఎవరితో జత కలవకుండా, తన ప్రగతి తాను సాధించుకొనే దిశగా పయనిస్తుండటంతో ఇతర దేశాలు గూడా ఇండియా స్వతంత్ర నిర్ణయాలతో సమస్యకు తగ్గట్టుగా వ్యవహరించటాన్ని అభినందిస్తున్నాయి! అయితే ప్రస్తుతం భారత్ తక్షణ సమస్య హార్ముజ్ జలసంధి ద్వారా దిగుమతులు కాకుండా మరో జలమార్గం ద్వారా పొందాల్సిన పరిస్థితి! ఆ మార్గం అన్వేషించుకొని ఆ దిశగా మనం పయనించక తప్పదు! స్వతంత్ర ప్రతిపత్తితో మన ఆర్థిక పురోభివృద్ధిని ఎవరిమీదా ఆధారపడకుండా సాధించుకోవాల్సిందే!***



రావులపాటి సీతారాంరావు

పూర్తి స్వదేశీ సాంకేతికతతోరూపుదిద్దుకున్న మూడు భారీయుద్ధ నౌకలను నౌకాదళంలకి చేర్చిన ఘట్టాన్ని మన దేశ ప్రధాని నరేంద్రమోడీ, శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ పోర్టులో (కలకత్తాలో) ఆవిష్కరించటంతో దేశీయ రక్షణ సామర్థ్యానికి ముందడుగు వేసినట్లయింది! ఈ మూడు నౌకలు యుద్ధ, సర్వే, జలాంతర్గామి నిరోధక కార్యకలాపాల్లో నౌకరంగంతో పాటు సముద్ర జలాల విషయంలో స్వంతంగా కొన్ని ప్రణాళికలు రచించి, ఆచరించాల్సిన అవసరం నిన్నా, మొన్న జరిగిన యుద్ధంతో సముద్రం మీద ఆధిపత్యం ఎంత అవసరమో మనకూ, ప్రపంచ దేశాలకూ చెప్పకనే చెప్పినట్లయింది! వాణిజ్యం, ఆర్థికంగా బలోపేతం కావటం లాంటివి రాజకీయ ఆధిపత్యాన్ని కలిగిస్తాయని ఇంతకు మునుపు నమ్మేవారు. కానీ మొన్నటి హార్ముజ్ జలసంధి ఎవరి ఆధీనంలో వుండాల్నో, అటు అమెరికా, ఇటు ఇరాన్ పోటీపడటమే కాకుండా పెక్కు దేశాలకు ఆయిల్ దిగుమతి, అదీ ఆయిల్, క్రూడ్ ఉత్పత్తులతో సహా నౌకలు సముద్రయానంతో జలాలమీద అవసరమున్న దేశాలకు తరలించినప్పుడే ఆర్థికంగా ప్రజలను, దేశాలను సంతోష భరితులను చేయొచ్చు అని భావిస్తున్నారు. చమురు తరలింపుతో బిలియన్లకొద్ది డాలర్లు సంపాదించటం జరుగుతున్నది! అయితే నౌకా యానంలో తరలించే ఈ చమురు ఉత్పత్తుల వ్యవహారంలో చాలా 'రిస్క్'లు వున్నాయి! పైరసీతో బాటు, భౌగోళిక రాజకీయ ఇబ్బందులు గూడా క్షణక్షణం సరుకు కోరుకున్న వారికి చేరేసరికి ఎదురవుతునేవుంటాయి! ఇరాన్ అమెరికా ఇజ్రాయిల్ దేశాలు సంఘర్షణ పడినప్పుడు 'నీటి దోవలను' నియంత్రించి, ఆధిపత్యం చెలాయించటం, ఆర్థిక ఆంక్షలు పెట్టటం హార్ముజ్ జలసంధి విషయంలో అందరికీ అవగతం అయింది! చాలా క్లిష్టమైన బలహీనతలు ఈ ఆంక్షల ద్వారా వెలికివస్తాయని ఇరాన్ చెప్పినట్లయింది! యుద్ధాలు సంభవించటానికి ప్రత్యేక కారణంగా నీటిదారులను (వాటర్ వేస్)ను గూడా చేర్చాల్సిన ఆవశ్యకత ఏర్పడింది! అందుకనే ఇరాన్, జలసంధిని మూసివేసామని, అమెరికా, బ్లాక్లేడ్ విధించామని ఆధిపత్యం నిరూపించుకోటానికి తపన పడుతూ యుద్ధ జ్వాలలను సమిసిపోనివ్వటం లేదు! ఎనర్జీ ఇంధనం ఆయిల్ ఎగుమతులు 'స్ట్రెయిట్ ఆఫ్ హార్ముజ్' మూసివేయటం వల్ల, చాలా యిబ్బందులు అనేక దేశాల ప్రజలు, ప్రభుత్వాలూ ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడింది! ఆర్థిక అస్తవ్యస్త వ్యవహారాలు వల్ల యు.యస్ ఇరకాటపు స్థితిని తమ దేశంలో గూడా ఎదుర్కొంటున్నది. ఇజ్రాయిల్ ఒత్తిడితో యుద్ధం మొదట్లో అమెరికా కొన్ని చిన్నపాటి విజయాలు సాధించిన అనుభవంతో, ఇరాన్‌ను అదుపుచేసి పోయిన వైభవాన్ని తిరిగి తెచ్చుకోవాలని కలలు కన్నది! కానీ తమ అధినాయకుడిని కోల్పోయిన ఇరాన్ ప్రజలు దేశంలోని కుమ్ములాటలు మరిచిపోయి ఒక్కతాటి మీద నిలిచి, ఇరాన్ ప్రభుత్వానికి కష్టసమయంలో వత్తాసు పలకటంతో యు.యస్.ఏ గ్రుక్కతిప్పుకో లేక పోయింది. ట్రంప్ డాంబిక బెదిరింపులు ఎందుకూ పనికి రాలేదు. దేశంలో అధ్యక్షుని విలువ మసకబార సాగింది. అలాంటి పరిస్థితులలోనే సంధి సంప్రదింపులు మొదలయ్యాయి. ఆటంకాలు తొలిగిపోలేదు. ఇజ్రాయిల్ కొరకరాని కొయ్యగానే వుంది. లెబనాన్ ఈ శాంతి అగ్రిమెంటులో



భాగంగానట్లు ప్రవర్తిస్తూ ఇజ్రాయిల్ ఎదురు దాడులకు దిగుతున్నది! ఈపరిస్థితులలో శాంతి ఒప్పందం నిలుస్తుందో నిలవదో ఎవరూ చెప్పలేకుండా వున్నారు! ఇరాన్ ఈ నేపథ్యంలో పర్షియన్ గల్ఫ్ (స్ట్రెయిట్ అథారిటీ అన్న దానిని ఏర్పరిచి, యుద్ధ సమయంలో ఈ అథారిటీయే హార్ముజ్ జలసంధి వ్యవహారాలను హేండిల్ చేస్తుందని చెప్పటంతో, ఎల్.పి.జి, క్రూడ్ ఆయిల్ దిగుమతుల సమస్యను అధిగమించటానికి 'వాటర్ వేస్' కొత్త రూట్స్ హార్ముజ్ జలసంధి ద్వారా కాకుండా మరో మార్గాల ద్వారా దిగుమతులు చేసుకొనే విషయంలో నిర్ణయాత్మకంగా వ్యవహరించటానికి, యునైటెడ్ అరబ్ ఎమిరేటస్ 'జీరో డిపెండన్సీ' సూత్రాన్ని ఆచరించటానికి పూనుకోవటంతో, ఇండియా ప్రభుత్వం గూడా అదేరీతిలో కొత్త మార్గాలను అన్వేషించే పనిలో పడిందని కొందరు చెపుతున్నారు! సప్లయి చైన్స్ను మళ్ళించుకోక తప్పదు! మరో నౌకాయాన మార్గాన్ని ఎన్నుకొని పెట్టుబడులు అటు దిశగా మళ్ళించుకోవాలి! 'లాండ్ కారిడార్స్'ను గూడా కనిపెట్టుకోగలగాలి! కీలకంగా వ్యవహరించే దేశాలతో పార్టనర్స్‌గా చేరాలి! చైనా ముందే జాగ్రత్తపడి ఈ విషయంలో సముచిత నౌకాయాన మార్గాలను వృద్ధి చేసుకుంది! చాబహార్ ప్రాజెక్ట్ లాంటి ప్రాజెక్ట్స్ వల్ల అవకాశాలు కలిగే స్థితి ఏర్పడినా భారత్ అలాంటివి పరిగణనలోకి తీసుకోలేదు! హార్ముజ్ జలసంధి మీద ఆధారపడి దిగుమతుల మీద ఆశలు పెంచుకోవటం తగదు. ఆర్థికంగా చిక్కు సమస్యలు ఎదుర్కోకుండా వుండటానికి ఆ జలసంధి సహకారం పోనుపోను రాజకీయ కారణాల వల్ల తక్కువ కావచ్చు! స్వయంగా భారత్ వేరే మార్గాలను ఎన్నుకొని ఆర్థిక కుంగుబాటును తొలిగించుకోక తప్పని పరిస్థితి! అయితే ప్రస్తుతం మూడు భారత జెండాతో భారీ క్రూడ్ ఆయిల్ టాంకర్లు హార్ముజ్ జలసంధిని విజయవంతంగా దాటటంతో కొంత ఊరట లభించినట్లయింది! 8.6 లక్షల మెట్రిక్ టన్నుల ముడి చమురుతో ఈ నౌకలు ప్రస్తుతం భారత ఓడ రేవుల వైపు వస్తున్నాయి! ఈనౌకల పేర్లు దేశ వైభవ్, దేశ్ విభోర్, సన్మార్ హెరాల్డ్! నావికుల భద్రతతో పాటు దేశ ఇంధన సరఫరా మార్గాల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు మంత్రి సర్బానంద సోనోవాల్ ప్రకటించటం శుభ సూచకం! యుద్ధాలు మొదలుపెట్టేది ఒకరైతే పరిణామాలు అనుభవించేది మరొకరు! నిజానికి 'భారత్ లాంటి దేశాలకు జరుగుతున్న ఈ యుద్ధంతో అణుమాత్రం సంబంధంకూడా లేదు. గాలికి పోయే కంప మాదిరి సంబంధం లేని దేశాలు ఈ వ్యవహారాన్ని చూస్తున్నాయి! ఇజ్రాయిల్ ప్రధాని మోడీని యుద్ధం ప్రారంభం కాకమునుపు జొజ్జరకొట్టే ప్రయత్నం చేసింది! అమెరికా ట్రంప్ రెండవసారి అధ్యక్షుడిగా ఎన్నికయినప్పటి నుంచీ పాకిస్థాన్తో మరింత స్నేహాన్ని పెంచుకొని భారత్లో పైపైన స్నేహాన్ని నటిస్తున్న అనుమానం కొన్ని సంఘటనలను నిదర్శనంగా భావించవచ్చు! సుంకాలను ఇండియాపై అమెరికా పెంచుతుందని ఎవరూ ఊహించను గూడా లేదు! అనేక విధాలుగా సాఫ్ట్వేర్ రంగంలో భారతీయులు అమెరికాకు చేదోడు వాదోడుగా వుండి వారి ఆర్థికాభివృద్ధికి కొంత కారకులైన మాటనిజం! చైనా పాకిస్థాన్లను దగ్గరకు తీయటానికి అమెరికా ఈ మధ్య కాలంలో ప్రయత్నిస్తుండటం అందరూ చూస్తున్న విషయమే! ఒక విధంగా భారత్ అంతర్జాతీయ విషయాలలో స్పష్టమైన వైఖరితో ఎవరితో జత కలవకుండా, తన ప్రగతి తాను సాధించుకొనే దిశగా పయనిస్తుండటంతో ఇతర దేశాలు గూడా ఇండియా స్వతంత్ర నిర్ణయాలతో సమస్యకు తగ్గట్టుగా వ్యవహరించటాన్ని అభినందిస్తున్నాయి! అయితే ప్రస్తుతం భారత్ తక్షణ సమస్య హార్ముజ్ జలసంధి ద్వారా దిగుమతులు కాకుండా మరో జలమార్గం ద్వారా పొందాల్సిన పరిస్థితి! ఆ మార్గం అన్వేషించుకొని ఆ దిశగా మనం పయనించక తప్పదు! స్వతంత్ర ప్రతిపత్తితో మన ఆర్థిక పురోభివృద్ధిని ఎవరిమీదా ఆధారపడకుండా సాధించుకోవాల్సిందే! ●

# విత్తన బంతులు.. పచ్చని అడవులకు చిరునామా!

డాక్టర్ చిట్యాల రవీందర్

ప్రస్తుత వర్షాకాలంలో పర్యావరణ పరిరక్షణ కోసం అత్యంత ఆసక్తికరమైన, ప్రభావవంతమైన పద్ధతుల్లో ఒకటి సీడ్‌బాల్స్ లేదా విత్తన బంతుల తయారీ, వాటిని వెదజల్లే ప్రయోగం. వర్షాలు సమృద్ధిగా కురుస్తున్న ఈ సమయంలో సీడ్‌బాల్స్ ప్రయోగం పర్యావరణానికి ఒక వరం వంటిది. సీడ్‌బాల్స్ అంటే మట్టి, కంపోస్ట్ (ఎరువు) విత్తనాల మిశ్రమంతో తయారు చేసిన చిన్నచిన్నబంతులు. ఇవి ప్రకృతిసిద్ధమైన అడవుల పునరుజ్జీవనానికి, ముఖ్యంగా మానవ ప్రమేయం తక్కువగా ఉండి, మొక్కలు నాటడానికి వీలుపడని కొండ ప్రాంతాలు, బంజరు భూములు అడవి ప్రాంతాల్లో అడవుల పెంపకానికి అద్భుతమైన మార్గం. వర్షాకాలం ప్రారంభమైన వెంటనే ఈ సీడ్ బాల్స్‌ను వెదజల్లడం వల్ల, పడిన వర్షపు నీటికి బంతిలోనిమట్టి కరిగి, అందులోని విత్తనం మొలకెత్తడానికి కావలసినతేమ పోషకాలు అంది, ప్రకృతి సిద్ధంగానే మొక్కలు మొలవడం మొదలవుతుంది. ఈ పద్ధతిలో విత్తనం నేరుగా భూమిపై పడకుండా, మట్టి పొరలో సురక్షితంగా ఉండటం వల్ల పక్షుల నుండి, ఎలుకల నుండి లేదా ఎండ వేడిమి నుండి రక్షణ లభిస్తుంది. ప్రస్తుతం మనం ఎదుర్కొంటున్న భూతాపం, అడవుల నరికివేత వంటి సమస్యలకు సీడ్ బాల్స్ ఒక సరళమైన, తక్కువ ఖర్చుతో కూడిన పరిష్కారం. వీటిని తయారు చేయడం కూడా చాలా సులభం. ఎర్ర మట్టిని, వర్మీ కంపోస్ట్ లేదా పశువుల ఎరువును కలిపి, అందులో ఆ ప్రాంతపు వాతావరణానికి తగిన దేశవాళి వృక్షాల విత్తనాలను ఉంచి చిన్న బంతులుగా చేసి, నీడలో ఆరబెట్టి, వర్షాలు పడుతున్నప్పుడు ఖాళీప్రదేశాలలో విసిరితే సరిపోతుంది. ముఖ్యంగా ఈ వర్షాకాలంలో తేమ శాతం ఎక్కువగా ఉండటం వల్ల విత్తనాలు కుళ్ళిపోకుండా మొలకెత్తే అవకాశం 80-90 శాతం వరకు ఉంటుంది. ఈ ప్రయోగంవల్ల అటవీ ప్రాంతాల్లో జీవవైవిధ్యం పెరుగుతుంది. నేల కోత నివారించబడుతుంది. భూగర్భ జలాలు పెంపొందుతాయి. అయితే, ఇందులో ఒక ముఖ్యమైన విషయం ఏమిటంటే, ఏ ప్రాంతంలో అయితే సీడ్ బాల్స్ వేస్తున్నామో, ఆ ప్రాంతానికి సహజంగా అలవాటైన లేదా



స్థానిక వృక్ష జాతుల విత్తనాలను మాత్రమే వాడాలి. పరాయి ప్రాంతాల నుంచి తెచ్చిన లేదా కలుపు మొక్కల విత్తనాలను వాడటంవల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుంది. అలాగే, సరైన సమయంలో అంటే వర్షాలు పడటం ప్రారంభించిన మొదటి లేదా రెండో వారంలోనే వీటిని వేయడం వల్ల, మొక్కలకు వేర్లు ఊరేలోపు తగినంతవర్షం దొరికి అవి దృఢంగా తయారవుతాయి. సీడ్‌బాల్స్ ప్రయోగం అనేది కేవలం మొక్కలు నాటడమే కాదు, ఇది భావి తరాలకు పచ్చని ప్రకృతిని అందించే ఒకసామాజికబాధ్యత. పాఠశాల విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు, స్థానిక కమ్యూనిటీలు కలిసి ఈ పనిని ఒక ఉద్యమంలా చేపడితే, రాబోయే కొన్ని సంవత్సరాల్లోనే మన చుట్టూ ఉన్న బంజరు నేలలు పచ్చని వనలుగా మారుతాయి. ప్రతి వ్యక్తి తన పుట్టినరోజున లేదా ప్రత్యేక సందర్భాల్లో ఇలాంటి వందల సంఖ్యలో సీడ్‌బాల్స్‌ను తన ప్రయాణాల్లోలేదా ఖాళీ స్థలాల్లో వేయడం అలవాటు చేసుకోవాలి. ప్రకృతిని కాపాడుకోవడానికి, భూమిని తిరిగి సస్యశ్యామలం చేయడానికి సీడ్ బాల్స్ కంటే తక్కువ ఖర్చుతో, ఎక్కువ ఫలితాలను ఇచ్చే మార్గం మరొకటి లేదు. ప్రతి ఒక్క గింజలో ఒక అడవిని నిర్మించే శక్తి దాగి ఉంటుంది, దానికి కావలసింది కేవలం చిన్న ప్రయత్నం వర్షపు జల్లుల తోడుమాత్రమే. ఆంధ్రప్రదేశ్‌లో ఇటీ వల విత్తన బంతుల పెంపకానికి, పంపిణీకి ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు, స్థానిక కమ్యూనిటీలు కలిసి తీసుకుంటున్న చొరవ పర్యావరణ పరిరక్షణలో ఒక గొప్ప మైలు రాయిగా నిలుస్తోంది. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ భౌగోళికంగా ఎంతో వైవిధ్య భరితమైనది. అయితే అడవులు తక్కువగా ఉన్న కొండ ప్రాంతాలు, బంజరు భూముల్లో మొక్కలు నాటడం సవాలుతో కూడుకున్న పని. ఇటువంటి క్లిష్టమైన ప్రదేశాల్లోవిత్తన బంతులు వేయడం ద్వారా మానవ ప్రమేయం లేకుండానే ప్రకృతి సిద్ధంగా మొక్కలు మొలకెత్తడానికి మార్గంసుగమం అవుతోంది. ఈ చొరవలో భాగంగా వేప, కానుగ, మర్రి, రావి వంటిస్థానిక వృక్ష జాతుల విత్తనాలను వినియోగించడం వల్ల మన ప్రాంత వాతావరణానికి తట్టుకోగల చెట్లు పెరుగుతాయి. ఇది పర్యావరణ సమతుల్యతను కాపాడటమే కాకుండా స్థానిక పక్షుల జీవ వైవిధ్యానికి సురక్షితమైన నివాసాలను కల్పిస్తుంది. ●

# అక్రమ ఆరోపణల 'ఉపా'యంతో అపాయం!



డాక్టర్ నీలం సంపత్

ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్‌లు సంయుక్తంగా ఢిల్లీ వేదిక గా కార్యకలాపాలను కొనసాగిస్తున్న ఓ స్వతంత్ర డిజి టల్ మీడియా సంస్థ న్యూస్ క్లిక్ పై, దాని వ్యవస్థాపక సంపాదకులు ప్రబీర్ పురకాయస్త పై 'విదేశీ ప్రత్యక్ష పెట్టు బడుల' సేకరణ విషయంలో యఫ్.డి.ఐ నిబంధనలను ఉల్లంఘించారనే ఆరోపణలతో ఐ.పి.సి 420 పి.యమ్.యల్.ఏ సెక్షన్ 4 ప్రకారం మనీ లాండరింగ్ కేసు నమోదుచేయడం వెనుక నేపథ్యం ఏమయివుంటుందనే అంశంలో ఓ చిన్నపాటి విశ్లేషణ అవసరమేమో. అందులో భాగంగా ఆయనపై, ఆయన సిబ్బందిపై అనేక దాడులు, అరెస్టులు, వేధింపులు, లోతైన పరిశోధనలు, విచారణలు జరిపింది. ఈ కేసులకు అదనంగా అక్టోబర్ 2023 లో దేశ సమగ్రతకు, భద్రతకు భంగం కలిగిస్తున్నారంటూ ప్రబీర్ పురకాయస్త పై ఉపా కేసును నమోదు చేయడంతెలిసినదే. 2024లో తనకు న్యాయం చేయమంటూ ప్రబీర్ పురకాయస్త సుప్రీం కోర్టునిఆశ్రయించిన నేపథ్యంలో కేసు పూర్వాపరాలను సమగ్ర విచారణ చేసిన తదనంతరం భారత సర్వోన్నత న్యాయ స్థానం ఆయన అరెస్ట్ అక్రమం, చట్ట విరుద్ధమని తేల్చి చెప్పింది. దాదాపు ఒకటిన్నర సంవత్సరాల న్యాయ విచారణ తర్వాత గతనెల 29న ప్రబీర్ పురకాయస్త, న్యూస్ క్లిక్ పై నమోదైన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల ఆరోపణల కేసులో నిబంధనల ఉల్లంఘన జరగలేదని, తమను మోసగించారని ఎవ్వరూ ఫిర్యాదు చేయలేదని, కేవలం ఓ ఇన్ ఫార్మర్ ఇచ్చిన సమాచారం ప్రాతిపదికన ఐ.పి.సి 420కేసు పెట్టడం అన్యాయమని, చట్ట విరుద్ధమని వ్యాఖ్యానిస్తూ నేరం, మోసం జరిగిందనే ప్రాథమిక సాక్ష్యాధారాలేవీ లేవనీ ఓ స్వతంత్ర న్యూస్ ఛానల్‌పై అదో కుట్ర పూరిత కట్టు కథగా అభివర్ణిస్తూ ఢిల్లీ హైకోర్ట్‌లో నీనా బన్సల్ కృష్ణ నేతృత్వంలోని ఏకసభ్య ధర్మాసనం ఆ కేసును కొట్టివేయడం జరిగింది. ఆది నుండీ ఇ.డి, ఐ.టి, సి.బి.ఐ లాంటి అత్యంత ప్రతిష్టాత్మకమైన కేంద్ర ప్రభుత్వ దర్యాప్తు సంస్థల పనితీరు పట్ల న్యాయవ్యవస్థ పూర్తిస్థాయి అసం తృప్తిని వెల్లగక్కుతుండడం బహిరంగ రహస్యమే. నిజానికి సదరు విచారణ సంస్థలపై న్యాయవ్యవస్థ అసహనానికి ప్రధాన కారణం న్యాయస్థానాలలో కేంద్రప్రభుత్వ ఆధీనంలో కొనసాగుతున్న నేరపరిశోధన సంస్థలు వివిధ వ్యక్తులు, వ్యవస్థలపై చేస్తున్న ఆర్థిక నేరారోపణలనూ, మోపుతున్న అభియోగాలను నూటికి తొంభైఐదు శాతం ఋజువు చేయలేక పోతుండడాన్ని బట్టి న్యాయ వ్యవస్థ అసలా ఆర్థిక నేరాలే జరగకపోవచ్చనే ముక్తాయింపుకు రాకతప్పడం లేదు. సరిగ్గా అదే సమయంలో ఓ అమెరికా పత్రిక వివిధ ఇతర దేశాలతోసహా భారత దేశంలోనూ చైనా అనుకూలతను



పెంచి పోషిస్తున్న చైనా అధికారిక మీడియాతో న్యూస్ క్లిక్ కలిసి పనిచేస్తూ దేశా నికీ, ప్రభుత్వానికి వ్యతిరేకంగా కుట్ర చేస్తున్నాయనే తీవ్ర మైన అభియోగాన్ని మోపుతూ ఓ కథనాన్ని ప్రచురించింది. తదనంతరం న్యూస్ క్లిక్ వ్యవస్థాపక సంపాదకుడైన ప్రబీర్ పురకాయస్తతో పాటు ఆ సంస్థలో పనిచేస్తున్న ఇతర జర్నలిస్టులు, కథనాలు రాసిన లబ్ధ ప్రతిష్టులైన వ్యాసకర్తలపై మనీ లాండరింగ్, ఛీటింగ్ లాంటి ఆర్థికనేరాలకు సంబంధించిన చట్టాలను ప్రయోగించి అరెస్ట్ చేసి జైలులో పెట్టడం గమనార్హం. పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగించిన ఆ ఘటనను ప్రపంచ పత్రికా రంగం నిరసించ డమేకాదు, గర్హించడం జరిగింది. ఐతే అంతర్జాతీయ సమాజపు స్పందన ను ఏమాత్రం పరిగణనలోకి తీసుకోని కేంద్ర ప్రభుత్వం చైనా అనుకూల, భారత వ్యతిరేక వార్తలను రాస్తున్నందుకు మీ పత్రికకూ, మీకు కొమ్ముకాస్తున్నప్రతిపక్ష పార్టీ అధి నేతకు పెద్ద మొత్తంలో సొమ్ములు ముడుతున్నాయంటూ, మీరు శత్రుదేశాలకు పేడ్ మీడియాగా పనిచేస్తున్నారని ఢిల్లీ పోలీసులు ప్రశ్నించినారంటూ అభియోగాలు ఎదుర్కొంటున్న నిందితులు చెప్పినట్లు వార్తలు వెలువడ్డాయి. అధికార పార్టీ పార్లమెంట్ సభ్యులు సైతం పార్లమెంట్ వేదికగా న్యూస్ క్లిక్‌పై దేశ ద్రోహ ఆరోపణలు చేసిన వైనం తెలిసినదే. వీటన్నింటి పర్యవసానంగా ప్రబీర్ పురకాయస్త 'ఉపా' కేసు మోపబడి జైలు పాలయ్యాడు. 225రోజులు జైలులో ఉన్నప్పటికీ మనీ లాండరింగ్, ఛీటింగ్ కేసులపై తన న్యాయపోరాటాన్ని కొనసాగించాడు. ఏంజరగబోతోంది? 2026వ సంవత్సరానికి ప్యారిస్ ఆధారిత గ్లోబల్ మీడియా వాచ్‌డాగ్, రిపోర్టర్స్ విత్‌అవుట్ బోర్డర్స్ తయారుచేసిన ప్రపంచ పత్రికా స్వేచ్ఛ సూచీలో 180లో 157వ స్థానంలో కొనసాగుతున్న ఘన (అప)కీర్తిని మూట గట్టుకున్న మన దేశంలో ఢిల్లీ హైకోర్ట్ తీర్పుని కేంద్రప్రభుత్వం తప్పని సరిగా సుప్రీం కోర్ట్‌లో సవాల్ చేస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఐతే ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద ప్రజాస్వామిక దేశమైన మన దేశం లో రాజ్యాంగ నిబంధనల స్ఫూర్తితో పాత్రికేయ ధర్మాన్ని త్రికరణ శుద్ధిగా నిర్వర్తిస్తూ రైతులూ, కార్మికులూ, విద్యా ర్థులూ, నిరుపేదలూ, సామాన్య ప్రజల గొంతుకగా మారి వారి బ్రతుకు కోసం, భవిష్యత్ కోసం తద్వార దేశ సామాజిక, ఆర్థిక సుస్థిరత కోసం పోరాడుతున్న పత్రికలూ, పాత్రికేయులూ, మీడియా సంస్థలపై పాలకులు కుట్రలతో, కుతంత్రాలతో పత్రికా స్వేచ్ఛను హరిస్తూ మనీలాండరింగ్ లాంటి ఆర్థిక నేరారోపణలూ 'ఉపా' లాంటి దేశ ద్రోహ ఆరోపణలతో జైల్లలో వేసినప్పటికీ నిమ్మకు నీరెత్తుతూ తమతమ పత్రికలలో ఒక్క అక్షరం కూడా ప్రభుత్వాల చర్యలను ఖండించలేకపోవడాన్ని ఏమనుకోవాలి. ఒక వేల అదే నిజమైతే దేశంలో పత్రిక రంగం పాలకుల నిరంకుశ విధానాల బంధనాలను ఛేదించుకుని ఐక్యంగా తమను తాము కాపాడుకుంటూ పత్రికా స్వేచ్ఛ పరిరక్షణకు అవసరమైన శక్తిని సమకూర్చుకోవడానికి వేసిన ఓ అతి పెద్ద ముందడుగుగా భావించక తప్పదు. ●

# ‘కొలీజియం’ న్యాయ సమీక్షకు అతీతం



## న్యాయమూర్తుల ఎంపిక ప్రక్రియలో జోక్యంలేదు

## పదోన్నతి కోసం ఎవరిని సిఫార్సు చేయాలో కోర్టులు నిర్దేశించలేవు

## సుప్రీంకోర్టు విస్పష్ట తీర్పు

**న్యూఢిల్లీ, జూన్ 23:** హైకోర్టు న్యాయమూర్తులను నియమించే కొలీజియం ప్రక్రియను సవాలు చేస్తూ హిమాచల్‌ప్రదేశ్‌కు చెందిన ఒక న్యాయాధికారి దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారణకు నిరాకరించింది. అటువంటి నిర్ణయాలు కొలీజియం ‘వ్యక్తిగత సంతృప్తి’పై ఆధారపడి ఉంటాయని, వాటిని న్యాయపరమైన స్థాయిలో కోర్టులు సమీక్షించలేవని పేర్కొంది. ధర్మశాలలోని ఫ్యామిలీ కోర్టు ప్రధాన న్యాయమూర్తి అరవింద్ మల్హోత్రా దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ బి.వి. నాగారత్న, జయమల్య బాగ్చీలతో కూడిన ధర్మాసనం విచారించింది. రాష్ట్రంలోని అత్యంత సీనియర్ న్యాయాధికారులలో ఒకరిగా ఉన్నప్పటికీ, హిమాచల్‌ప్రదేశ్ హైకోర్టుకు పదోన్నతి కోసం తన అభ్యర్థిత్వాన్ని విస్మరించి, తనకంటే జూనియర్ అధికారులను సిఫార్సు చేశారని మల్హోత్రా వాదించారు. పిటిషనర్ తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది బల్బీర్ సింగ్, మల్హోత్రా ఎంపిక ప్రక్రియలో పాల్గొని అవసరమైన పత్రాలను సమర్పించినప్పటికీ, చివరికి సుప్రీంకోర్టు కొలీజియం ఆయన జూనియర్ల పేర్లను ఆమోదించిందని వాదించారు. అయితే, పదోన్నతి కోసం ఎవరిని సిఫార్సు చేయాలో లేదా పరిగణించాలో కొలీజియంలకు న్యాయస్థానాలు నిర్దేశించలేవని ధర్మాసనం స్పష్టం చేసింది. ‘ఇవి అంతిమంగా హైకోర్టు కొలీజియం వ్యక్తిగత సంతృప్తికి సంబంధించిన విషయాలు. న్యాయపరంగా, ‘మీరు ఇది చేయండి, అది చేయండి, అతని పేరును పరిగణించండి’ అని సుప్రీం కోర్టు కొలీజియంతో చెప్పగలదా? అలా చేయలేము’ అని జస్టిస్ నాగరత్న వ్యాఖ్యానించారు. మల్హోత్రా అభ్యర్థిత్వాన్ని అధికారికంగా తిరస్కరించినట్లు సూచించడానికి ఎటువంటి ఆధారాలు లేవని కూడా కోర్టు పేర్కొంది. పిటిషనర్ పేరు ఇంకా పరిశీలనలో ఉండవచ్చుని, కాబట్టి ఆయన వేచి ఉండాలని జస్టిస్ నాగారత్న అన్నారు. కేవలం సీనియారిటీ మాత్రమే పదోన్నతికి హక్కును కల్పిస్తుందన్న వాదనను ధర్మాసనం తోసిపుచ్చింది. సీనియారిటీ ఉన్నంత మాత్రాన ఒక న్యాయాధికారికి సిఫార్సు పొందే అర్హత దానంతట అదే లభించదని పేర్కొంది. కొలీజియం చర్చలు గోప్యమైనవని న్యాయమూర్తులు స్పష్టంచేశారు. హైకోర్టు లేదా సుప్రీంకోర్టు కొలీజియం అంతర్గత చర్చలను పరిశీలించడం ద్వారా ‘పాండోరా పెట్టెను తెర వడానికి’ కోర్టు ఇష్టపడటం లేదని జస్టిస్ నాగరత్న అన్నారు. హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు కొలీజియం చేసిన సిఫార్సులను సుప్రీంకోర్టు కొలీజియం ఇప్పటికే ఆమోదించడం వల్ల, తొలిదశల న్యాయ సమీక్ష కష్టతరంగా మారిందని జస్టిస్ బాగ్చి పేర్కొన్నారు. కోర్టు పరిశీలనల తర్వాత, పిటిషనర్ ఆ అభ్యర్థనను ముందుకు తీసుకెళ్లకూడదని నిర్ణయించుకుని, పరిపాలనా పరంగా సమర్థ అధికారి ముందు ఇతర పరిష్కార మార్గాలను అనుసరించడానికి స్వేచ్ఛ కోరారు. సుప్రీంకోర్టు, దావాల యోగ్యతపై ఎలాంటి అభిప్రాయం వ్యక్తం చేయకుండానే పిటిషన్‌ను పరిష్కరించింది. న్యాయా ధికారులు చిరాగ్ భాను సింగ్, భూపేష్ శర్మ, యోగేష్ జస్వాల్‌లను హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తులుగా పదోన్నతి కోసం సిఫార్సు చేసి, ఆమోదించిన తర్వాత ఈ పిటిషన్ దాఖలైంది.

# అమెరికా పౌరసత్వం ఇక మరింత ఖరీదు!

## దరఖాస్తు ఫీజు 75% పెంపు



**వాషింగ్టన్, జూన్ 23:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారం చేపట్టినప్పటి నుంచి ఇమ్మిగ్రేషన్ నిబంధనలను కఠినతరం చేస్తూనే ఉన్నారు. తాజాగా ఆయన కార్యవర్గం చేసిన ప్రతిపాదనలతో అమెరికా పౌరసత్వం మరింత ఖరీదుగా మారనుంది. పౌరసత్వ దరఖాస్తుల ఫైలింగ్ ఫీజులను 75 శాతం మేర పెంచాలని యుఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌లాండ్ సెక్యూరిటీ (డిహెచ్‌ఎస్) ప్రతిపాదించింది. సక్రమ మార్గంలో వచ్చిన వలసదారులు పౌరసత్వానికి దరఖాస్తు చేసుకుంటే ప్రాసెసింగ్, వెట్టింగ్ ఖర్చులు భరించాల్సి రావడంతో పాటు ఇప్పటివరకు ఉన్న పలు మినహాయింపులు కూడా కోల్పోనున్నారు. పౌరసత్వ దరఖాస్తు (పేపర్ బేస్డ్) ఫైల్ చేయడానికి ఫీజు 760 డాలర్ల నుంచి 1330 డాలర్లకు పెరగనుంది. ఆన్‌లైన్ దరఖాస్తు విషయానికి వస్తే 710 డాలర్ల నుంచి 1280 డాలర్లకు ఫీజు పెంపును అధికారులు ప్రతిపాదించారు. ఈ కొత్త ఫీజులు అమలులోకి వస్తే.. 75 శాతం మేర భారం పడనుంది. ఏదైనా సిటిజన్‌షిప్ అప్లికేషన్ తిరస్కరణకు గురైతే దానిని తిరిగి పరిశీలించాలని కోరినా సరే ఖర్చుల మోత మోగనుంది. ప్రస్తుతం ఈ ప్రతిపాదిత నిబంధనలపై 60 రోజులపాటు ప్రజాభిప్రాయ సేకరణ చేయనున్నారు. అలాగే అమెరికాలో ఆదాయ ఆధారిత మార్గదర్శకాల ప్రకారం దరఖాస్తుదారులకు ప్రస్తుతం లభిస్తోన్న మినహాయింపులను తొలగించాలని డిహెచ్‌ఎస్ ప్రతిపాదించింది. 400శాతం లేక అంతకంటే తక్కువ ఆదాయం ఉన్న దరఖాస్తుదారులకు రెడ్యూస్డ్ ఫీజ్ ఆప్షన్‌ను తీసేయాలని సూచించింది. ఈ కొత్త రూల్స్ వల్ల సహజంగా పౌరసత్వం పొందడానికి అర్హత ఉన్న శాశ్వత నివాసితులు తమకున్న అవకాశాలు కోల్పోయే ప్రమాదం ఉందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

# టిఎంసిలో పెరిగిన ఆధిపత్యపోరు



## అసలైన తృణమూల్ కాంగ్రెస్ మాదే: ఇసికి మమత వర్గీయుల లేఖ

## తిరుగుబాటు వర్గం కమిటీ పునర్నియామకం

## చైర్మన్ అరూప్ రాయ్, ఉపాధ్యక్షుడిగా అరూప్ బిస్వాస్

**కోల్‌కతా, జూన్ 23:** తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి)లో ఆధిపత్య పోరు ఉధృతమైంది. అసెంబ్లీలో ప్రతిపక్ష నేత రీటాబ్రత బెనర్జీ సోమవారం తమదే అసలైన టిఎంసి అంటూ, కొత్త కమిటీని పునర్నియామకం చేయగా, కాదు మాదే అసలైన తృణమూల్ కాంగ్రెస్ అని మమతా బెనర్జీ అనుకూల వర్గం, ఇదే మా పార్టీ అసలైన జాతీయ కార్యవర్గం అని పేర్కొంటూ భారత ఎన్నికల సంఘానికి (ఇసిఐకి) అందిస్తూ లేఖ రాసింది. పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, పార్టీ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీలకు విధేయులైన ‘అసలైన కానీ మైనారిటీ’ వర్గంగా తమను తాము అభివర్ణించుకున్న ఈ వర్గం, పశ్చిమ బెంగాల్ అసెంబ్లీలోని టిఎంసి శాసన సభ్యుల ‘తిరుగుబాటు కానీ మెజారిటీ’ వర్గం ప్రకటించిన సమాంతర కమిటీకి ప్రతిగా, తమ జాబితానే ‘అసలైన’ జాతీయ కార్యవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తుందని పేర్కొంది.

రీటాబ్రత బెనర్జీ నేతృత్వంలోని తిరుగుబాటు వర్గం, మమతా బెనర్జీ, అభిషేక్ బెనర్జీ ఇద్దరినీ మినహాయించి కొత్త జాతీయ కార్యవర్గాన్ని ఆవిష్కరించిన కొద్దిసే పటికే, సోమవారం రాత్రి ఇసికి ఈ లేఖ పంపి నట్లు వర్గాలు తెలిపాయి. మమతా బెనర్జీ వర్గం సమర్పించిన జాబితాలో, మమతను జాతీయ ఛైర్‌పర్సన్‌గా, సుబ్రతా బక్షిని జాతీయ ఉపాధ్యక్షుడిగా, అభిషేక్ బెనర్జీని ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఈ జాబితాలో రాజ్యసభ సభ్యులు డెరెక్ ఓబ్రియన్, డోలా సేన్‌లను సంయుక్త కార్యదర్శులుగా, రాజ్యసభ మాజీ సభ్యుడు సుభాసిష్ చక్రవర్తిని కోశాధికారిగా కూడా చేర్చారు. దీనిపై రీటబ్రతా బెనర్జీ స్పందిస్తూ, తనకు ఎలాంటి వ్యాఖ్యలు లేవని, అయితే ఇతర వర్గానికి శుభాకాంక్షలు తెలుపుతున్నానని అన్నారు. సోమవారం సాయంత్రం ప్రకటించిన తిరుగుబాటు వర్గం కమిటీ, మమతా బెనర్జీ స్థానంలో సీనియర్‌శాసనసభ్యుడు, మాజీ మంత్రి అరూప్ రాయ్‌ను ఛైర్‌పర్సన్‌గా నియ మించింది. మాజీ మంత్రి అరూప్ బిస్వాస్‌ను ఉపాధ్యక్షుడిగా, ఎమ్మెల్యేలు ఫిర్హాద్‌హాకీం, రథిన్ ఘోష్‌లను ఉపాధ్యక్షులుగా నియమించారు. రిటాబ్రతా బెనర్జీ, జావేద్ ఖాన్, సందీపన్ సాహా, మరియు సబీనా యాస్మిన్‌లను ప్రధాన కార్యదర్శులుగా నియమించగా, అఖ్రుజ్జమాన్‌ను కోశాధికారిగా నియమించారు. తృణమూల్ కాంగ్రెస్‌లోని ‘అసలైనకానీ అల్పసంఖ్యాక’ వర్గం, మమతా బెనర్జీ, అభిషేక్ బెనర్జీలకు తమ విధేయతను కొన సాగిస్తూ, పార్టీ జాతీయకార్యవర్గంవివరాలను తెలియజేస్తూ భారత ఎన్నికల సంఘానికి (ఇసిఐ) ఒక ప్రకటనను పంపింది. తమదే అసలైన తృణ మూల్ కాంగ్రెస్ అంటూ ఇసిఐకి పంపిన లేఖలో పేర్కొంది.



# ఐడిఎఫ్‌సి స్కామ్‌లో ఐఎఎస్ అధికారి అరెస్టు

**న్యూఢిల్లీ,జూన్ 23:** బ్యాంక్ స్కామ్ రూ. 657 కోట్ల కేసులో కేంద్ర దర్యాప్తు సంస్థ ఓ ఐఎఎస్ ఆఫీసర్‌ను అరెస్టు చేసింది. 2000 సంవత్సరం బ్యాచ్‌కు చెందిన ఐఎఎస్ పంకజ్ అగర్వాల్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో అరెస్టు అయిన రెండో ఐఎఎస్ అధికారి ఆయన. ఇదే కేసులో ఇప్పటికే రామ్ కుమార్ సింగ్ అనే ఐఎఎస్‌ను అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఐడిఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్, ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ అధికారులు, ప్రభుత్వ అధికారులతో కలిసి ఓ స్కామ్ చేశారు. హర్యానా ప్రభుత్వానికి చెందిన 8 శాఖల నుంచి, చండీఘడ్ పరిపాలన శాఖకు చెందిన రెండు అకౌంట్ల నుంచి నిధులను మళ్లించినట్లు ఆరోపణలు ఉన్నాయి. బ్యాంక్ నిధులను దుర్వినియోగం చేసిన కేసులో నష్టం 657 కోట్లు ఉంటుందని సీబీఐ పేర్కొన్నది. ఇదే కేసును ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కూడా విచారిస్తున్నది. సుమారు 645 కోట్ల కుంభకోణం జరిగినట్లు ఈడీ చెబుతోంది. స్కామ్ జరిగిన సమయంలో అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ ఫార్మర్స్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్‌కు పంకజ్ అగర్వాల్ పనిచేశారు. హర్యానా వ్యవసాయ మార్కెటింగ్ బోర్డుకు సంబంధించిన సుమారు 10 కోట్లు చండీఘడ్‌లోని ఐడీఎఫ్ ఫస్ట్ బ్యాంక్ నుంచి మాయం చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అగ్రికల్చర్ మార్కెటింగ్ డెవలప్మెంట్ ఫండ్ పేరుతో ఖాతానిర్వహించినట్లు తెలుస్తోంది. ఎస్‌ఆర్‌ఆర్ ప్లానింగ్ గురుస్ లిమిటెడ్ సంస్థకు 9.75 కోట్లు, మన్నత్ కాంట్రాక్టర్స్‌కు 25 లక్షలు చెల్లించారు. కానీ షెల్ కంపెనీలకు నిధులు మళ్లించినట్లు ఆరోపణలు ఉన్నాయి. బ్యాంక్ కుంభకోణంలో మొత్తం 8మంది ఐఎఎస్ ఆఫీసర్లపై నిఘా పెట్టారు. దీంట్లో ఇద్దర్ని అరెస్టు చేశారు. మొహమ్మద్ షాయిన్, మణి రామ్ శర్మ, ప్రదీప్ కుమార్, వినీత్ గార్గ్, సాకేత్ కుమార్, డీకే బెహరా ఉన్నారు. హర్యానా స్కూల్ శిక్షా పరియోజనా పరిషద్‌కు సెక్రటరీగా ఉన్న సమయంలో విద్యాశాఖ అకౌంట్ నుంచి సుమారు 50కోట్లు దారి మళ్లించినట్లు పంకజ్ అగర్వాల్‌పై ఆరోపణ ఉన్నది. ఫైనాన్స్ శాఖ మార్గదర్శకాలకు వ్యతిరేకంగా అకౌంట్లను ఓపెన్ చేసి నిధులను మళ్లించినట్లు పంకజ్‌పై ఆరోపణలు ఉన్నాయి.

# పుణేలో వ్యాపారి ఆఫీసు వద్ద కాల్పులు

## లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ పనే



**ముంబై, జూన్ 23:** మహారాష్ట్ర, పుణేలోని ఒక వ్యాపారి ఆఫీసు వద్ద కాల్పులు కలకలం సృష్టించాయి. సోమవారం రాత్రి పుణేలోని హెచ్ వికాస్ స్టీల్ సంస్థ ఆఫీసు వద్ద ఈ ఘటన జరిగింది. ఈ ఘటనకు పాల్పడింది లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ అని తెలుస్తోంది. పుణేలోని అమూల్ చమారియా, సన్నీ చమారియా అనే ఇద్దరు వ్యాపారులు లక్ష్యంగా ఈ దాడి తెలుస్తోంది. రాత్రి పూట ముసుగు ధరించిన దుండగులు.. పిస్టోల్‌తో ఆఫీసు సమీపంలో కాల్పులు జరిపారు. చుట్టుపక్కల, గోడలపై కాల్పులు జరిపి వెళ్లిపోయారు. దీనికి సంబంధించి లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ తరఫున అర్జూ బిష్ణోయ్ శుభమ్ లోంకర్ పేరుతో ఉన్న ఒక అకౌంట్ నుంచి ప్రకటన వెలువడింది. తామే ఈ కాల్పులకు పాల్పడినట్లు వెల్లడించారు. వ్యాపారులిద్దరూ చాలా మందిని మోసం చేసి, మనీలాండరింగ్‌కు పాల్పడినట్లు వారు ఆరోపిస్తున్నారు. ఈ అంశంపై తమ గ్యాంగ్ ఫోన్ చేసి హెచ్చరిస్తుంటే, వారు తమను పట్టించుకోలేదని, అందుకే ఈ కాల్పులు చేసినట్లు వెల్లడించారు. భవిష్యత్తులో తమ కాల్స్‌కు స్పందించకుంటే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. ఈసారి బుల్లెట్లు గోడను తాకాయని, తాము చెప్పినట్లు వినకుంటే భవిష్యతులో వారి ఛాతిలో దిగుతాయని సోషల్ మీడియా వేదికగా హెచ్చరించారు. దీనికి సిద్ధంగా ఉండాలన్నారు. అలాగే, కాల్పులకు సంబంధించిన విడియోను కూడా సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ఈ కాల్పుల ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు విచారణ జరుపుతున్నారు. సోషల్ మీడియా పోస్టుతోపాటు, విడియోపైనా ఆరా తీసుకున్నారు. నిందితులను గుర్తించే పనిలో పోలీసులున్నారు. ఇటీవలి కాలంలో లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ పలుసార్లు దాడులకు పాల్పడింది. సెలబ్రిటీలతోపాటు అనేకమంది వ్యాపారుల ఇళ్ల వద్ద కాల్పులు జరుపుతోంది.

# సమాచారహక్కు చట్టం మార్పులపై అన్నా హజారే ధ్వజం



**ముంబయి, జూన్ 23:** మహారాష్ట్ర ప్రభుత్వం ఇటీవలతీసుకొచ్చిన సమాచార హక్కు (ఆర్టీఐ)నిబంధనల సవరణలను వెంటనే రద్దు చేయాలని సామాజిక కార్యకర్త అన్నా హజారే డిమాండ్‌చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌కు లేఖ రాసిన హజారే ఈనెల12న తీసుకొచ్చిన మహారాష్ట్ర ఆర్టీఐ రూల్స్-2026, సమాచార హక్కుచట్టం స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. కొత్త నిబంధనలవల్ల ఆర్టీఐ చట్టం లక్ష్యం నీరుగారి, ప్రజలకు సమాచారం అందడం మరింత కష్టమవుతుందని విమర్శించారు. ఆర్టీఐ దరఖాస్తుల ఫీజులను పెంచడాన్నీ హజారే తీవ్రంగా వ్యతిరేకించారు. 20ఏళ్ల తర్వాత ఫీజులు పెంచితే, సమాచారమివ్వకుండా ఆలస్యంచేసే అధికారులపై జరిమానాలను పెంచాలని సూచించారు.

# ‘వికసిత్ భారత్’లో ఐఎఎస్‌లు కీలకం




## 2024 బ్యాచ్ ఐఎఎస్ ట్రైనీలతో ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, జూన్ 23:** వికసిత భారత్2047 లక్ష్య సాధనలో యువ సివిల్ సర్వెంట్లు కీలక పాత్ర పోషించాలని ప్రధానమంత్రి నరేంద్రమోడీ పిలుపునిచ్చారు. దేశ నిర్మాణానికి అంకితభావంతో పనిచేయాలని, పదవుల కంటే ప్రజలకు అందించిన ఫలితాల ద్వారానే సంతృప్తి పొందాలని ఆయన సూచించారు. మంగళవారం సేవా తీర్థ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో 2024 బ్యాచ్‌కు చెందిన 183 మంది ఐఎఎస్ అధికారి శిక్షణార్థులతో ప్రధాని మోడీ సంభాషించారు. వివిధ మంత్రిత్వ శాఖలు, విభాగాల్లో అసిస్టెంట్ సెక్రటరీలుగా పనిచేస్తున్న ఈ యువ అధికారులు తమ శక్తి, ప్రతిభ, అంకితభావంతో భారత అభివృద్ధి ప్రయాణాన్ని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్తారని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఫీల్డ్ ట్రైనింగ్, మంత్రిత్వ శాఖల్లో అనుబంధ సేవల సమయంలో పొందిన అనుభవాలను అధికారులు ప్రధానమంత్రితో పంచుకున్నారు. రెండేళ్ల పరిపాలనా శిక్షణ, క్షేత్రస్థాయి అనుభవం అనంతరం వారు అత్యంత కీలక దశలో ఉన్నారని, ఇకపై వారి నిర్ణయాలు కేవలం వారి కెరీర్‌ను మాత్రమే కాకుండా కోట్లాది ప్రజల భవిష్యత్తును ప్రభావితం చేస్తాయని ప్రధాని పేర్కొన్నారు. ప్రజాసేవలో నిజమైన పరీక్ష వాస్తవ జీవిత పరిస్థితులను నిజాయితీ, సున్నితత్వం, నిబద్ధతతో ఎదుర్కొనడంలోనే ఉందని మోడీ అన్నారు. దేశ నిర్మాణంలో స్పష్టమైన లక్ష్యంతో, వినూత్న ఆలోచనలతో, పౌరుల కేంద్రిత పరిపాలనతో ముందుకు సాగాలని యువ అధికారులకు సూచించారు. ప్రతి పరిపాలనా ఫైల్ వెనుక ప్రజల ఆశలు, ఆందోళనలు, జీవితాలు దాగి ఉంటాయని గుర్తుంచుకోవాలని ఆయన చెప్పారు. నాగరిక్ దేవో భవ మంత్రాన్ని ఆచరిస్తూ ప్రతి నిర్ణయంలో పౌరులను కేంద్రంగా ఉంచాలని, పరిపాలన సానుభూతితో, స్పందనాత్మ కంగా, సమగ్రంగా ఉండేలా చూడాలని పిలుపు నిచ్చారు. అభివృద్ధి సవాళ్లను ఒక్కో శాఖ విడి విడిగా పరిష్కరించలేదని, శాఖల మధ్య సమన్వయం ద్వారానే స్థిరమైన ఫలితాలు సాధ్యమవుతాయని ప్రధాని పేర్కొన్నారు. వికసిత భారత్2047 దిశగా రాబోయే దశాబ్దాల్లో తీసుకునే ప్రతి విధాన నిర్ణయం, పరిపాలనా చర్య దేశ అభివృద్ధికి దోహదపడేలా ఉండాలని అన్నారు. ఆత్మనిర్భర్ భారత్, మేక్ ఇన్ ఇండియా, తయారీ రంగ వృద్ధి, ఇంధన భద్రత, యువతకు ఉపాధి అవకాశాల కల్పన ప్రస్తుతం దేశ ప్రాధాన్యతలుగా ఉన్నాయని ఆయన వివరించారు. గత దశాబ్దంలో పరిపాలన విధానంలో గణనీయమైన మార్పు వచ్చిందని, ప్రక్రియల ఆధారిత విధానం నుంచి ఫలితాల ఆధారిత పరిపాలన వైపు దేశం అడుగులు వేసిందని మోడీ పేర్కొన్నారు. డిజిటల్ గవర్నెన్స్, కృత్రిమ మేధస్సు (ఏఐ), సాంకేతికత సేవల అందుబాటును, పారదర్శకతను పెంచుతున్నాయని చెప్పారు. డేటాను కేవలం సంఖ్యలుగా కాకుండా కోట్లాది ప్రజల జీవితాలు, సమస్యలు, ఆశయాలకు ప్రతిబింబంగా చూడాలని ఆయన సూచించారు. ప్రభుత్వ విధానాలు క్షేత్రస్థాయిలో ఆశించిన ఫలితాలను ఇస్తున్నాయో లేదో నిరంతరం పరిశీలించాలని అధికారులకు సూచించారు. దేశ నిర్మాణంలో మహిళల పాత్ర రోజురోజుకూ పెరుగుతోందని, ప్రస్తుత ఐఎఎస్ బ్యాచ్‌లో 40 శాతానికి పైగా మహిళా అధికారులు ఉండటం విశేషమని ప్రధాని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సహాయ మంత్రి జితేందర్‌సింగ్, ప్రధానమంత్రికి ప్రధాన కార్యదర్శి పి.కె. మిశ్రా, ప్రధాన కార్యదర్శి2 శక్తికాంత దాస్, కేబినెట్ కార్యదర్శి టి.వి. సోమనాథన్, డీఓపీటీ కార్యదర్శి రచనా షా, లాల్‌బహదూర్‌శాస్త్రి నేషనల్ అడ్మినిస్ట్రేటివ్ అకాడమీ డైరెక్టర్ శ్రీరామ్ తరణికంటి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# సంక్షిప్త వార్తలు

## టెలిగ్రాం యాప్‌పై నిషేధం ఎత్తివేత..



**న్యూఢిల్లీ,జూన్ 23:** నీట్ యూజీ 2026 రీఎగ్జామినేషన్ నేపథ్యంలో భారత్‌లో తాత్కాలికంగా నిలిపివేసిన టెలిగ్రామ్ సేవలను మళ్లీ పునరుద్ధరించారు. వారంపాటు నిషేధం అనంతరం మంగళవారం నుంచి గూగుల్ ప్లేస్టోర్‌లో టెలిగ్రామ్ యాప్ తిరిగి అందుబాటులోకి వచ్చింది. నీట్ యూజీ రీఎగ్జామ్‌ను లక్ష్యంగా చేసుకొని కొందరు చీటింగ్ ముఠాలు టెలిగ్రామ్‌ను ఉపయోగించి అభ్యర్థులను మోసం చేస్తున్నారనే ఆరోపణలతో జాతీయ పరీక్షల సంస్థ (ఎన్‌టీఏ) కేంద్రప్రభుత్వానికి ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన కేంద్రం ఈ నెల 16నుంచి 22 వరకు టెలిగ్రామ్‌ను తాత్కాలికంగా నిషేధించింది. అయితే టెలిగ్రామ్‌లో సందేశాలనుసవరించే (మెసేజ్ఎడిట్)ఫీచర్‌పై విధించిన ఆంక్షలు ఈనెల 30వరకు కొనసాగనున్నాయి.

## రాయల్ సర్జన్స్ కళాశాలలో సుశ్రుతుడి కాంస్యవిగ్రహం



**ఎడింబర్గ్,జూన్ 23:** ఆధునిక వైద్యశాస్త్రం ఇంకా అభివృద్ధి చెందని కాలంలోనే భారతీయ వైద్యుడు సుశ్రుతుడు విశేష కృషి చేశాడు. 2,600 ఏళ్ల క్రితమే 1,120వ్యాధులను నమోదు చేశాడు. 700కుపైగా ఔషధ మొక్కలు, 300కు పైగా వైద్య విధానాలు, 120శస్త్రచికిత్స పరికరాల వివరాలను లిఖితపూర్వకంగా భద్రపరిచాడు. ఇప్పుడు ఆయనకు స్కాట్లాండ్‌లో అరుదైన గౌరవం దక్కింది. స్కాట్లాండ్‌లోని రాయల్ కాలేజ్ ఆఫ్ సర్జన్స్ ఆఫ్ ఎడిన్‌బర్గ్ సుశ్రుతుడి కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించింది. శస్త్రచికిత్స రంగానికి ఆయన అందించిన సేవలకు గుర్తింపుగా ఈ గౌరవాన్ని ప్రకటించింది.

## లక్నో ప్రమాద భవనం కూల్చివేయాలని నోటీసులు



**లక్నో,జూన్ 23:** ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో సంభవించిన ఘోర అగ్నిప్రమాదంలో భవన నిర్మాణం నిబంధనలు ఉల్లంఘనలు మరియు నియంత్రణ వైఫల్యాలు మరోసారి వెలుగులోకి వచ్చాయి. అక్రమ నిర్మాణం కారణంగా ఈ భవనాన్ని కూల్చివేయాలని 2016 మే 10న లక్నో డెవలప్‌మెంట్ అథారిటీ ఆదేశాలు జారీచేసింది. అయితే, కేవలం రెండు నెలల వ్యవధిలోనే, అంటే అదే ఏడాది జులై 5న ఆ ఆదేశాలను అధికారులు రద్దుచేయడం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. సరైన విచారణ జరపకుండానే నోటీసులు ఇచ్చారని, భవన నిర్మాణం నిబంధనలకు అనుగుణంగానే జరిగిందని అప్పటి యాజమాన్యం ప్రభుత్వ ఉత్తర్వులను సవాలు చేయడంతో, ఆ కూల్చి వేత ఆదేశాలు రద్దయ్యాయి.

## గ్వాటెమాలాలో బద్దలైన అగ్నిపర్వతం



**గ్వాటెమాలాసిటీ,జూన్ 23:** మధ్య అమెరికా లోని గ్వాటెమాలాలో వోల్కన్ డీ ఫ్యూగో అగ్నిపర్వతం బద్ధలైంది. దాంతో అగ్నిపర్వతం నుంచి ఒక్కసారిగా మంటలు ఎగజిమ్మాయి. ఏకంగా 33 వేల అడుగుల ఎత్తు పొగలు విరజిమ్మాయి. అగ్నిపర్వతం నుంచి ఒక్కసారిగా మంటలు ఎగజిమ్మి, మండుతున్న రాళ్లు బుల్లెట్లలా దూసుకొచ్చాయి. దాంతో ఆ పర్వత పరిసరాల్లో ఉన్న పర్యాటకులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పరుగులు తీశారు. ఈ హఠాత్పరిణామానికి సైతం పరుగందుకున్నారు. అగ్నిపర్వతం చుట్టూ శిథిలాలు పడుతుండగా పర్వతారోహకులు అగ్నిపర్వత మార్గా ల వెంట పరుగెత్తుతుండటం కనిపించిందని స్థానికులు చెబుతున్నారు.

## పదేళ్ల బాలికపై ఆటోడ్రైవర్ హత్యాచారం..



**న్యూఢిల్లీ,జూన్ 23:** దేశ రాజధాని ఢిల్లీలో దారుణం జరిగింది. పదేళ్ల బాలికను కిడ్నాప్ చేసి, అత్యాచారం చేసి, అనంతరం హత్య చేశాడు ఒక క్యాబ్ డ్రైవర్. ఆ తర్వాత ఆ బాలికను అడవుల్లో పారేశాడు. ఈఘటన దక్షిణ ఢిల్లీ పరిధిలోని సీడీఆర్ చౌక్ ఏరియా సమీపంలో సోమవారం ఉదయం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం ఢిల్లీ, సీడీఆర్ చౌక్ సమీపంలో పదేళ్ల బాలిక కుటుంబంతో కలిసి ఫుట్‌పాత్‌పై నిద్రిస్తుండగా సోమవారం ఉదయం ఐదు గంటల సమయంలో బబ్లూ అనే క్యాబ్ డ్రైవర్ ఆ బాలికను ఎత్తుకెళ్లాడు. తన కార్‌లో బలవంతంగా ఎక్కించుకుని గుర్గావ్ (గురుగ్రామ్) ప్రాంతంలోకి ఎక్కించుకెళ్లాడు. అక్కడ బాలికపై అత్యాచారం చేశాడు. అనం తరం ఆ బాలికవల్ల ఎక్కడ నిజం బయటపడుతుందో అని భావించిన బబ్లూ ఆ బాలికను చంపేశాడు.


# ఇజ్రాయెల్ లెబనాన్‌ల మధ్య మరోసారి శాంతిచర్చలు

## వాషింగ్టన్‌లో భేటీ..!

**వాషింగ్టన్,జూన్ 23:** పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలను అదుపులోకి తెచ్చి శాశ్వత శాంతిని నెలకొల్పేందుకు అగ్రరాజ్యం అమెరికా మరో ముందడుగు వేసింది. ఇజ్రాయెల్, లెబనాన్ దేశాల మధ్య అత్యంత సున్నితంగా మారిన సరిహద్దు వివాదాలు, కాల్పుల విరమణ ఒప్పందాన్ని మరింత బలోపేతం చేయడం కోసం వాషింగ్టన్ డీసీలోని స్టేట్ డిపార్ట్‌మెంట్ వేదికగా దౌత్యపరమైన చర్చలు ప్రారంభమయ్యాయి. అమెరికా మధ్యవర్తిత్వంలో జరుగుతున్న ఈ ఐదో విడత నేరుగా జరిగే ద్వైపాక్షిక చర్చలలో ఇరు దేశాల రాయబారులు, ఉన్నతాధికారుల బృందాలు పాల్గొంటున్నాయి. గతంలో జరిగిన నాలుగు విడతల చర్చల ఫలితంగా కుదిరిన తాత్కాలిక కాల్పుల విరమణను ఇరుపక్షాలు గౌరవించేలా చేయడం, అలాగే ప్రాంతీయ స్థిరత్వాన్ని సాధించడం ఈ మూడు రోజుల సమావేశాల ముఖ్య ఉద్దేశం. ఈ ప్రతిష్ఠాత్మక చర్చల్లో భాగంగా ముఖ్యంగా దక్షిణ లెబనాన్ సరిహద్దు ప్రాంతాల నుంచి ఇరు దేశాల సైన్యాల ఉపసంహరణ, హిజ్బుల్లా సాయుధ బలగాలను పూర్తిగా నిరాయుధులను చేయడం వంటి అత్యంతకఠినమైన భద్రతా నిబంధనలపై ఇరు పక్షాలు చర్చిస్తున్నాయి. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు మాట్లాడుతూ సరిహద్దుల్లో తమ పౌరుల భద్రతకు ముప్పుగా మారిన హిజ్బుల్లా సైనికసామర్థ్యాలను పూర్తిగా తుడి చిపెట్టడమే తమ ప్రథమప్రాధాన్యతని స్పష్టం చేశారు.


# పుణే టెక్కీది ప్రమాద మృతి కాదు..హత్యే

## మరింత లోతుగా పోలీసుల దర్యాప్తు



**పూణె,జూన్ 23:** మహారాష్ట్రలోని పుణె సమీపంలోని లోహగడ్ కోట వద్ద జూన్ 19న 26 ఏళ్ల కేతన్ అగర్వాల్ లోయలో పడి మృతిచెందిన విషయం తెలిసిందే. అయితే తొలుత ఫొటోలు తీస్తుండగా ప్రమాదవశాత్తూ జారి పడ్డాడని పోలీసులు భావించారు. దర్యాప్తు కొనసాగుతున్న కొద్దీ అనుమానాస్పద అంశాలు వెలుగులోకి వచ్చాయి. దీంతో ప్రమాదవశాత్తూ జరిగిన మరణంగా నమోదు చేసిన కేసును పోలీసులు హత్య కోణంలో విచారిస్తున్నారు. పోలీసుల కథనం ప్రకారం కేతన్‌తో నిశ్చితార్థం అయిన సియా గోయల్‌కు చేతన్ చౌదరి అనే యువకుడితో పరిచయం ఉన్నట్లు గుర్తించారు. కుటుంబ సభ్యుల నిర్ణయంతో కేతన్‌తో పెళ్లికి అంగీకరించిన సియా తమ సంబంధానికి అతడు అడ్డుగా ఉన్నాడని భావించినట్లు పోలీసులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో కేతన్‌ను తొలగించేందుకు ఇద్దరూ కలిసి పథకం రచించి ఉండొచ్చని అనుమానిస్తున్నారు. ఈనెల 14న కూడా లోహగడ్ కోట వద్ద కేతన్‌ను హత్య చేసేందుకు ప్రయత్నం జరిగినట్లు పోలీసులు చెబుతున్నారు. పాము కనిపించినట్లు భయపెట్టి లోయలోకి నెట్టేయాలనే ప్రయత్నం విఫలమైనట్లు అనుమానిస్తున్నారు. అనంతరం జూన్ 19న సియా పుట్టినరోజు సందర్భంగా మరోసారి కోటకు వెళ్లేలా ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది. ప్రీ వెడ్డింగ్ ఫొటోషూట్ పేరుతో కేతన్‌ను కోటకు తీసుకెళ్లిన తర్వాత అక్కడకు చేతన్ కూడా చేరుకున్నాడని పోలీసులు చెబుతున్నారు. ఆ సమయంలో కేతన్ సుమారు 350 అడుగుల లోతైన లోయలో పడిపోవడంతో మృతిచెందాడు. ఇది ప్రమాదం కాదని, ముందస్తు ప్రణాళికలో భాగంగా జరిగి ఉండొచ్చని దర్యాప్తు అధికారులు అనుమానిస్తున్నారు. కేసు దిశను మార్చిన అంశం డిజిటల్ ఆధారాలేనని పోలీసులు చెబుతున్నారు. విచారణ సమయంలో సియా కొన్ని విషయాలను దాచిపెట్టినట్లు అనుమానం రావడంతో ఆమె మొబైల్ ఫోన్ రికార్డులు, సోషల్ మీడియా, ఇతర సాంకేతిక ఆధారాలను పరిశీలించారు. వాటి ఆధారంగా హత్య కోణంలో దర్యాప్తును మరింత వేగవంతం చేశారు.

# స్టాలిన్‌ను అనుకరించిన విజయ్, సభనుంచి వాకౌట్ చేసిన డిఎంకె



**చెన్నై,జూన్ 23:** తమిళనాడు శాసనసభ మంగళవారం నాటి సమావేశాల్లో తీవ్ర వాదోపవాదాలు, నాటకీయ పరిణామాల మధ్య అట్టుడికింది. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి విజయ్, ప్రతిపక్ష డీఎంకే మధ్య తీవ్ర స్థాయిలో మాటల యుద్ధం నడిచింది. ముఖ్యమంత్రి ప్రసంగానికి నిరసనగా డీఎంకే సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. శాసనసభలో ముఖ్యమంత్రి విజయ్ మాట్లాడుతూ, డీఎంకే పార్టీ పేరుతో అక్రమంగా నిధులు సేకరిస్తోందని ఆరోపించడంతో పాటు, అవినీతికి పాల్పడిన వారిని తమ ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో శాంతి భద్రతల గురించి ప్రతిపక్షాలు చేస్తున్న ఆందోళనల్లో వాస్తవం లేదని, అవన్నీ రాజకీయ ప్రేరేపితమైనవేనని ఆయన విమర్శించారు. విజయ్ ప్రసంగానికి డీఎంకే సభ్యులు పదేపదే అడ్డుతగలడంతో సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. స్పీకర్ జోక్యం చేసుకుని పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేసినప్పటికీ, డీఎంకే సభ్యులు నినాదాలు చేస్తూ సభ నుంచి బయటకు వెళ్లిపోయారు. ఇదే సమయంలో విజయ్ తన ప్రసంగంలో డీఎంకే అధినేత, మాజీ ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్‌ను అనుకరించడం అందరి దృష్టిని ఆకర్షించింది. గతంలో సీట్ల పంపకాల చర్చల సందర్భంగా అంతా సెటిల్ అయిపోయింది అనేలా స్టాలిన్ ప్రదర్శించిన మ్యానరిజంను విజయ్ అసెంబ్లీలో అనుకరించి చూపించారు. దాంతో అధికార పక్ష సభ్యుల చప్పట్లతో సభ హోరెత్తింది. తమ ప్రభుత్వం సీపీఎం, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ వంటి పార్టీలతో పొత్తు పెట్టుకోవడాన్ని ఈ సందర్భంగా విజయ్ సమర్థించుకున్నారు. మహిళల భద్రతతోపాటు మాదకద్రవ్యాల నిర్మూలనకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

# స్వర్ణాంధ్ర 2047 విజన్‌కు 'బంగారు'బాట


కర్నూలు జిల్లా జొన్నగిరి బంగారు గని ప్రాంతం

- దేశంలోనే ఏకైక ప్రైవేట్ రంగ బంగారు గని జొన్నగిరి
- మరిన్ని గోల్డ్ బ్లాక్‌ల వేలానికి సిద్ధం
- బంగారు వనరుల పెట్టుబడులతో ఉపాధికి ఆంధ్రప్రదేశ్ కేంద్రబిందువు

**విజయవాడ, జూన్ 23 ప్రభాతవార్త ప్రతినిధి:** ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న స్వర్ణాంధ్ర 2047 విజన్‌లో భాగంగా ఖనిజ సంపద ఆధారిత ఆర్థికాభివృద్ధికి ఆంధ్రప్రదేశ్ వేగంగా అడుగులు వేస్తోంది. ఈ ప్రాంతంలో ఈ నెల 24న సిఎం చంద్రబాబు పర్యటించనున్నారు. ఈ సందర్భంగా గనుల శాఖ ముఖ్య కార్యదర్శి ముకేశ్ కుమార్ మీనా మాట్లాడుతూ, 'దేశంలో అత్యంత ఆశాజనకమైన బంగారు ఖనిజ వనరులు ఉన్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ఒకటి. శాస్త్రీయ అన్వేషణ, పారదర్శక వేలం విధానం, సుస్థిర మైనింగ్ విధానాల ద్వారా ఈ సంపదను ప్రజల అభివృద్ధికి వినియోగించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాల సాధనలో బంగారు వనరులు ఆర్థికాభివృద్ధి, పారిశ్రామికీకరణ, ఉపాధి కల్పనకు కీలక పాత్ర పోషిస్తాయి' అని తెలిపారు. కర్నూలు జిల్లా జొన్నగిరి బంగారు గనిలో వాణిజ్య ఉత్పత్తి ప్రారంభం కావడం, రాష్ట్రంలోని పలు బంగారు ఖనిజ బ్లాక్‌ల వేలం, నూతన అన్వేషణలకు సిద్ధం చేయడం ద్వారా దేశ బంగారు గనుల రంగంలో ఆంధ్రప్రదేశ్ కీలక స్థానాన్ని సంపాదించే దిశగా ముందుకు సాగుతోంది. కర్నూలు జిల్లా తుగ్గలి మండలంలోని 597.82 హెక్టార్ల విస్తీర్ణంలో ఉన్న జొన్నగిరి గోల్డ్ మైన్ ప్రస్తుతం దేశంలో స్వాతంత్ర్యం తర్వాత ప్రారంభమైన తొలి, ఏకైక ప్రైవేట్ రంగ బంగారు గనిగా నిలిచింది. జియోమైసోర్ సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ నిర్వహిస్తున్న ఈ ప్రాజెక్టులో రూ.405 కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టగా, 2026 మే నెలలో వాణిజ్య ఉత్పత్తి ప్రారంభమైంది. ప్రస్తుతం 700 మందికి పైగా ప్రత్యక్ష ఉపాధి పొందుతుండగా, వారిలో 80శాతానికి పైగా ఆంధ్రప్రదేశ్ చెందినవారే ఉన్నారు. ఈ గని ద్వారా 2026-27 ఆర్థిక సంవత్సరం లో సుమారు 400 కిలోల బంగారం ఉత్పత్తి అవుతుందని అంచనా. రానున్న సంవత్సరాల్లో ఇది ఏడాదికి ఒక టన్ను సామర్థ్యానికి, అనంతరం రెండు టన్నుల వరకు పెరిగే అవకాశం ఉంది. రాయల్టీలు, జిల్లా ఖనిజ ఫౌండేషన్ నిధులు తదితర మార్గాల ద్వారా రాష్ట్రానికి గణనీయమైన ఆదాయం సమకూరనుంది. జొన్నగిరితో పాటు చిత్తూరు, అనంతపురం జిల్లాల్లో కూడా విస్తారమైన బంగారు ఖనిజ నిల్వలు గుర్తించబడ్డాయి. చిత్తూరు జిల్లా కుప్పం మండలంలోని చిగురుగుంట– బిసానత్తం గోల్డ్ బ్లాక్‌లో సుమారు 22 లక్షల టన్నుల ఖనిజ వనరులు, టన్నుకు సగటున 5.64 గ్రాముల బంగారం నిల్వలు ఉన్నట్లు అంచనా. దేశంలో అత్యంత ఆశాజనక బంగారు బ్లాక్‌లలో ఒకటిగా భావిస్తున్న ఈ బ్లాక్‌ను తాజాగా వేలానికి తీసుకువచ్చారు. అనంతపురం జిల్లాలోని బొక్సంపల్లి ఉత్తర, దక్షిణ బ్లాక్‌లు, రామగిరి ఉత్తర, దక్షి ణ బ్లాక్‌లు, అలాగే జవకుల గోల్డ్ బ్లాక్‌లు రామగిరి, వెలిగల్లు గ్రీన్‌స్టోన్ బెల్ట్‌ల పరిధిలో ఉన్నాయి. ఈ ప్రాంతాలు చారిత్రాత్మక కోలార్, హుట్టి బంగారు గనుల ప్రాంతాలతో సమానమైన భౌగోళిక లక్షణాలను కలిగి ఉండటంతో భవిష్యత్తులో భారీ బంగారు నిల్వలు వెలికితీసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ బ్లాక్‌లలో వాణిజ్యపరంగా ఉపయోగపడే నిల్వలను గుర్తించేందుకు భారత భూగర్భ సర్వే సంస్థ, నోటిఫైడ్ ప్రైవేట్ ఎక్స్‌ప్లోరేషన్ ఏజెన్సీల ద్వారా విస్తృత స్థాయిలో అన్వేషణ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. అనంతరం వీటిని పారదర్శక వేలం ప్రక్రియ ద్వారా ప్రైవేట్ పెట్టుబడిదారులకు అందించనున్నారు.

## శ్రీకాళహస్తిలో సిఎం సభకు ముమ్మర ఏర్పాట్లు

**శ్రీకాళహస్తి, జూన్ 23 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తి నియోజకవర్గంలో జులైన నిర్వహించే గ్రామీణ ప్రాంతాల ఉపాధి, అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'విజిబి రామ్ జి పథకం' ఆంధ్రప్రదేశ్‌లో శ్రీకారం చుట్టడానికి ప్రభుత్వం తిరుపతి జిల్లాను ఎంపిక చేసింది. ఈ ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్, బిజెపి నాయకులు హాజరుకానున్నారు. ఈ సభను నగరి, శ్రీకాళహస్తి నియోజకవర్గాల్లో వారం రోజులుగా జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో వివిధ స్థలాలను తనిఖీ చేసారు. ఈ నేపథ్యంలో శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని రేణిగుంట, ఏర్పేడు, శ్రీకాళహస్తి మండలాల్లోని పలు ప్రాంతాల్లో పరిశీలించారు. మంగళవారం శాసనసభ్యుడు బొజ్జల సుధీర్ రెడ్డి సారథ్యంలో ఆయన అనుచరులతో కలసి ఏర్పేడు మండలం లోని చింతల పాళెం, అలాగే శ్రీకాళహస్తి మండలంలోని ఇనగలూరు పరిసరాల్లో సభా వేదిక ఏర్పాటును పరిశీలించారు. నగరి నియోజకవర్గంలోని నారాయణవనంను కూడా జిల్లా అధికారులు పరిశీలించారు. శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డితోపాటు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రంగినేని చెంచయ్యనాయుడు, ఏర్పేడు మండల పార్టీ అధ్యక్షుడు నాగరాజు నాయుడు, సీనియర్ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.


అధికారులతో కలసి ముఖ్యమంత్రి బహిరంగ సభా వేదిక స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

## సిఎం చంద్రబాబుకు 'భారత్ రైజింగ్ ఇన్ ది మోడీ ఎరా' పుస్తకం బహూకరణ



**విజయవాడ, జూన్ 23 ప్రభాతవార్త ప్రతినిధి:** డాక్టర్ దిలీప్ కిలారు తాను రచించిన 'భారత్ రైజింగ్ ఇన్ ది మోడీ ఎరా' పుస్తకాన్ని సిఎం చంద్రబాబు నాయుడుకు బహూ కరించారు. ఈ మేరకు సచివాల యంలోని ఆయన ఛాంబర్‌లో ముఖ్యమంత్రిని కలిసి పుస్తక ప్రతిని అందజేశారు. ఈ సందర్భంగా పుస్తకంలోని అంశాలను పరిశీలించిన సిఎం చంద్రబాబు, వినూత్నమైన అంశంపై రూపొందిం చిన ఈ గ్రంథం ఎంతో విలువైందని పేర్కొంటూ రచయిత కృషిని అభినందించారు. పుస్తక రచనకు శుభాకాంక్షలు తెలియజేస్తూ భవిష్యత్తులోనూ ఇలాంటి సృజనాత్మక రచనలు చేయాలని కాంక్షించారు. ఈ పుస్తకాన్ని ఇటీవల కేంద్ర గనుల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, ఎపి వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆవిష్కరించారు. 110 కేంద్ర పథకాలతో ఉండే ఓ మంచి బుక్‌ను దిలీప్ రచించారని సత్యకుమార్ ప్రశంసించారు. జీవన ప్రమాణాలు పెంపొందిచాలని, కేంద్ర పథకాలపై పేదలకు అవగాహన కల్పించాలనే సదుద్దేశంతో దీనిని రచించారని కొనియాడారు. గత 12 ఏళ్లలో వచ్చిన క్వాలిటీ, క్వాంటిటేటివ్ అంశాలను ప్రస్తావిస్తూ ప్రజల్లోకి తీసుకెళ్లే మంచి ప్రయత్నం చేశారని వ్యాఖ్యానించారు సత్యకుమార్. ఈ ఆవిష్కరణ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు హాజరై రచయితను అభినందించారు.


## పర్యాటక రంగ అభివృద్ధి పరుగులు

- ఎపి టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బాలాజీ



**విజయవాడ, జూన్ 23 ప్రభాతవార్త ప్రతినిధి:** ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికతతో పర్యాటక రంగం అభివృద్ధి పథంలో దూసుకుపోతుంటే, ఓర్వలేక వైసిపి తప్పుడు ప్రచారానికి తెరలేపిందని ఎపి టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎపిటిడిసి) చైర్మన్, టిడిపి జాతీయ ఉపాధ్యక్షుడు నూకసాని బాలాజీ ఆరోపించారు. మంగళవారం బాలాజీ మీడియా సమావేశం నిర్వహించారు. 'ప్రజావేదిక కూల్చివేతతోనే తన విధ్వంసకర పాలన ఎలా ఉంటుందో జగన్ చెప్పకనే చెప్పారు. రోజుకు రూ.2 లక్షల ఆదాయం తెచ్చే రుషికొండ పర్యాటక కేంద్రాన్ని ధ్వంసం చేసి, తన విలాసాల కోసం రూ.500 కోట్లతో ప్యాలెస్ నిర్మించుకున్నారు. రెండేళ్లయినా ఆ భవనాలను వినియోగించుకోలేని దుస్థితి. రూ.28 వేల కోట్ల పెట్టుబడులు తెస్తానని చెప్పి, ఒక్క ఉద్యోగం కూడా సృష్టించలేదు. టూరిజం కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేసి, ఆస్తులను సొంత అనుచరులకు కట్టబెట్టారు. రాష్ట్రాన్ని గంజాయికి హబ్‌గా మార్చి, యువతను నేరాల వైపు మళ్లించారు' అని బాలాజీ తీవ్ర ఆరోపణలు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 24 నెలల్లోనే పర్యాటక రంగంలో రూ.19,400 కోట్ల పెట్టుబడులు ఆకర్షించామని తెలిపారు. విశాఖలో జరిగిన సిఐఐ సమ్మిట్ ద్వారా వచ్చిన ఈ పెట్టుబడులతో 91,960 మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. ఇప్పటికే 18 ప్రాజెక్టులకు సంబంధించి రూ.4,376 కోట్ల పనులు ప్రారంభమయ్యాయని వెల్లడించారు. పర్యాటకుల ఆకాంక్షలకు అనుగుణంగా గోవా తరహాలో విశాఖ, సూర్యలంకలో బీచ్ షాక్స్ పాలసీ తీసుకొస్తే, దానిపైనా విష ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని ప్రోత్సహించేందుకు నూతన పర్యాటక విధానం 2024-29 అమలు చేస్తున్నామని, 21 రోజుల్లోనే అనుమతులు మంజూరు చేస్తున్నామని బాలాజీ వివరించారు. కేంద్రం సహకారంతో రూ.441 కోట్లతో టెంపుల్, బీచ్ టూరిజం అభివృద్ధి చేస్తున్నామన్నారు. అమరావతిలో 'అవకాయ ఫెస్టివల్' వంటివి నిర్వహిస్తూ ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం అందిస్తున్నామని తెలిపారు. అరకు కాఫీ స్టాళ్లు, 14 చోట్ల ఎక్స్‌పీరియన్స్ సెంటర్లు, టెంట్ సిటీస్, కొత్తగా 10 రోప్‌వేల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేశామని, 20 బీచ్‌లకు బ్లూ ఫ్లాగ్ గుర్తింపు సాధించడమే లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ప్రజలిచ్చిన తీర్పునకు అనుగుణంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఎపిని దేశంలోనే అగ్రగామి పర్యాటక రాష్ట్రంగా తీర్చిదిద్దుతున్నారని బాలాజీ పేర్కొన్నారు.

## ఉద్యోగుల సమస్యలపై ఉద్యమమే: ఎపిజెఎసి



**విజయవాడ, జూన్ 23 ప్రభాతవార్త:** కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఉద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు మధ్యంతర భృతి (ఐఆర్), 12వ పిఆర్సీ కమిషనర్ నియామకం, పెండింగ్ డిఎల విడుదల తదితర సమస్యల పరిష్కారానికి ఉద్యోగులంతా ఉద్యమానికి సిద్ధం కావాలని జెఎసి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఎపి జెఎసి అమరావతి ఆధ్వర్యంలో చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు అధ్యక్షతన మంగళవారం విజయవాడలో జరిగింది. ఈ సందర్భంగా బొప్పరాజు మాట్లాడుతూ ఉద్యోగుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, ప్రధానంగా ఆర్థికపరమైన సమస్యల పరిష్కారం కోసం కృషిచేస్తున్నప్పటికీ ప్రభుత్వం నుండి ఎటువంటి స్పందన లేనందున ఉద్యోగుల ఆకాంక్షలకు అనుగుణంగా భవిష్యత్‌లో ఉద్యమం చేపట్టాలని, అవసరమైతే ఐక్య ఉద్యమ కార్యాచరణకు కూడా సిద్ధంగా ఉన్నామని తెలిపారు.


ఉద్యోగుల హక్కుల పరిరక్షణ, పెండింగ్ సమస్యల పరిష్కారం, ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు దశలవారీ ఉద్యమ కార్యాచరణ రూపొందించాలని నిర్ణయించారు. జులై 12న శ్రీకాకుళం, 21న అనంతపురంలో ఉద్యమ సన్నద్ధం సభలు నిర్వహించాలని ఏకగ్రీవంగా తీర్మానించామని, తదుపరి ఏలూరు, గుంటూరులో కూడా సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. అయినప్పటికీ సమస్యలు పరిష్కారం కాని పక్షంలోరాష్ట్ర స్థాయి ఉద్యమ కార్యాచరణ కమిటీ సమావేశం నిర్వహించి "ప్రత్యక్ష ఉద్యమ కార్యచరణను" ప్రకటిస్తామని జెఎసి ప్రధాన కార్యదర్శి పలిశెట్టి దామోదరరావు, అసోషియేట్ చైర్మన్, పోరాట కమిటి చైర్మన్ టి.వి.ఫణి పేర్రాజు, కోశాధికారి తిమ్మసర్తి నాగేశ్వరరావులు ఈ సందర్భంగా ప్రకటించారు.

## తిరుమల సమాచారం



## ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

**తిరుమల, జూన్ 23 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని వడమాలపేట మండలం అప్పలాయగుంటలో కొలువైన ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం లో వార్షిక బ్రహ్మోత్సవాలకు ముందుగా మంగళవారం ఉదయం పవిత్రమైన కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం శాస్త్రోక్తంగా జరిగింది. నేటి నుండి జులై 3వ తేదీ వరకు జరగనున్న వార్షిక బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఆలయ పవిత్రత, ఆధ్యాత్మిక శోభను మరింత పెంపొందించే ఈ కార్యక్రమాన్ని సంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి, తోమాలసేవ, కొలువు, అర్చన అనంతరం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం చేపట్టారు. ఆలయ గర్భగుడి, ప్రాకారాలు, గోడలు, పైకప్పు, పూజా సామగ్రిని శుద్ధి చేసి, నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డకర్పూరం, గంధం, కుంకుమ, కిచిలీగడ్డ వంటి సుగంధ ద్రవ్యాలతో తయారుచేసిన పవిత్ర పరిమళ జలాన్ని ఆలయం అంతటా ప్రోక్షించారు. ఈ పవిత్ర కార్యక్రమంతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక సుగంధాలతో పరిమళించి, భక్తిమయ వాతావరణాన్ని సంతరించుకుంది. అనంతరం భక్తులకు సర్వదర్శనం కల్పించారు. బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుడుతూ నేటి రాత్రి 7.30 గంటలకు అంకురార్పణం నిర్వహించనున్నారు. 25న ధ్వజారోహణంతో సకల దేవతలను ఆహ్వానిస్తూ బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమవుతాయి. ఉత్సవాల్లో భాగంగా జూన్ 28న ఆర్జిత కల్యాణోత్సవం, జూన్ 29న గరుడసేవ, జూలై 2న రథోత్సవం, జూలై 3న చక్రస్నానం, ధ్వజావరోహణం నిర్వహించి బ్రహ్మోత్సవాలను ముగించనున్నారు. బ్రహ్మోత్సవాల్లో పాల్గొనే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా టిటిడి విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి ప్రసన్న వేంకటేశ్వరస్వామి కృపాకటాక్షాలను పొందాలని టిటిడి కోరింది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఇఒ పి.హరీంద్రనాథ్, ఎఇఒ దేవరాజులు, సూపరింటెండెంట్ శ్రీవాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్, అర్చకులు, శ్రీవారి సేవకులు పాల్గొన్నారు.



## ఎస్వీ గోసంరక్షణ ట్రస్ట్‌కు రూ.10 లక్షలు విరాళం

**తిరుమల, జూన్ 23 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎస్వీ గోసంరక్షణ ట్రస్ట్‌కు దాతలు తమవంతుగా విరాళాలు అందిస్తున్నారు. మంగళవారం హైదరాబాద్‌కు చెందిన కల్లా సత్య రిషబ్ శ్రీవేంకటేశ్వర గో సంరక్షణ ట్రస్టుకు రూ.10,01,116లు విరాళంగా అందించారు. తిరుమలలో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరికి విరాళం డిడిని అందజేశారు.

# అటు నకిలీ లేఖలు ఇటు దళారులు

- టిటిడిని కలవరపెడుతున్న మోసగాళ్లు



**తిరుమల, జూన్ 23 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన హిందువుల ఆరాధ్యదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనానికి సామాన్య భక్తులను ఎరగాచేసుకుని దళారులు, మోసగాళ్ళు పలు రకాలుగా మాయమాటలతో నమ్మించి దండుకుంటున్న ఘటనలు లెక్కలేనంతగా సాగిపోతున్నాయి. ఓ వైపు నకిలీ సిఫార్సు లేఖలు, కలర్ జిరాక్స్ చేసిన దర్శన టిక్కెట్లు పెద్దసంఖ్యలో భక్తులు తీసుకువచ్చేస్తుండగా మరోవైపు దళారులు సులభంగా డబ్బు సంపాదనకు అలవాటుపడి ఏకంగా టిటిడి ఉద్యోగుల అవతారం ఎత్తి వారిపేరుతో నకిలీ సిఫార్సు లేఖలు సృష్టించి యధేచ్చగా భక్తులను మోసం చేస్తున్నారు. ప్రతినెలా ఇలాంటి ఘటనలు పునరావృతమవుతూనే ఉన్నాయి. పట్టుబడితేనే దొంగలు లేకుంటే యధేచ్చగా దొరల అవతారంతో జేబులు నింపుకుంటున్నారు. దీని వెనుక టిటిడిలో కొందరు ఉద్యోగుల, కాంట్రాక్ట్ సిబ్బంది హస్తం కూడా ఉందనేది గుప్పుమంటోంది. తాజాగా గుంటూరు, హైదరాబాద్, కర్ణాటకకు చెందిన కొందరు భక్తులను దళారి నిమ్మల శ్రీనివాస్ సులభంగా నమ్మించి టిటిడి ఉద్యోగుల లేఖలపై శ్రీవారి సుప్రభాతసేవ దర్శన టిక్కెట్లు ఇప్పిస్తామని నమ్మించి 60మంది భక్తుల నుండి ఫోన్ పే ద్వారా రూ.3.60లక్షలు నగదు రాబట్టుకున్నాడు. సోమవారం తిరుమలకు వచ్చిన భక్తులు తమకు కనీసం ఎలాంటి సమాచారం లేదని, ఫోన్ కూడా తీయడంలేదని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వెలుగుచూసింది. భక్తులు తీసుకువచ్చినవి నకిలీ లేఖలుగా తేలడంతో ఈ గుట్టురట్టయ్యింది. ఆ సమయంలో టిటిడి ఉద్యోగులు వారికి సహకరించలేక పోవడంతోనే ఇలా జరిగిందనే విమర్శలు లేకపోలేదు. ఇప్పటికే తిరుమలలో దళారీ వ్యవస్థ వేళ్ళూనుకుని తిరుమల పవిత్రతను దెబ్బతీశారనే కోణంలో టిటిడి కఠినంగా వ్యవహరిస్తోంది. చాలావరకు దళారులు, మధ్యవర్తుల ఆగడాలు తగ్గినా ఇంకా పదుల సంఖ్యలో దళారులు వ్యాపారాలు చేస్తుండటం మాత్రం టిటిడిని కలవరపెడుతోంది. ఈ నేపథ్యంలో పూర్తిస్థాయిలో వ్యవస్థలో కీలక ప్రక్షాళన చేపడతారా అనే ప్రశ్నలకు టిటిడి ఉద్యోగుల్లో అవుననే సమాధానం వినిపిస్తోంది. అంతేగాక దేవదేవుని పవిత్రతను దెబ్బతీసిన, పలు రకాలుగా వడ్డీకాసులవాని ఖజానాకు గండివేసిన వారిపైచర్యలకు ఉపక్రమిస్తారా అనే చర్చ మొదలైంది.

**ఎమ్మెల్సీ పేరుతో నకిలీ సిఫార్సు లేఖ:** ఇదే సమయంలో మంగళవారం తిరుమలలో ఎమ్మెల్సీ పేరుతో ఓ నకిలీ సిఫార్సు లేఖ రావడం సంచలనంగా మారింది. టిడిపి ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్ పేరుతో నకిలీ సిఫార్సు లేఖ తిరుమలకు చేరడంతో కలకలం రేపింది. ఎమ్మెల్సీ లెటర్ హెడ్‌తో నకిలీ సిఫార్స్ లేఖ తయారు చేసిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. దీనిపై కాకినాడ సర్పవరం స్టేషన్‌లో ఎమ్మెల్సీ రాజశేఖర్ ఫిర్యాదు చేయడం, అప్పన్న అనే వ్యక్తి తన సంతకాన్ని ఫోర్జరీ చేసి టిటిడికి లేఖ ఇచ్చారని ఫిర్యాదులో పేర్కొనడం విశేషం.

గత రెండేళ్ళుగా తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనానికి విచ్చేసే భక్తులకు టిటిడి కల్పిస్తున్న దర్శనం, వసతి తదితర సేవలు దళారుల ప్రమేయం లేకుండా మరింత పారదర్శకంగా నేరుగా అందించేందుకు టిటిడి పక్కా వ్యూహంతో ముందుకు వెళుతోంది.

తిరుమలకు వచ్చే భక్తులకు ఆఫ్‌లైన్ (కౌంటర్ సేవలు), ఆన్‌లైన్ (వెబ్‌పోర్టల్) రెండింటిల్లో అందిస్తున్న సేవలను పక్కదారిపట్టించి కొందరు దళారులు భక్తులను మోసంచేసి భారీ మొత్తంలో డబ్బులు వసూలుచేస్తుండటం పరిపాటిగా మారింది. గతంలోనే ఆన్‌లైన్‌లో బల్క్ బుకింగ్‌లకు ఉపయోగించే మొబైల్ నంబర్లు, మెయిల్ ఐడి ప్రూఫ్‌లు రద్దుచేశారు.

ఫేక్ మొబైల్ నంబర్లు, మెయిల్ ఐడిలు, ఐడి ప్రూఫ్‌లు ఉపయోగించి ఇప్పటికే బుక్‌చేసిన సేవలను ఉపయోగించడానికి అనుమతింపబడవని వెల్లడించారు. ఇందుకోసం ప్రత్యేకంగా టిటిడిలో నిఘాభద్రత విభాగం ఉంది. ఐపిఎస్ అధికారి సివిఎస్ఒ హోదాలో ముగ్గురు విఎస్ఒలు (డిఎస్పీ హోదాలో), ఏవిఎస్ఒలు సిఐల హోదాలో, విఐలు ఎస్ఐల హోదాలో విధులు నిర్వహిస్తున్నారు.

ఇలాంటి నకిలీ లేఖలపై, దళారులను కనిపెట్టేందుకు విజిలెన్స్‌లో వింగ్ విభాగం మరో ప్రత్యేకం. అయితే టిటిడిలో విజిలెన్స్ విభాగం పనితీరు అసలు విధుల కంటే కొసరు విధులపైనే దృష్టి పెట్టి పనిచేస్తుండటం మాత్రం విమర్శలకు తావిస్తోంది. అయినా దళారులు అడ్డదారుల్లో అమాయక భక్తులను మోసం చేస్తూనే ఉండటం టిటిడి పనితీరును తేటతెల్లం చేసేలా మారింది.

## మొగిలిచెర్ల దత్తాత్రేయ మందిరంలో 29న రుద్ర పాశుపత హోమం




**తిరుపతి, జూన్ 23 ప్రభాతవార్త ప్రతినిధి:** వేద శాస్త్రాల ప్రకారం జ్యేష్ఠ మాస పౌర్ణమి పర్వదినాన రుద్రపాశుపత హోమం నిర్వహించడం వల్ల శత్రు బాధలు, తీవ్రమైన గ్రహదోషాలు తొలగిపోయి ఆయురారోగ్యాలు సర్వకార్య సిద్ధి లభిస్తాయి. త్రిమూర్తి స్వరూపుడైన దత్తాత్రేయ స్వామి కొలువైన ప్రకాశం జిల్లా లింగసముద్రం మండలం మొగిలిచర్ల మందిరంలో ఈ రుద్ర పాశుపత హోమం ఈనెల 29న సోమవారం జరిపిస్తున్నారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పవని నాగేంద్రప్రసాద్, కన్వీనర్ పవని సాయికౌశిక్ తెలిపారు. ఆరోజు మందిరంలో మహాదేవుని పాశుపత అస్త్ర మంత్రాలతో జరిగే హోమంలో పాల్గొనడం వల్ల భక్తుల కర్మదోషాలు నశించి, భగవంతుని అభయ రక్షణతో పాటు అష్టైశ్వర్యాలు, అత్యున్నత ఆధ్యాత్మిక శాంతి కలుగుతాయని అర్చకులు తెలిపారు. ప్రత్యక్షంగా పాల్గొనదలచిన భక్తులు తమ పేర్లను 72078 75712, 91828 82632, 99089 73699 నంబర్లకు ఫోన్ చేసి రిజిస్టర్ చేసుకోవాలని ధర్మకర్త కోరారు.

## షణ్ముఖ స్వామికి ప్రత్యేకాభిషేకాలు



**శ్రీకాళహస్తి, జూన్ 23 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తిలోని పలు సుబ్రమణ్యం స్వామి ఆలయాల్లో మంగళవారం ప్రత్యేకాభిషేకాలు, అలంకారాలు నిర్వహించారు. పట్టణంలోని నలుమూలల నుంచి భక్తులు మంగళవారం వేకువ జాము నుంచి భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం స్వామికి షోడషాభిషేకాలు నిర్వహించారు. కొందరు భక్తులు ఆలయానికి వచ్చే భక్తులకు ఉచిత ప్రసాదాలను అందించారు. సాయంత్రం స్వామికి కన్నులు మిరుమిట్లు కొల్పునట్లు అలంకారాలు నిర్వహించారు. ఉదయం నిర్వహించిన చందనాలంకారం భక్తులకు ఇట్టే ఆకట్టుకుంది.

## జులై 16న శ్రీవారి ఆలయంలో ఆణివార ఆస్థానం



**తిరుమల, జూన్ 23 ప్రభాతవార్త ప్రతినిధి:** కలియుగవైకుంఠం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో జులై 16 గురువారం ఆణివార ఆస్థానం వేడుకగా జరగనుంది. ఈ ఉత్సవం కోసం తమిళనాడులోని శ్రీరంగం రంగనాథస్వామి ఆలయం నుండి ఆలయ పండితులు, అధికారులు ప్రత్యేకంగా పట్టు వస్త్రాలు తీసుకువచ్చి శ్రీవారికి సమర్పిస్తారు. ఆస్థాన సేవను బంగారు వాకిలిలో గరుడాళ్వార్ సన్నిధిలో ఆస్థానంలో శ్రీవారి ఉత్సవమూర్తి సమక్షంలో అర్చకులు అత్యంత వేడుకగా జరుపుతారు. సర్వభూపాల వాహనంలో ఉత్సవమూర్తులను కొలువుదీరుస్తారు. మరోపీఠంపై స్వామి సర్వసైనాధ్యక్షుడైన విష్వక్సేనులస్వామి దక్షిణాభిముఖంగా వేంచేపు చేస్తారు. పెద్దజీయర్ స్వామి వెండితట్టలో ఆరు పెద్ద పట్టువస్త్రాలను తలపై పెట్టుకుని ఊరేగింపుగా తీసుకొచ్చి మూలవిరాట్టుకు, మలయప్ప స్వామికి, విష్వక్సేనులవారికి అలంకరి స్తారు. శ్రీవారి ఆలయ ప్రధాన అర్చ కులు తమ తలకు శ్రీవారి పాదవస్త్రం తో పరివట్టం (చిన్నపట్టు గుడ్డ) కట్టుకుని స్వామివారి ద్వారా బియ్యపు దక్షిణ స్వీకరించి నిత్యైశ్వర్యో భవ అని స్వామిని ఆశీర్వదిస్తారు. అర్చకులు పెద్ద, చిన్నజీయర్ స్వాములకు, టిటిడి తరుపున ఇఒకు 'లచ్చన' అను తాళపు చెవి గుత్తిని కుడిచేతికి ఇచ్చి, రూపాయి హారతి, చందనం, తాంబూలం, తీర్థం, శఠారి మర్యాదలు చేస్తారు. అనంతరం ఈ తాళపు చెవి గుత్తిని శ్రీవారి పాదాల వద్ద ఉంచడంతో ఆణివార ఆస్థానం ముగుస్తుంది. జులై 16వ తేదీన ఆణివార ఆస్థానం జరగనున్న నేపథ్యంలో 14వ తేదీ కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం (ఆలయ శుద్ధి) కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ రెండు ఉత్సవాల నేపథ్యంలో స్వయంగా వచ్చే ప్రొటోకాల్ ప్రముఖులకు మినహా విఐపి బ్రేక్ దర్శనాలను టిటిడి రద్దు చేసింది. జులై 13, 15 తేదీల్లో సిఫారసు లేఖలను కూడా స్వీకరించరు.

## వెంకటపాలెం టోల్‌ప్లాజా వద్ద వాహనదారుల ఆందోళన

**విజయవాడ, జూన్ 23 ప్రభాతవార్త ప్రతినిధి:** పశ్చిమ బైపాస్‌పై వెంకటపాలెం టోల్‌ప్లాజా వద్ద వాహనదారులు ఆందోళన చేశారు. టోల్‌ప్లాజా యాజమాన్యం తీరుపై వాహనదారులు నిరసన వ్యక్తం చేశారు. సీడ్ యాక్సిస్ రోడ్డు పైకి వెళ్లేందుకు సర్వీసు రోడ్డు ఉన్నా యూటర్న్ మూసివేతపై నిరసన తెలిపారు. సర్వీస్ రోడ్డులోకి ప్రవేశాన్ని మూసివేసి టోల్ దాటేలా ఏర్పాటు చేయడంపై నిరసన తెలిపారు. స్థానికులతో పాటు లాయర్లు, సచివాలయ ఉద్యోగులు నిరసనకు దిగారు. ఆందోళన కారణంగా పశ్చిమ బైపాస్‌పై కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచాయి. రాజధానికి 20 కి.మీ. పరిధిలోని అన్ని వాహనాలకు ఉచిత టోల్‌గేట్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. యూటర్న్ తీసుకుంటే రెండుసార్లు వసూలు చేయడమేంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యాయం చేయకపోతే రేపు పెద్దఎత్తున ఆందోళన చేస్తామని స్థానికులు హెచ్చరించారు.



# ప్రకాశం.. పెట్టుబడుల గమ్యస్థానం!

● పారిశ్రామికవేత్తలను జిల్లా వైపు తిప్పిన ప్రకాశం జిల్లా బిజినెస్ ఎలైట్ మీట్ ● 12 రంగాల పెట్టుబడి దారులు హాజరు ● రూ.320 కోట్ల పెట్టుబడులకు తక్షణ ప్రతిపాదనలు ● మరిన్ని రాబట్టేలా యంత్రాంగం పర్యవేక్షణ ● ప్రజాప్రతినిధుల సహాకారంతో సదస్సు సక్సెస్



**ఒంగోలు, జూన్ 23 ప్రభాతవార్త:** వెనుకబాటు ముద్రను తుడిపేసి ప్రకాశం జిల్లా పారిశ్రామికంగా సమగ్ర అభివృద్ధి సాధించేందుకు నిర్వహించిన ప్రకాశం బిజినెస్ ఎలైట్ మీట్-2026 గ్రాండ్ సక్సెస్ అయ్యింది. స్థానికంగా పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అవకాశాలను వివరిస్తూ పారిశ్రామికవేత్తల దృష్టిని ప్రకాశం జిల్లా వైపు తిప్పేలా కలెక్టర్ పి.రాజబాబు ప్రత్యేక చొరువ తీసుకోవడంతో పెట్టుబడి దారులు ముందుకు వచ్చారు. ఈనెల 22వ తేదీ రాత్రి ఒంగోలులోని ఎస్‌జీవీఎస్ కన్వెన్షన్ సెంటర్లో జరిగిన ఈ సదస్సులో 12 రంగాల పెట్టుబడిదారులు పాల్గొన్నారు. సుమారు రూ.320 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు తక్షణమే ఆసక్తి చూపారు. ప్రభుత్వం నుంచి సహకారం అందించాలని కోరారు. కాగా, మరింతమంది జిల్లా బాట పట్టేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పర్యవేక్షిస్తున్నారు. కలెక్టర్, జిల్లాలోని ప్రజా ప్రతినిధులు సమన్వయంతో నిర్వహించిన ఈ మొట్టమొదటి సదస్సు మరిన్ని పెట్టుబడులకు నాంది పలకనుంది.

పెట్టుబడులు పెట్టేందుకు జిల్లాలో ఉన్న అవకాశాలను స్వయంగా కలెక్టర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఈ కార్యక్రమంలో వివరించారు. ప్రకాశం జిల్లా.. అవకాశాల జిల్లా అని పేర్కొన్నారు. 2025 సంవత్సరంలో జిల్లా తలసరి ఆదాయం రూ.2,17,511గా ఉందని, జిల్లా స్థూల ఉత్పత్తి రూ.73,331 కోట్లుగా నమోదైందని తెలిపారు. వృద్ధిరేటు 15.3 శాతంగా ఉందన్నారు. రామాయపట్నం పోర్టు, బీపీసీఎల్, ఇండోసోల్ కంపెనీలతో పాటు జిందాల్ స్టీల్ కంపెనీ కూడా ఐరన్‌ఓర్ తవ్వకాల ప్రతిపాదనతో వచ్చిందన్నారు. మరో వైపు దొనకొండ మండలంలో 25వేల ఎకరాలతో మెగా ఇండస్ట్రీయల్ పార్కు అందుబాటులో ఉందని చెప్పారు. జాతీయ రహదారులు, బెంగుళూరు- కడప- విజయవాడ ఎక్స్‌ప్రెస్ హైవే రవాణా వ్యవస్థ రూపురేఖలను మార్చాయన్నారు. విస్తృత అభివృద్ధి అవకాశం ఉన్న 20 కిలోమీటర్ల కోస్తా తీరం కూడా ప్రకాశం జిల్లా సొంతమన్నారు. ప్రపంచంలోని 50 శాతం నగరాలు సముద్ర తీరం వెంబడే అభివృద్ధి చెందాయని కలెక్టర్ వివరించారు. ఈ వాస్తవాలను, స్థానికంగా ఉన్న అవకాశాలను వినియోగించుకొని పెట్టుబడులతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సోషల్, ఇండస్ట్రీయల్, సర్వీస్ రంగాలలో ఉన్న మౌలిక వసతులను వినియోగించుకుని ప్రకాశం జిల్లా పారిశ్రామిక అభివృద్ధిలో కెటలిస్టుగా మారాలని పెట్టుబడిదారులను కోరారు.

**పాల్గొన్న ప్రముఖులు:** నవయుగ ఇంజనీరింగ్ కంపెనీ సిఇఒ ఎస్.సుబ్బారావు, ఇండోసోల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ బాల చందర్ కృష్ణన్, ఏపీ ప్రాజెక్ట్స్ సీజీఎం శ్రీ పీప షాన్ వేర్, ఏపీ రెన్యువబుల్ ఎనర్జీ ఆపరేషన్స్ హెడ్ రాజేష్ పటానియా, రవిశంకర్ గ్రూప్స్ చైర్మన్ కంది రవిశంకర్, నోవాటెల్ హోటల్స్ జనరల్ మేనేజర్లు, మనీష్, అఖిల్, దస్పల్లా హోటల్స్ ఎండీ శరత్‌బాబు, క్రేజీ హైడెట్ హోటల్స్ అండ్ రిసార్ట్స్ ఎండీ శరత్‌బాబు, క్రేజీ హైడెట్ హోటల్స్ అండ్ రిసార్ట్స్ ఎండీ టి.రవికుమార్, ఐకాన్ కనస్ట్రక్షన్స్ ఎండీ కే.విజయ్ కృష్ణ, పీవీపీ కనస్ట్రక్షన్స్ ఎండీ ప్రదీప్ వర్మ, సూర్య ఇంటర్నేషనల్స్ ఎండీ డాక్టర్ పెండ్యాల హరినాథ్ బాబు, ఒకస్ స్కై స్క్రాపర్స్ రియాల్టీ ప్రైవేటు లిమిటెడ్ ఆపరేషన్స్ మేనేజర్ ఎన్.శివకృష్ణ పాల్గొన్నారు.

**పెట్టుబడుల ప్రతిపాదనలు:** కొత్తపట్నం బీచ్‌లో రూ.75 కోట్లతో వాటర్ అడ్వెంచర్ స్పోర్ట్స్, హోటల్, విల్లా, పర్యాటక అనుబంధ సదుపాయాలను ఏర్పాటు చేస్తామని ఢిల్లీకి చెందిన ఒకస్ గ్రూప్ ప్రతిపాదనతో వచ్చింది.

- పాకలలో రూ.50కోట్లతో బీచ్ రిసార్ట్ ఏర్పాటు చేస్తామని ఆలాస్ ఫుడ్ వరల్డ్ రెస్టారెంట్ సంస్థ ముందుకు వచ్చింది.

- రూ.75 కోట్లతో 500 పడకల మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఏర్పాటు చేస్తామని, ప్రభుత్వం నుంచి సహకారం అందించాలని ఉపాస్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ కోరింది. దీని ద్వారా ప్రత్యక్షంగా వెయ్యి మందికి పైగా, పరోక్షంగా 500 మందికి పైగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపింది. రూ.100 కోట్లతో సీ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తామని శ్రీ మంజునాథ హేచరీస్ ప్రతిపాదించింది.

- జిల్లాలో రూ.12 కోట్లతో మొక్కజొన్న డ్రయ్యర్ యూనిట్ ఏర్పాటు చేస్తామని, 150 మందికి ఉపాధి లభిస్తుందని, దీని కోసం స్థలం కేటాయించాలని ఒంగోలుకు చెందిన నాగేశ్వరరావు కోరారు. జిల్లాలో రూ.7కోట్లకు పైగా పెట్టుబడితో సోలార్ పవర్ జనరేషన్ యూనిట్, ప్లాస్టిక్ రీసైక్లింగ్ యూనిట్/ వేస్ట్ రీసైక్లింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తానని ఒంగోలుకు చెందిన పెనుబోతు అజిత్ ముందుకు వచ్చారు.

ఈ కార్యక్రమంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్ధన్‌రావు, బీఎన్ విజయ్ కుమార్, ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, కందుల నారాయణరెడ్డి, ఏలూరి సాంబశివరావు, రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ నూకసాని బాలాజీ, మ్యారీటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్యనారాయణ, దర్శి టిడిపి ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మీ, జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి, సబ్ కలెక్టర్ డి.హిమవంశి, ఇతర ఉన్నతాధికారులు, యువ పారిశ్రామిక వేత్త మాగుంట రాఘవరెడ్డి పాల్గొన్నారు.




## దాడులకు, బెదిరింపులకు భయపడం

● వైసిపి జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్ రెడ్డి

**నెల్లూరు(విద్య), జూన్ 23 ప్రభాతవార్త:** ప్రభుత్వ అవినీతిని ఎదిరించినందుకు కృష్ణచైతన్య విద్య సంస్థలపై దాడులు చెయడం నీతిమాలిన రాజకీయాలకి ప్రత్యక్ష నిదర్శనమని, ఇటువంటి దాడులకు, బెదిరింపులకు తాము బయపడే ప్రశక్తే లేదని వైకాపా జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వైకాపా పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో కాకాణి గోవర్ధన్ రెడ్డి మాట్లడుతూ ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి విద్యాసంస్థలపై దాడులు చేయడం అంటే ప్రశ్నించే వారిని అణగదొక్కడమేనన్నారు. మెగా డియస్సీలో ప్రభుత్వం చేసిన అక్రమాలను ప్రశ్నించడమే చంద్రశేఖర్ రెడ్డి చేసిన తప్పా అని ప్రశ్నించారు. జిల్లాలో ఉన్న 70 కాలేజీలను వదిలిపెట్టి కేవలం చంద్రశేఖర్ రెడ్డి విద్యా సంస్థలపై దాడులు చేయడం చూస్తుంటే కూటమి ప్రభుత్వ నేతలు రాజకీయాల్లో ఏ స్థాయికి దిగజారిపోయారు అర్థమవుతుందన్నారు. ఈ దాడులు కేవలం రాజకీయ కక్ష సాధింపు చర్యలేనన్నారు. ఇలాంటి వాటికి చంద్రశేఖర్ గాని, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ గాని భయపడిపోదని ఇంకా రెట్టింపు ఉత్సాహంతో ప్రజా సమస్యలపై పని చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, ఆనం విజయకుమార్ రెడ్డి తదితరులు మాట్లాడుతూ, రాజకీయంగా ఎదుర్కోవాలే కానీ ఇలాంటి దాడులు ప్రజాస్వామ్యంలో సరికాదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సమావేశంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



## జగన్‌కు దమ్ముంటే.. కాపు నేతను సిఎం అభ్యర్థిగా ప్రకటించాలి: కిరణ్ రాయల్

**తిరుపతి, జూన్ 23 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర రాజకీయాలు కులాల చుట్టూ తిరగడం దురదృష్టకరమని,రాష్ట్రంలో కాపు సామాజిక వర్గం 25నుండి 27 శాతం ఓటు బ్యాంకుగా ఉందని తిరుపతి జనసేన పార్టీ ఇంచార్జ్ కిరణ్ రాయల్ పేర్కొన్నారు. రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలోకి రావాలన్నా కాపుల ఓట్లు కీలకమని అభిప్రాయం వ్యక్తం చేశారు. వైసిపి నేత జగన్‌కు దమ్ముంటే ఐదుగురు కాపు నేతల్లో ఒకరిని సిఎం అభ్యర్థిగా ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. ఐదుగురికి ఒక్కో ఏడాది చొప్పున సిఎం పదవి కేటాయించాలని సవాల్ విసిరారు. సిఎం అభ్యర్థిగా ఎవరిని ప్రకటించినా ముందస్తు శుభాకాంక్షలు అంటూ వ్యాఖ్యలు చేశారు. మంగళవారం తిరుపతిలో మీడియాతో మాట్లాడారు. కాపు సామాజిక వర్గాన్ని వైసిపి పావులుగా వాడుకుంటోందని, ప్రతి ఘటనకు డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్‌ను బాధ్యుడిగా చూపడం సరికాదని విరుచుకుపడ్డారు. పెయిడ్ ఆర్టిస్టులతో నిరసన చేయడం భూమన ఫ్యాషన్‌గా మారిందని విమర్శించారు.

## చోరీ కేసును ఛేదించిన పోలీసులు

● రూ.11.88 లక్షల విలువైన సొత్తు రికవరీ



**నెల్లూరు(వైద్యం), జూన్ 23 ప్రభాతవార్త:** నెల్లూరు నగర పరిధిలోని వేదాయపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన భారీ గృహ చోరీ కేసును పోలీసులు అత్యంత వేగంగా ఛేదించారు. ఈ ఘటనలో నిందితుడిని అరెస్టు చేసి, సుమారు రూ.11.88 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. చెడు అలవాట్లకు బానిసై, సులభంగా డబ్బు సంపాదించాలనే దురాశతోనే చోరీలను వృత్తిగా ఎంచుకున్న వ్యక్తి చివరకు మరోసారి కటకటాల పాలయ్యాడు. నెల్లూరు రూరల్ మండలం, రెవెన్యూ కాలనీలోని ఒక మూడు అంతస్తుల భవనంలోని మొదటి అంతస్తులో నివాసం ఉంటున్న యజమానులు తాళం వేసి బయటకు వెళ్ళిన సమయంలో, గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి గ్రిల్ గేటు, కిటికీలను తొలగించి లోపలికి ప్రవేశించారు. బీరువాలో ఉన్న బంగారు, వెండి ఆభరణాలను అపహరించారు. ఈ మేరకు బాధితుల ఫిర్యాదుతో వేదాయపాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. జిల్లా ఎస్‌పీ డా. అజిత వెజెండ్ల ఆదేశాల మేరకు, అడిషనల్ ఎస్‌పీ సౌజన్య దిశానిర్దేశం, టౌన్ ఏఎస్‌పీ దీక్ష పర్యవేక్షణలో వేదాయపాలెం సీఐ శ్రీనివాసరావు నేతృత్వంలో పోలీసులు ప్రత్యేక బృందంగా ఏర్పడి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో, ఈ నెల 22న బుజబుజనెల్లూరు హైవే రోడ్డుపై అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఉప్పు శివనారాయణ అనే వ్యక్తిని పోలీసులు గుర్తించారు. పోలీసులను చూడగానే పారిపోయేందుకు ప్రయత్నించిన నిందితుడిని వెంబడించి అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి వద్ద ఉన్న బ్యాగును తనిఖీ చేయగా, చోరీకి గురైన సొత్తు బయటపడింది. నిందితుడి వద్ద నుండి సుమారు 162.5గ్రాములు (విలువ రూ.11,37,500) సుమారు 340 గ్రాములు (విలువ రూ.51,000) వెరసి మొత్తం రూ.11,88,500 విలువ చేసే సొత్తును స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసిన అతి తక్కువ సమయంలోనే నిందితుడిని అరెస్టు చేసి, దొంగిలించిన ఆస్తిని పూర్తిగా రికవరీ చేసిన ఏఎస్‌పీ దీక్షను, వేదాయపాలెం సీఐ శ్రీనివాస రావు ఇతర పోలీసు సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.

## కుళ్ళిన మాంసం విక్రయాలపై కేసులు

**తిరుపతి, జూన్ 23 ప్రభాతవార్త ప్రతినిధి:** స్మార్ట్‌సిటీ తిరుపతి నగరంలో ఇటీవల వెలుగుచూసిన నిల్వచేసి కుళ్ళిన, దుర్వాసన వస్తున్న మాంసం విక్రయాలపై దాడులు జరిగిన విషయం తెలిసిందే. దీనిపై తిరుపతి నగర ఆరోగ్యఅధికారి డాక్టర్ యువ అన్వేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు తిరుపతి పిపిచావడి దగ్గర ఉన్నటువంటి మటన్ మార్కెట్‌లో వ్యాపారం నిర్వహిస్తున్నటువంటి ఐదుగురు వ్యాపారస్తులపై మంగళవారం తిరుపతి వెస్ట్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఆరోగ్యానికి హానికరంగా ఉన్న మాంసం నిల్వ ఉంచుకొని అమ్ముతున్నారనే ఘటనపై ఫిర్యాదు అందిదని వెస్ట్ సిఐ పి.రామకృష్ణ తెలిపారు. ఫిర్యాదుపై కేసు నమోదు చేయడం జరిగిందని సిఐ చెప్పారు. పిపిచావడి దగ్గర గల మాంసం మార్కెట్ సుమారు 500 కేజీలు మాంసం హానికరమైనదని గుర్తించారు. కుళ్ళిన మాంసం కలిగివున్న వ్యాపారులు ఎస్ నిషార్ బాష, షేక్ ఎస్ చాంద్ బాష, హబూబాద్ షరీఫ్, ఎస్ రఫీ, ఎస్ మొహిద్దీన్ దుకాణాల్లో భారీగా కుళ్ళిన మాంసం లబించిందని ఫిర్యాదులో పేర్కొన్నారు.

## మాజీ సర్పంచ్ ఆత్మహత్య

**హుస్నాబాద్ రూరల్, జూన్ 23, ప్రభాతవార్త:** హుస్నాబాద్ మండలం మహమ్మదాపూర్‌లో విషాద ఘటన చోటుచేసుకుంది. గ్రామ మాజీసర్పంచ్ పిట్టల సంపత్ మంగళవారం వ్యవసాయ బావివద్ద ఉన్న చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగానే సంపత్ ఈ దారుణ నిర్ణయం తీసుకున్నారని ఆయన కుటుంబసభ్యులు, బంధువులు పేర్కొంటున్నారు. ఘటనపై కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా, సంపత్ ఆత్మహత్యకు గ్రామాభివృద్ధి పనులకు చేసిన ఖర్చుల బిల్లులు రాకపోవడమే ప్రధాన కారణమని పలువురు మాజీ సర్పంచ్‌లు ఆరోపిస్తున్నారు. ఆయన సర్పంచ్‌గా ఉన్న సమయంలో గ్రామాభివృద్ధి కోసం తనకు సంబంధించిన మామిడి తోటను విక్రయించి వచ్చిన డబ్బుతో అభివృద్ధి పనులు చేపట్టారని, అయితే ఆ పనులకు సంబంధించిన బిల్లులు ఇప్పటివరకు విడుదల కాకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నారని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో సంపత్ కుటుంబానికి న్యాయం చేయాలని, ప్రభుత్వం తక్షణమే ఆర్థిక సాయం ప్రకటించాలని డిమాండ్ చేస్తూ మాజీ సర్పంచ్‌లు హుస్నాబాద్- కరీంనగర్ ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. దీంతో కొంతసేపు రహదారిపై వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ఆందోళన కారులతో చర్చించి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృత దేహాన్ని పరిశీలించారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆత్మహత్యకు గల ఖచ్చితమైన కారణాలను పోలీసులు విచారణ ద్వారా తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు.

# విద్యతోనే సమానత్వం, గౌరవం

● డి.సిఎం పవన్ ఆలోచన, మా ఆలోచన ఒకటే ● ఎపి వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్

**నెల్లూరు(వైద్యం), జూన్ 23 ప్రభాతవార్త:** నెల్లూరు పరమేశ్వరి నగర్ నందు గల వక్ఫ్ భూమి నందు నిర్మిస్తున్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఇంటర్నేషనల్ స్కూల్ నిర్మాణ పనులను ఏపీ వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, రాష్ట్ర వక్ఫ్ బోర్డు సభ్యులు, వక్ఫ్ సిఇఒ పరిశీలించారు. ఈ సందర్భంగా అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ 20 కోట్లు సిఎస్ఆర్ నిధులతో కార్పొరేట్ స్థాయి స్కూల్‌ను నిర్మిస్తున్నామని, వచ్చే ఏడాదికి అందుబాటులోకి తేవాలని శరవేగంగా, పనులు జరుగుతున్నాయని తెలిపారు. తనకు అన్ని జిల్లాల నుంచి స్థలాలు కేటాయించాలని ఫోన్లు చేస్తున్నారని స్థలాలు కేటాయిస్తే తాము కూడా స్కూళ్లు నిర్మిస్తామని ముందుకు వస్తున్నారు అని అన్నారు. తాలెం ఏ హునర్‌తో 250 మంది విద్యార్థులకు కార్పొరేట్ విద్యను అందిస్తున్నామని, కేవలం చదువుతూనే సమానత్వం గౌరవం దొరుకుతాయని అన్నారు. వక్ఫ్ భూములు నిరుపయోగంగా ఉంటే ఆక్రమణకు గురవుతున్నాయని, ఆస్తులను నిరుపయోగంగా ఉంచకుండా ఉపయోగంలోకి తీసుకుని వచ్చి ఆదాయాన్ని పెంచుతామని తెలిపారు. స్కూల్ నిర్మాణానికి సహకరించిన మంత్రి నారాయణ ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డికు కృతజ్ఞతలు తెలిపారు. నెల్లూరులో ఉన్న కాలేజీలు మాత్రమే రైడ్ చేయలేదని, వెడత వారం భీమవరంలో నారాయణ కాలేజీని కూడా రైడ్ చేశారని అన్నారు. రూల్స్ పాటిస్తే అంత భయం ఎందుకని అన్నారు. మంత్రి నారాయణ స్వభావం కక్ష సాధింపులు చేసే స్వభావం కాదని, కక్ష సాధింపులు చేస్తూ మీరెవరు వ్యాపారాలు చేయలేరని హెచ్చరించారు. ప్రతిపక్షంలో మమ్మల్ని ఎందుకు కష్టాలు పెట్టారని అన్నారు. ప్రతి విషయంలో నేను ఉన్నాను ముందుకు వచ్చినప్పుడు మిస్టర్ క్లీన్‌గా ఉండాల్సిన అవసరం ఉందని అన్నారు. తమ పై రాజకీయ బురద వేయొద్దని, మీ పై ఉన్న బురద కడుక్కోవాలని అన్నారు.

ఏఎస్ పేట దర్గా విషయం పై స్పందన: ఎస్ పేట సజ్జాద హాఫీజ్ పాషా బోర్డుకు వ్యతిరేకంగా 32 కేసులు వేశారని అన్నారు. సజ్జాద పనులు సరిగ్గా చేయడం లేదని అతనికి నోటీసులు ఇచ్చామని పేర్కొన్నారు. గతంలోనే అతనిని మతవల్లిగా తొలగించామని తెలిపారు. పవన్ కల్యాణ్ ఆలోచనే తమ ఆలోచన కూడా అని వివరించారు. ఎంక్వయిరీ పూర్తికాకుండా చర్యలు బహిర్గతం చేయలేమని, వెరీ పూర్తయ్యాక అతని మీద ఖచ్చితంగా చర్యలు ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో వక్ఫ్ బోర్డు సభ్యులు అక్రమ్, ఖాజా, ఇస్మాయిల్ బేగ్, బెపారి జాకీర్ అహ్మద్ సీఈవో యాకూబ్ ఖాజీ పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల ఎత్తివేతకు కుట్ర



ప్రైవేట్, కార్పొరేట్ స్కూల్స్ ఆర్థిక దోపిడీకి కొమ్ముకాస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

పాఠశాలల రాష్ట్ర బంద్ విజయవంతం

ఎబివిపి రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రాంబాబు

**హైదరాబాద్, జూన్ 23, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల ఎత్తివేతకు కుట్రచేస్తూ, ప్రైవేట్,కార్పొరేట్ పాఠశాలల విచ్చలవిడి ఆర్థిక దోపిడీకి కొమ్ముకాస్తున్న రాష్ట్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) రాష్ట్ర కమిటీ మంగళవారం చేపట్టిన పాఠశాలల బంద్ విజయ వంతం అయిందని సంఘం రాష్ట్ర కార్యదర్శి మాచెర్ల రాంబాబు తెలిపారు. ఈ సందర్భం గా మాచెర్ల రాంబాబు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో పేద పిల్లలకు విద్యను దూరం చేయడం కోసమే 23000 ప్రభుత్వ పాఠశాలలను మూసి వేసేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి కుట్ర చేస్తున్నాడనీ దుయ్య బట్టారు. ఆదివాసీ గూడెంలలో, గిరిజన తండాల్లో, దళిత వాడల్లోని పిల్లలు చదవుకోవడం ఇష్టంలేదా అని ముఖ్యమంత్రిని ప్రశ్నించారు. ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలో లక్షల కొద్ది ఫీజులు వసూలు చేస్తున్న ఆయా యాజమాన్యాలపై చర్య లు తీసుకోవడం లేదని, ఫీజుల నియంత్రణ చట్టం హామీని ప్రభుత్వం గాలికొదిలేసిందన్నారు. ప్రభుత్వ పాఠశాలల భూములను కాజేసేందుకే రేషనలైజేషన్ పేరుతో ప్రభుత్వ బడులను మూస్తున్నాడా? అనే అనుమానం కలుగుతుందన్నారు. విద్యాసంవత్సరం మొదలై వారం గడుస్తున్నా ఇప్పటి వరకు కనీసం పిల్లలకు యూనిఫామ్స్, పుస్తకాలు అందలేదంటే ప్రభుత్వం ఎంత నిరక్ష్యంగా వ్యవహరిస్తుందో అర్థమవుత ందన్నారు. ప్రభుత్వ స్కూళ్లలో మౌలికవసతులు కరువయ్యాయని, ఆడపిల్లకు సరిపడా బాత్రూంలు కూడా లేని పరిస్థితి ఈ రాష్ట్రంలో ఉందన్నారు. పేద విద్యార్థులకు ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో 25శాతం ఉచితంగా సీట్లు అందించే విద్యాహక్కు చట్టం అటకెక్కిందన్నారు. ఎంఈవో, డీఈవో పోస్టులను భర్తీచేయక క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ లోపించిందన్నారు. బ్రేక్ ఫాస్ట్ స్కీమ్‌ను ఎందుకు అన్ని పాఠశాలల్లో అమలు చేయడం లేదో విద్యాశాఖ మంత్రిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలన్నారు. తాము నిర్వహించిన "బంద్"లో తల్లిదండ్రులు, విద్యార్థులు స్వచ్ఛందంగా మద్దతు తెలిపారని, ప్రైవేట్ విద్యా సంస్థలు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొన్నాయన్నారు. గవర్నమెంట్ పాఠశాలల్లో విద్యార్థులు బంద్‌కు సహకరించాలని విజ్ఞప్తి చేస్తున్న సందర్భంలో కొంతమంది పోలీసులు విచక్షణ మరిచి ప్రవర్తించారని మండిపడ్డారు. అందరి మద్దతుతో రాష్ట్ర వ్యాప్త పాఠశాలల బంద్ విజయవంతమయిందని రాంబాబు తెలిపారు.

# క్యూర్ ఏరియాలో లక్ష ఫ్లాట్ల నిర్మాణం

ఎల్ఐజి హౌసింగ్ స్కీం.. పేరు ఖరారుపై పోటీ


28 వరకు సోషల్ మీడియాలో నిర్వహణ

ఉత్తమమైనదిగా ఎంపికైన దానికి రూ.లక్ష బహుమతి

హౌసింగ్ బోర్డు వినూత్న ప్రయత్నం



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 23:** తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత తొలిసారిగా అల్పాదాయ వర్గాలకు (ఎల్ఐజి) క్యూర్ ఏరియాలో ప్రతిపాదించిన లక్ష ఫ్లాట్ల నిర్మాణ పథకానికి పేరు ఖరారునకు హౌసింగ్ బోర్డు వినూత్న ప్రయత్నం చేపట్టింది. ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ పథకానికి మంచి పేరును నేరుగా ప్రజల నుంచే స్వీకరించాలని హౌసింగ్ బోర్డు నిర్ణయించింది. ప్రజల నుంచి వచ్చిన పేర్లలో ఉత్తమమైనదిగా ఎంపికైన పేరును సూచించిన వారికి ఒక లక్ష రూపాయల బహుమతిని అందచేస్తామని, సోషల్ మీడియా వేదికగా ఈ అంశంలో బహిరంగ పోటీని నిర్వహిస్తున్నట్లు హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ విపి గౌతం ఒక ప్రకటనలో తెలిపారు. క్యూర్ పరిధిలో అల్పాదాయ వర్గాల ప్రజల కోసం ప్రత్యేకంగా లక్ష ఇండ్లను నిర్మించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంతర్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఎటువంటి వివాదాలు లేకుండా, అందుబాటులోని ధరల్లో వివిధ వర్గాల ప్రజల సొంత ఇంటి కలలను నెరవేర్చడంలో హౌసింగ్ బోర్డుకు మంచి పేరు ఉంది. అంతే కాకుండా బోర్డు ఆధ్వర్యంలో చేపట్టి ప్రాజెక్టులకు ప్రజల నుంచి ఆదరణతో పాటు డిమాండ్ కూడా ఉన్నదని ఆయన గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో సుదీర్ఘం కాలం తరువాత చేపడుతున్న ప్రాజెక్టులో ప్రజలను కూడా భాగస్వామ్యులను చేయాలన్న ఆలోచనతో, ప్రజల నుంచి అందే సూచనల తోనే ఈ పథకానికి పేరును కూడా ఖరారు చేయాలని నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. ఈ నెల 28 వరకు సోషల్ మీడియాలో ఇందుకు సంబంధించిన పోటీని నిర్వహిస్తున్నా మన్నారు. ప్రజలు సూచించిన పేర్లలో ఉత్తమ మైనదిగా ఎంపికైన దానికి లక్ష రూపాయలను బహుమతిగా ఇస్తామన్నారు. హౌసింగ్ డిపార్ట్ మెంట్‌కు చెందిన ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పోటీలో పాల్గొనవచ్చని వివరించారు. క్యూర్ పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజక వర్గాల్లో ఎల్ఐజి ప్లాట్ల నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందిస్తున్నా మని, ఇందుకు అవసరమైన భూములను ఇప్పటికే గుర్తించామని వివరించారు. ఇందుకు సంబంధించి ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి, లాటరీ పద్ధతిలో ఇండ్లను కేటాయిస్తామని, పూర్తి విధివిధానాలను త్వరలోనే ప్రకటిస్తామని ఆయన పేర్కొన్నారు



## పిల్లల సంరక్షణలో 'తల్లి' హోదా ఒక్కటే సరిపోదు

ఆ తల్లి వద్ద బిడ్డ భవిష్యత్తు సురక్షితం కాదు

పుణే ఫ్యామిలీ కోర్టు సంచలన తీర్పు

చిన్నారి కస్టడీని తండ్రికి అప్పగిస్తూ ఆదేశాలు

**పుణె, జూన్ 23:** ఒక మహిళ తన వివాహ ప్రమాణాలను పాటించాలని, భర్తను శారీరకంగా, మానసికంగా చూసుకోవాలని, ఆయన క్షేమం కోసం ప్రార్థించాలని ఆశిస్తారు. ఒకవేళ ఆమె భర్త పట్ల ఈ 'పవిత్రమైన' బాధ్యతలను నిర్వర్తించకపోతే, అటువంటి తల్లి వద్ద వారి బిడ్డ భవిష్యత్తు 'సురక్షితం కాదు' అని పుణె కుటుంబ న్యాయస్థానం సంచలన తీర్పు నిచ్చింది. మైనర్ బాలుడి సంరక్షణ హక్కును (కస్టడీకి) తండ్రికి అప్పగిస్తూ ఇన్‌ఛార్జ్ ఫ్యామిలీ కోర్ట్ జడ్జి గణేష్ ఘులే ఉత్తర్వులు జారీ చేశారు. భర్త విషయంలో బాధ్యతలు విస్మరించిన భార్య తన పిల్లల సంరక్షణకు అనర్హురాలంటూ కోర్టు అభిప్రాయపడింది. ఈ సందర్భంగా తల్లి వద్ద ఉంటే పిల్లాడి భవిష్యత్తు సురక్షితం కాదని స్పష్టం చేసింది. ఈ మేరకు తల్లికి షాక్ ఇస్తూ చిన్నారి కస్టడీని తండ్రికి అప్పగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ సందర్భంగా పిల్లల సంరక్షణ విషయంలో కేవలం 'తల్లి' అనే హోదా ఒక్కటే సరిపోదని న్యాయ స్థానం వ్యాఖ్యానించింది. భర్త, అత్తమామల పట్ల క్రూరంగా ప్రవర్తించే వివాహితకు పిల్లలను కస్టడీ ఇవ్వలేమని పేర్కొంది. వైవాహిక బాధ్యతలను, కుటుంబ విధులను పూర్తిగా విస్మరించిన మహిళ.. బాధ్యతారహిత ప్రవర్తన బాలుడి మానసిక ఎదుగుదలపై ప్రభావం చూపుతుందని కోర్టు అభిప్రాయ పడింది. చట్టం ప్రకారం పిల్లల సర్వతోముఖాభివృద్ధే అత్యంత ముఖ్యమైన విషయమని చెప్పుకొచ్చింది. నిరంతరం గొడవలు పెట్టుకునే వాతావరణంలో చిన్నారులు సురక్షితంగా పెరగలేరని తెలిపింది. ఈ మేరకు అన్ని ఆధారాలను పరిశీలించిన తర్వాత బాలుడి సంరక్షణ బాధ్యతను తండ్రికి అప్పగించింది. తల్లికి కస్టడీ నిరాకరిస్తూ కేవలం నిర్ణీత సమయాల్లో మాత్రమే కుమారుడిని చూసుకునేందుకు అనుమతినిచ్చింది. ఈ సందర్భంగా పిల్లలను భాగస్వామిపై పగ తీర్చుకోవడానికి ఆయుధాలుగా వాడుకోలేరంటూ పుణె న్యాయస్థానం వ్యాఖ్యానించింది.

## రేవంత్ అడిగారు.. నేను ఏర్పాటు చేశా

ఎక్స్‌లో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పోస్ట్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 23:** ఢిల్లీ పర్యటనలో భాగంగా పలువురు కేంద్రమంత్రులతో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో కలిసి సోమవారం కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీవైష్ణవ్‌తో, మంగళవారం కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఖట్టర్‌తో రేవంత్ సమావేశమయ్యారు. ప్రధానంగా హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్-2 విస్తరణపైనే చర్చ జరిగింది. రేవంత్‌తో కలిసి కేంద్ర మంత్రులను కలవడంపై కిషన్‌రెడ్డి సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందించారు. 'కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీవైష్ణవ్‌తో సమావేశం ఏర్పాటు చేయించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రెండుసార్లు నాకు లేఖ రాశారు. 22వ తేదీన రైల్వే మంత్రి అశ్వినీవైష్ణవ్‌తో, 23న కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఖట్టర్‌తో సమావేశం ఏర్పాటు చేయించాను. మెట్రో రైల్ విస్తరణపై సానుకూల వాతావరణంలో చర్చలు జరిగాయి. తెలంగాణ నుంచి కేంద్ర కేబినెట్ మంత్రిగా ఉన్న నేను రాష్ట్ర అభివృద్ధి కోసం, ప్రజల సంక్షేమం కోసం ఎల్లవేళలా పనిచేస్తా' అని ఎక్స్‌లో కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.




మంగళవారం జరిగిన సదస్సులో మాట్లాడుతున్న ఎన్.రాంచందర్ రావు. చిత్రంలో ఎంపీ ఈటల రాజేందర్, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు కుండే గణేష్, ఎంఎల్‌సి అంజి రెడ్డి, ఎమ్మెల్యే హారీష్ బాబు, భరత్ గౌడ్

# యువత రాజకీయ అవకాశాలకు ప్రాధాన్యం

## బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు

**హైదరాబాద్ (చిక్కడపల్లి), జూన్ 23 ప్రభాతవార్త :** రాబోయే రోజులలో తమ పార్టీ యువతకు రాజకీయ అవకాశాల కల్పనకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు స్పష్టం చేసారు. మంగళవారం బీజేవైఎం తెలంగాణ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో బాగ్‌లింగంపల్లి ఆర్టీసీ కళాభవన్‌లో 'నమో జెన్ జెడ్ కాన్‌క్లేవ్' సదస్సు జరిగింది. బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు గణేష్ కుండే అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది ఐటీ నిపుణులు, విద్యార్థులు, యువతీ యువకులు తరలివచ్చారు. రాంచందర్ రావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని యువతలో రాజకీయ చైతన్యం కలిగి ఉందని, దేశం బాగుండాలనే ఆలోచనతో ముందుంటారని సంకల్పంతో కలిగి ఉంటారన్నారు. భారతదేశాన్ని ప్రపంచంలోనే అగ్రగామిగా నిలబెట్టే సరికొత్త ఆలోచనలు, సాంకేతిక నైపుణ్యం నేటి యువత సొంతమని అన్నారు. గత పాల్లకుల కాలంలో యువత కేవలం ఓటు బ్యాంక్‌గా మాత్రమే మిగిలి పోయిందనీ కానీ ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో నేడు యువత దేశాన్ని నడిపించే శక్తులుగా ఎదిగారన్నారు. తెలంగాణలో యువత మార్పును కోరుకుంటోందని ఈ సదస్సుకు వచ్చిన ప్రజాబాహుళ్యమే నిదర్శనమన్నారు. మల్కాజ్‌గిరి ఎంపీ ఈటెల రాజేందర్ మాట్లాడుతూ తెలంగాణలో నిరుద్యోగ సమస్యలపై, నోటిఫికేషన్ల జాప్యంపై బీజేపీ నిరంతరం పోరాడుతుందని గుర్తుచేశారు. బీజేపీ శాసనసభాపక్ష నాయకులు ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని యువత, విద్యార్థుల సమస్యలను శాసనసభ వేదికగా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని, బీజేవైఎం శ్రేణులు క్షేత్రస్థాయిలో యువతను చైతన్యపరచాలని కోరారు. బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు గణేష్ కుండే మాట్లాడుతూ ఈ కాన్‌క్లేవ్‌ను విజయవంతం చేసిన యువతకు కృతజ్ఞతలు తెలిపారు. సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు, శాసనమండలి సభ్యుడు అంజి రెడ్డి, బీజేపీ మహంకాళి జిల్లా అధ్యక్షుడు భరత్ గౌడ్, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు చాతిరి పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.



ఒప్పంద పత్రాలతో వ్యవసాయ వర్సిటీ, ఆస్కి అధికారులు

# వర్సిటీ, ఆస్కిల మధ్య అవగాహన ఒప్పందం

**అత్తాపూర్, జూన్ 23,ప్రభాతవార్త:** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణా వ్యవసాయ విశ్వవిద్యాలయం, అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా(ఆస్కి), హైదరాబాద్‌ల మధ్య మంగళవారం అవగాహనా ఒప్పందం కుదిరింది. వ్యవసాయ వర్సిటీ ఉప కులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య సమక్షంలో రిజిస్ట్రార్ డాక్టర్ విద్యాసాగర్, ఆస్కి రిజిస్ట్రార్, సెక్రటరీ డాక్టర్ ఓపీ సింగ్‌లు ఈ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసి పరస్పరం మార్చుకున్నారు. వ్యవసాయం, గ్రామీణాభివృద్ధికి సంబంధించిన అంశాలలో మానవ వనరుల శిక్షణ, అభివృద్ధి, యాజమాన్య పద్ధతులు, ఆధునిక పరిపాలన విధులు, పద్ధతులు, ఎంటర్ ప్రెన్యూర్ షిప్ తదితర అంశాలలో కలిసి పని చేయాలని ఇరు సంస్థలు నిర్ణయించాయి. ఈ ఒప్పందం ప్రకారం వ్యవసాయ వర్సిటీకి సంబంధించిన వివిధ కళాశాలల అసోసియేట్ డీన్స్, ప్రాంతీయ పరిశోధన కేంద్రాల అసోసియేట్ డైరక్టర్స్ ఆఫ్ రీసెర్చ్ మరియు ఇతర ఉన్నతాధికారులకి ఆస్కిలో జూలై 13,15 తేదీల మధ్య సీనియర్ మేనేజ్ మెంట్ మరియు ఎగజీక్యూటివ్ శిక్షణతరగతులు నిర్వహించనున్నారు. ఈ ఒప్పంద కార్యక్రమంలో ఆస్కి సెంటర్ ఫర్ అగ్రికల్చర్ అండ్‌రూరల్ డెవలప్ మెంట్ డైరక్టర్ వి. ఉషారాణి, పిజెటిఎయు పరిశోధన సంచాలకులు డాక్టర్ బలరాం, విస్తరణ సంచాలకులు డాక్టర్ యాకాద్రి, వర్సిటీ మానవ వనరుల అభివృద్ధి కేంద్రం సంచాలకులు అయ్యంగార్ పాల్గొన్నారు.



మంగళవారం మీడియాతో మాట్లాడుతున్న విజయభారతి

# ఖమ్మం సంఘటన భయానకం

## జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యురాలు విజయభారతి

**జూబ్లీహిల్స్, జూన్ 23, ప్రభాతవార్త:** ఖమ్మం సంఘటనలో చికిత్స పొందుతున్న బాలికను జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యురాలు విజయభారతి మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ 8వ తరగతి చదువుతున్న బాలిక జీవితాన్ని చిదిమేసిన సంఘటన ఇది అన్నారు. బాలిక స్పైనల్‌కార్డ్ చితికిపోయిందని, కాళ్లు కదల్చలేకపోతుం దన్నారు. నిమ్స్‌లో ప్రత్యేక వైద్య బృందం చికిత్సను అందిస్తుం దన్నారు. చిన్నారి ఇప్పటికి జరిగిన సంఘటనపై ఇంకా బయంగానే ఉందన్నారు. ఖమ్మంలో సంఘటన జరిగిన భవనాన్ని పరిశీలిస్తామని, సంఘటన జరిగిన రెండు రోజులపాటు ఖమ్మం ఆసుపత్రిలో అందించిన చికిత్స వివరాలను సేకరించాల్సి ఉందన్నారు. అలాగే అక్కడి పోలీసులు నమోదు చేసిన కేసు వివరాలను పరిశీలిస్తామన్నారు. ఇంకా కొన్ని నివేదికలు అవసరమున్నాయని వాటన్నింటిని సేకరించి ఢిల్లీకి వెళ్లిన అనంతరం సమగ్రంగా పరిశీలించి జాతీయ మానవ హక్కుల కమిషన్ నుంచి అవసరమైన నిర్ణయాలు తీసుకొంటామన్నారు. చిన్నారి ఆమె కుటుంబం జీవించే హక్కు, అలాగే గౌరవంగా జీవించే హక్కును కోల్పోయిందన్నారు. తల్లిదండ్రులు ఇద్దరు నిర్లక్ష్యరాస్యులని, చక్రాల కుర్చీలో బిడ్డను తీసుకెళ్తే సమాజమంతా గుర్తించి ప్రత్యక్షంగా అడుగుతందనే మనోవేదన తల్లిదండ్రుల కనిపిస్తుం దన్నారు. సమాజంలో భయాన్ని సృష్టించిన ఈ సంఘటన మిగిలిన పిల్లలను తల్లిదండ్రులు భయపడెతుందన్నారు. ఇది ప్రాథమిక హక్కులకు సంబంధించిన విషయమని, తెలంగాణ రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి ప్రతిరోజు చిన్నారి తల్లి దండ్రులతోమాట్లాడుతున్నారని, వారికి కావల్సిన ధైర్యాన్ని, వైద్య సాయాన్ని అందిస్తున్నారన్నారు.




# రంజిత్ రెడ్డి నివాసం ముందు స్వామీజీల ఆందోళన

**జూబ్లీహిల్స్, జూన్ 23, ప్రభాతవార్త:** ఫిల్మ్‌నగర్‌లోని అభయాంజనేయస్వామి దేవస్థానానికి చెందిన 2,750 గజాల భూమిని స్వామివారి పేరుతోనే నమోదు చేయా లని డిమాండ్ చేస్తూ పలువురు పీఠాధిపతులు, మఠాధిపతులు, హిందూ సంఘాల నాయకులు మంగళవారం జూబ్లీహిల్స్‌లో మాజీ ఎంపీ రంజిత్ రెడ్డి నివాసం ముందు శాంతియుత ఆందోళన నిర్వ హించారు. ఈ సందర్భంగా స్వామీజీలు మాట్లాడుతూ, డీఎస్ఆర్ గ్రూప్ తరఫున సుధాకర్ రెడ్డి గతంలో స్టాంప్ పేపర్‌పై స్వామివారి పేరుతోనే 2,750 గజాల భూమిని కేటాయిస్తామని హామీనిచ్చారని గుర్తు చేశారు. ప్రస్తుతం ఆ భూమిని దేవస్థానం పేరుతో కాకుండా ఎండోమెంట్స్ శాఖ పేరుతో నమోదు చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఇచ్చిన హామీని నిలబెట్టి ఆలయ భూమిని స్వామివారి పేరుతోనే నమోదు చేయాలని వారు డిమాం డ్ చేశారు. పోలీసులు మాజీ ఎంపీ నివాసం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో శివస్వామి, కృష్ణమాచార్య స్వామి, ఆత్మానంద భారతిస్వామి, భక్తి చైతన్యానంద సరస్వతిస్వామి, మాతా శివకామేశ్వరి ఆనందమయిమాతాజీ, సారంగదానందస్వామి, బాజీల్ గురుస్వామి, ప్రసన్నకృష్ణదాస్ ప్రభూజి స్వామి, మధు మంజరిదేవి స్వామిని పాల్గొన్నారు.

# యుద్ధ వ్యయం భర్తీకి 80 బిలియన్ డాలర్లు కావాలి

## అమెరికన్ కాంగ్రెస్ సభ్యులకు తెలిపిన రక్షణ ఉప కార్యదర్శి స్టీఫెన్ ఫెయిన్‌బర్గ్

**వాషింగ్టన్,జూన్ 23:** ఇరాన్ యుద్ధం కారణంగా పెరిగిన వ్యయా లు, రక్షణేతర ఖర్చులను భరించేందుకు అమెరికా రక్షణ శాఖకు అదనంగా 80 బిలియన్ డాలర్లు అవసరమని అమెరికా ఉప రక్షణ కార్యదర్శి స్టీఫెన్ ఫెయిన్‌బర్గ్ కాంగ్రెస్ సభ్యులకు తెలిపారు. పెంటగాన్ అవసరాలతో పాటు వ్యవసాయం, ప్రకృతి విపత్తుల సహాయ కార్యక్రమాలు వంటి రక్షణేతర రంగాలకు నిధులు కల్పించే అదనపు బడ్జెట్ అభ్యర్థనను అమెరికా ప్రభుత్వం త్వరలోనే కాంగ్రెస్‌కు సమర్పించనుంది. ఇరాన్ యుద్ధానికి సంబంధించిన పూర్తి వ్యయ వివరాలను విడుదల చేయాలని అమెరికా చట్టసభ సభ్యులు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తు న్నారు. ఫిబ్రవరి 28న ప్రారంభమైన ఈ యుద్ధం ఇప్పటివరకు అమెరికాకు దాదాపు 25 బిలియన్ డాలర్ల వ్యయం కలిగించినట్లు పెంటగాన్ ఏప్రిల్‌లో ప్రకటించింది. ఆయుధ సామగ్రి, సైనిక పరికరాల నిర్వహణపైనే ఎక్కువ ఖర్చు జరిగినట్లు తెలిపింది. పెంటగాన్ బడ్జెట్ విభాగం ఉన్నతాధికారి జూల్స్ హర్స్ట్ కాంగ్రెస్‌కు ఇచ్చిన తాజా నివేదికలో ఇరాన్ యుద్ధ వ్యయం సుమారు 29 బిలియన్ డాలర్లకు చేరిందన్నారు. ఇందులో సామగ్రి మరమ్మ తులు, భర్తీ, ఆపరేషనల్ ఖర్చులు ఉన్నాయి. ఐక్యరాజ్యసమితి మానవతా సహాయ సంస్థ ఆందోళన వ్యక్తం చేస్తూ యుద్ధానికి ఖర్చు చేస్తున్న నిధులను మానవతా సహాయానికి కేటాయించి ఉంటే 8.7 కోట్ల మందికి ప్రాణరక్షణ అందించవచ్చని తెలిపింది. ఐరాస మానవతా విభాగం అధిపతి టామ్ ఫ్లెచర్ మాట్లాడుతూ, ఈ యుద్ధానికి ప్రతిరోజూ 2బిలియన్ డాలర్లు ఖర్చవుతున్నాయి. 8.7 కోట్ల మందిని కాపాడేం దుకు మేము రూపొందించిన అత్యవసర ప్రణాళిక మొత్తం వ్యయం 23 బిలియన్ డాలర్లు మాత్రమే. ఈ యుద్ధానికి రెండు వారాల లోపే ఖర్చు చేసిన డబ్బుతో ఆ ప్రణాళికను అమలు చేయవచ్చని వ్యాఖ్యానించారు.

ట్రంప్ ప్రభుత్వం వెల్లడించిన దానికంటే యుద్ధ వ్యయం మరింత ఎక్కువగా ఉండొచ్చని కొందరు డెమొక్రటిక్ పార్టీ నేతలు ఆరోపిస్తున్నారు. ప్రారంభంలో అదనపు నిధుల కోసం చేసిన 200 బిలియన్ డాలర్ల అభ్యర్థన కాంగ్రెస్‌లో తీవ్ర విమర్శలకు గురైంది. ఏప్రిల్‌లో జరిగిన ప్రతినిధుల సభ బడ్జెట్ కమిటీ సమావేశంలో వైట్ హౌస్ బడ్జెట్ డైరెక్టర్ రస్సెల్ వౌట్ యుద్ధం మొత్తం ఖర్చుపై తన వద్ద అంచనా లేదన్నారు. రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ 2027 ఆర్థిక సంవత్సరానికి ట్రంప్ ప్రతిపాదించిన 1.5 ట్రిలియన్ డాలర్ల రక్షణ బడ్జెట్‌కు ఆయన మద్దతు తెలిపారు. కొందరు డెమొక్రటిక్ నేతలు ఇరాన్ యుద్ధం వల్ల అమెరికాపై మొత్తం ఆర్థిక భారం 630 బిలియన్ డాలర్ల నుంచి 1 ట్రిలియన్ డాలర్ల వరకు ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. అమెరికా మధ్యంతర ఎన్నికలకు మరో ఐదు నెలల సమయం మాత్రమే మిగిలి ఉండగా, కాంగ్రెస్‌లో మెజారిటీని నిలుపుకోవడం ట్రంప్ నేతృత్వం లోని రిపబ్లికన్ పార్టీకి సవాలుగా మారుతోంది. పెరుగుతున్న జీవన వ్యయాలు, అధిక ఇంధన ధరలు, ఇరాన్ యుద్ధం వల్ల ఏర్పడుతున్న ఆర్థిక ఒత్తిడి కారణంగా ఓటర్లలో అసంతృప్తి పెరుగుతుండటంతో డెమొక్రాట్లకు మద్దతు పెరుగుతున్నట్లు రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు.

# న్యాయరంగంలో కృత్రిమమేధ విజయం..

లండన్,జూన్ 23: న్యాయరంగంలో కృత్రిమ మేధ కొత్త చరిత్ర సృష్టించింది. బ్రిటన్‌కు చెందిన గార్‌ఫీల్డ్ ఏఐ అనే ఏఐ ఆధారిత న్యాయసంస్థ నిజమైన న్యాయవాదులతో పోటీ పడి కోర్టు కేసులో విజయం సాధించింది. ప్రపంచంలో ఏఐ సాయంతో నడిచే సంస్థ నేరుగా గెలిచిన తొలి కేసుగా దీనిని భావిస్తున్నారు. ఫ్రీలాన్స్ హెచ్ ఆర్ ప్రొఫెషనల్ టామిరెస్ కమల్ టాక్విడిర్‌కు ఒక హాస్పిటాలిటీ సంస్థ చెల్లించాల్సిన ఫీజులు ఎగ్గొట్టింది. దీంతో గార్‌ఫీల్డ్ ఏఐ సేవలను ఆమె ఆశ్రయించింది. కేవలం 400 పౌండ్లు (సుమారు రూ.50 వేల) చెల్లించి ఈ సేవలు పొందింది. ఏఐ సాయంతో ఈ కేసుకు సంబంధించిన పత్రాలు, సాక్షుల వాంగ్మూలాలు, ఇతర న్యాయపరమైన డాక్యుమెంట్లన్నీ గార్‌ఫీల్డ్ ఏఐ సంస్థ సిద్ధం చేసింది. విచారణ వేళ ఒక మానవ న్యాయవాదిని కోర్టులో వాదనలు వినిపించేందుకు నియమించింది. లండన్‌లోని వాండ్స్‌వర్త్ కౌంటీ కోర్టులో దాదాపు మూడు గంటలపాటు విచారణ జరిగింది. ఇరు పక్షాల తరఫున న్యాయవాదులు వాదనలు వినిపించారు. చివరికి కోర్టు టాక్విడిర్‌కు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. ఆమెకు 7,000 పౌండ్లు అంటే సుమారు రూ.8.8 లక్షలు చెల్లించాలని ఆదేశించింది. ప్రత్యర్థి సంస్థ దాఖలు చేసిన కౌంటర్ క్లెయిమ్‌ను కూడా కోర్టు కొట్టివేసింది. గార్‌ఫీల్డ్ ఏఐ సహ వ్యవస్థాపకుడు ఫిలిప్ యంగ్ దీన్ని న్యాయరంగంలో గొప్ప మైలురాయిగా అభివర్ణించారు. ఏఐ సాయంతో న్యాయసేవలు మరింత తక్కువ ఖర్చుతో ప్రజలకు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నాడు. ప్రస్తుతం గార్‌ఫీల్డ్ ఏఐ 10 వేల పౌండ్ల సుమారు రూ.12.5 లక్షలు వరకు ఉన్న చిన్న క్లెయిమ్ కేసులను స్వీకరిస్తోంది.




# ఉక్రెయిన్‌తో శాంతి చర్చలకు సిద్ధం: పుతిన్

**మాస్కో, జూన్ 23:** రష్యా అధ్యక్షుడు పుతిన్ నోట నుంచి శాంతి ఉచ్ఛరణ వచ్చింది. ఉక్రెయిన్‌తో శాంతి చర్చలకు సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు. దాడుల ద్వారా రష్యా ఇంధన రంగాన్ని దెబ్బతీసేందుకు ఉక్రెయిన్ ప్రయత్నిస్తోందని పుతిన్ ఆరోపించారు. ఉక్రెయిన్ దాడుల ప్రభావాన్ని తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని రక్షణ శాఖకు ఆదే శించారు. ఇటీవల ఫ్రాన్స్ వేదికగా జీ 7 సదస్సు జరిగింది. ఈ సమావేశంలో ఉక్రెయిన్‌కు మద్దతుగా ఉండాలని దేశాలు తీర్మానం చేశాయి. రక్షణ విషయంలో అండగా ఉండాలని నిర్ణయం తీసుకున్నాయి. ఈ నిర్ణయం తర్వాత రష్యాపై ఉక్రెయిన్ దాడులు ఉధృతం చేసింది. ఇంధన రంగాలే లక్ష్యంగా ఉక్రెయిన్ దాడులు చేస్తోంది. ఈ నేపథ్యంలో పుతిన్ ఉక్రెయిన్‌తో శాంతి చర్చలు జరపాలని నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఉక్రెయిన్ రష్యా యుద్ధం నాలుగేళ్లకు పైగా సాగుతోంది. ఈ యుద్ధం తర్వాత మొదలైన అన్ని యుద్ధాలు ముగిసిపోయాయి గానీ ఉక్రెయిన్‌రష్యా యుద్ధం మాత్రం ముగియలేదు. ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చాక శాంతి ఒప్పందం చేసేందుకు ప్రయత్నించినా ఫలించలేదు. రెండు దేశాలు నిత్యం బాంబులు వేసుకుంటూనే ఉన్నాయి.

# రెండోదశ మెట్రో పట్టాలెక్కాలంటే కెసిఆర్ రావాల్సిందే: కెటిఆర్



సమావేశానికి హాజరైన నాయకులతో కెటిఆర్

**శేరిలింగంపల్లి, జూన్23 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారంలోనికి రాగానే ఎయిర్‌పోర్ట్,మెట్రోరద్దుచేసి తుగ్లక్ నిర్ణయాలు తీసుకున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైరయ్యారు. శేరిలింగంపల్లి నియోజక వర్గంలోని మియాపూర్ నరెన్ గార్డెన్‌లో బీఆర్ఎస్‌పార్టీ ఆధ్వర్యంలో ఎస్ఐఆర్‌పై ముఖ్యకార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి హాజరైన కేటీఆర్ మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్‌పార్టీ అనాలోచిత నిర్ణయాలతో పాలన పక్కదోవపడుతుందన్నారు. మెట్రో దగ్గర 280 ఎకరాల భూములున్నాయి, సుమారు 30వేల కోట్ల విలువచేసే భూములను ఆయన అన్నదమ్ములకో, బావమరుదులకో, అల్లుడికో కట్టబెట్టేందుకు వాటిపై కన్నేశాడన్నారు. మెట్రోను స్వాధీ నం చేసుకుని 14వేల కోట్ల భారం ప్రజలమీద రుద్ది ఆ భూములను అమ్ముకుని తనకు కావాల్సిన వాళ్లకు కట్టబెట్టే ప్రయత్నంలో రేవం త్‌రెడ్డి ఉన్నాడని మండిపడ్డారు. రాబోయే రోజుల్లో భూములు ఎవరికి అమ్ముతాడో, ఎవరు కొంటారో, ఎట్లా అమ్ముతాడో చూస్తా మన్నారు. కేసీఆర్ ప్రభుత్వం బ్రహ్మాండంగా 72 కిలోమీటర్ల మేరకు మెట్రో నిర్మించిందని, మెట్రోకు మొత్తం టెండర్ ప్రక్రియ పూర్తి చేసిందన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం రాయదుర్గం నుంచి ఎయిర్‌పోర్ట్ వరకు మధ్యలో రాజేంద్ర నగర్ దగ్గర 3 స్టాపులు పెట్టి పెరుగుతున్న పట్టణాన్ని దృష్టిలో పెట్టుకుని ట్రాఫిక్ సమస్య ఉండొద్దని 2023 జూన్,జులై ప్రాంతంలో టెండర్ పూర్తచేసి మొత్తం మెట్రో రెడీగా కొబ్బరికాయ కొట్టి మొదలుపెట్టి నామని, సీయం రేవంతరెడ్డి రాగానే తీసుకున్న తుగ్లక్ నిర్ణయం ఎయిర్‌పోర్ట్,మెట్రో రద్దుచేశారని కేటీఆర్ ఫైరయ్యారు. కాంగ్రెస్ అధికారంలోనికి వచ్చి రెండున్నర ఏళ్లు గడుస్తున్నా ఇప్పుడు కిషన్‌రెడ్డి, రేవంత్‌రెడ్డి ఢిల్లీలో కొత్త డ్రామా మొదలుపెట్టారని ఆయన ఎద్దేవ చేశారు. మళ్లీ మెట్రో పట్టాలు ఎక్కాలంటే కేసీఆర రావాల్సిందేనన్నారు. ఎస్ఐఆర్ ప్రోగ్రాంను ప్రతి బీఆర్ఎస్ కార్యకర్త విజయవంతం చేయాలని, దొంగ ఓట్లను నిరోధించే ప్రక్రియలో బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు భాగస్వామ్యం వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రమాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి, కూకట్‌పల్లి ఎమ్మెల్యే, శేరిలింగంపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ ఇంచార్జి మాదవరం కృష్ణారావు, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేక్, లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు,శేరిలింగంపల్లి నియోజక వర్గ నాయకులు, డివిజన్ నాయకులు, మాజీ కార్పొరేటర్లు, స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# దేశసమైక్యత కోసం ప్రాణాలర్పించిన మహనీయుడు: మధుకర్‌జీ

**విజయవాడ, జూన్ 23,ప్రభాతవార్తప్రతినిధి:** భారతీయ జనతా పార్టీ వ్యవస్థాపక సిద్ధాంతకర్త, భారతీయ జనసంఘ్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ బలిదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర సం ఘటనా ప్రధాన కార్యదర్శి మధుకర్ జీ ముఖ్య ప్రసంగం చేశారు. దేశ సమైక్యత, అఖండత కోసం డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ చేసిన త్యాగం భారత రాజకీయ చరిత్రలో చిరస్మరణీయమని అన్నారు. కాశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని వ్యతిరేకిస్తూ "ఒకే దేశంలో ఇద్దరు ప్రధానమంత్రులు, రెండు రాజ్యాంగాలు, రెండు జెండాలు ఉండకూడదు" అనే నినాదంతో పోరాడిన మహనీయుడని కొనియాడారు. కాశ్మీర్‌లో సంపూర్ణ విలీనానికి ఆయన కలలు కన్నారని, కేంద్రంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయ కత్వంలో ఆర్టికల్ 370 రద్దుతో ఆయన ఆశయాలు సాకారమ య్యాయని తెలిపారు.



శ్యామప్రసాద్ ముఖర్జీ చిత్రం పటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎపి బిజెపి నేతలు

దేశభక్తి, సేవాభావం, జాతీయ సమైక్యత పట్ల అంకితభావంతో ప్రతి కార్యకర్త పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎన్టీఆర్‌జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడ్డూరి శ్రీరాం, టిటిడి పాలకమండలి సభ్యులు భాను ప్రకాష్ రెడ్డి, బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు పనతల సురేష్, బీజేపీ రాష్ట్ర మీడియా ఇన్‌చార్జి కిలారు దిలీప్, మైనారిటీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ బాషా, రాష్ట్ర అధికార ప్రతి నిధులు షేక్ బాజీ, యామిని శర్మ, రవిచంద్ర రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి బొడ్డు నాగలక్ష్మి, ఓబీసీ మోర్చా నాయకురాలు శివలలిత పాల్గొన్నారు.

# గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణంలో చొరవ చూపండి

## కేంద్ర మంత్రి రామ్మోహాన్‌కు తుమ్మల విజ్ఞప్తి



మంగళవారం న్యూఢిల్లీలో కేంద్రమంత్రి రామ్మోహాన్ నాయుడును కలిసిన మంత్రులు తుమ్మల, ఉత్తమ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూన్23:** కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడిని తెలంగాణ మంత్రులు తుమ్మల నాగేశ్వరావు, ఉత్తమ్‌కుమార్ రెడ్డి కలిశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణం చేపట్టాలని కేంద్రమంత్రికి మంత్రి తుమ్మల విజ్ఞప్తి చేశారు. గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ స్థాపనపై చొరవ తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం తరఫున విజ్ఞప్తి చేశారు. గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదన చేసిన వెంటనే స్పందించి.. ఎయిర్‌పోర్ట్ నిర్మాణం కోసం సివిల్ ఏవియేషన్ తరఫున ఫీజిబులిటీ సర్వే చేసినందుకు రామ్మోహన్ నాయుడికి మంత్రి తుమ్మల కృతజ్ఞతలు తెలిపారు. అయితే, ఫీజిబులిటీ సర్వేలో ప్రతిపాదిత స్థలం ఎయిర్‌పోర్ట్ నిర్మాణం కోసం అనువుగా లేనందున మరో స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రతిపాదన చేసినట్లు చెప్పారు. అక్కడ త్వరగా ఫీజిబులిటీ సర్వే చేసి, గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణంలో చొరవ తీసుకోవాలని కేంద్ర మంత్రికి తుమ్మల విజ్ఞప్తి చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో దక్షిణ అయోధ్యగా ప్రసిద్ధి చెందిన భద్రాచలం రామాలయం దేశ వ్యాప్తం గానే కాదు ప్రపంచ వ్యాప్తంగా ఎంతో ప్రసిద్ధి చెందిందని ఈ సందర్భంగా కేంద్ర మంత్రికి మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు.

**దిగుమతి సుంకం పెంచి పామాయిల్ రైతులను ప్రోత్సహించాలి: తుమ్మల:** రాష్ట్రంలో ఆయిల్ పామ్ విస్తరణకు కేంద్రం కృషిచేయాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. దిగుమతులపై సుంకం తగ్గించడం వల్ల ఆయిల్ పామ్ రైతులకు నష్టం అని అన్నారు. ఈ సందర్భంగా ఢిల్లీలో ఆయన మీడి యాతో మాట్లాడుతూ కొత్తగూడెం విమానాశ్ర యం విషయమై కేంద్రమంత్రి రామ్మోహాన్ ను కలిశామని, 10 -15 రోజుల్లో ఫీజిబిలిటీని కమి టీని పంపి పరిశీలిస్తామని రామ్మోహాన్ చెప్పారని తెలియజేశారు. దిగుమతి చేసుకుంటున్న ఎడిబుల్ ఆయిల్‌లో కొంత వెసులుబాటు ఇవ్వాలని, దిగుమతి సుంకం పెంచి పామాయిల్ రైతులను ప్రోత్సహించాలని తుమ్మల సూచించారు. రాబోయే 2-3 ఏళ్లలో 10 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగుకు చర్యలు చేపట్టామని, ఆయిల్ దిగుమతుల భారాన్ని తగ్గిస్తామని చెప్పామని అన్నారు. గతంలోనే మాదిరిగా ఆయిల్ దిగుమతుల సుంకం 44 శాతం ఉంచాలని, రాష్ట్రానికి కేటాయించిన యూరియా, డిఏపి తెలంగాణకు రాలేదని అన్నారు. సేకరించిన జొన్న, మొక్కజొన్నలను కేంద్రం కొనుగోలు చేయాలని తుమ్మల నాగేశ్వరరావు కోరారు.

# ఒకే కుటుంబంలో ముగ్గురు దారుణ హత్య

**బెంగళూరు, జూన్ 23:** నగరంలోని ఒక అపార్ట్‌మెంట్‌లో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వ్యక్తులు దారుణ హత్యకు గురయ్యారు. ఆ కుటుంబంలోని వ్యక్తే ఈ హత్యలు చేసి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. స్థానికంగా సంచలనం సృష్టించిన ఈ ఘటన కేఆర్ పురం పోలీస్ స్టేషన్ పరిధిలో సీగేహళ్లి, ధమానిక్ లేఅవుట్‌లోని సాయి గ్రీన్ అపార్ట్‌మెంట్‌లో జరిగింది. ఆ అపార్ట్‌మెంట్‌లో సోమసుందర్ (55), అతని భార్య ముత్తులక్ష్మి (48), పెద్ద కుమార్తె శ్వేతతో పాటు చిన్న కుమార్తె సుప్రియ (20) నివసిస్తున్నారు. ఆ దంపతులతోపాటు చిన్ని కుమార్తె సుప్రియ దారుణ హత్యకు గురయ్యారు. ఈ హత్యలపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో పలు కీలక విషయాలు వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది. సోమసుందర్ దంపతుల పెద్ద కుమార్తె శ్వేతతోపాటు ఆమె ప్రియుడు కెన్నెత్ ఈ హత్యలు చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. కొన్నాళ్లుగా కెన్నెత్‌తో శ్వేత సహజీవనం చేస్తోంది. ఈ విషయం తల్లిదండ్రులకు తెలిసింది. దీనిని వారు తీవ్రంగా వ్యతిరేకించారు. శ్వేత భారీగా అప్పులు చేసింది. దాంతో శ్వేతపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో వారి మధ్య తరచూ ఘర్షణలు చోటు చేసుకునేవని పోలీసులు దర్యాప్తులో వెల్లడి అయింది. ఈ కారణాంగానే వారిని వీరిద్దరు హత్య చేసి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. శ్వేత, కెన్నెత్ ఇంటికి వచ్చారు. ఆ సమయంలో ముత్తులక్ష్మి ఒక్కరే ఇంట్లో ఉన్నారు. దీంతో వారి మధ్య వాగ్వివాదం జరిగింది. దాంతో కత్తితో ఆమెను హత్య చేశారు. అనంతరం నేలపై పడిన రక్తాన్ని వీరిద్దరు శుభ్రం చేశారు. ఆ తర్వాత తండ్రి సోమసుందర్‌తోపాటు సుప్రియ ఇంటికి వచ్చారు. వారిపై దాడి చేసి కత్తితో చంపేశారని పోలీసులు భావిస్తున్నారు. వారిని అరెస్ట్ చేస్తే అసలు విషయాలు వెలుగులోకి వస్తాయని కేఆర్ పురం పోలీసులు చెబుతున్నారు. అయితే ఈ హత్యలు పక్కా ప్లాన్ ప్రకారమే చేశారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ప్రస్తుతం శ్వేతతోపాటు కెన్నెత్ పరారీలో ఉన్నారు. వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. ఈ మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం ఈస్ట్ పాయింట్ ఆసుపత్రికి పోలీసులు తరలించారు.

# రెండుచోట్ల ఎన్యూమరేషన్ పత్రాలు నింపితే నోటీసులు

## ఒకే వ్యక్తికి వేర్వేరు రాష్ట్రాల్లో ఓట్లు ఉంటే ఎస్ఐఆర్ ముగిశాక చర్యలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూన్23:** ఈనెల 25 నుంచి తెలంగాణలో సర్ ప్రక్రియ ప్రారంభం కానుంది. కాగా, ప్రత్యేక సమగ్ర సర్వే (ఎస్ఐఆర్)లో వేర్వేరు రాష్ట్రాల్లో 2 ఎన్యూమరేషన్ పత్రాలు నింపితే భవిష్యత్తులో ఆ ఓటర్లకు ఇబ్బందులు తప్పవని కేంద్ర ఎన్నికల సంఘం హెచ్చరిస్తోంది. భారత ప్రజాప్రాతినిధ్య చట్టం 31 ప్రకారం జైలు శిక్ష లేదా జరిమానా విధించే అవకాశాలు ఉంటాయని వెల్లడిస్తోంది. తెలంగాణలో ఏపీ, మహారాష్ట్ర, కర్ణాటక, ఉత్తరాదికి చెందిన ప్రజలు ఉద్యోగం, వ్యాపార నిమిత్తం వచ్చి ఇక్కడే స్థిరపడ్డప్పటికీ, సొంత ప్రాంతాలతో సంబంధాలు కొనసాగిస్తున్నారు. ఎంతో మందికి సొంత ప్రాంతాల్లో కూడా ఓటు హక్కు ఉంది. ఎస్ఐఆర్ ప్రక్రియ దశలవారీగా కొనసాగుతున్న నేపథ్యంలో ఈ ప్రక్రియ ముగిసిన రాష్ట్రాల్లోని వారు ఎన్యూమరేషన్ పత్రాలు అందించి అక్కడ ఓటు నమోదు చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఈ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైంది. తెలంగాణ రాష్ట్రంలో ఈనెల 25 నుంచి ప్రారంభమవుతుంది. మహారాష్ట్ర, కర్ణాటక, ఢిల్లీలో సర్వే 30వ తేదీ నుంచి మొదలవుతుంది. అయితే వేరే రాష్ట్రాల్లో ఎన్యూమరేషన్ పూర్తి చేసినవారు తెలంగాణ రాష్ట్రంలో, తెలంగాణలో పూర్తి చేసినవారు వేరే రాష్ట్రాల్లో ఎట్టిపరిస్థితుల్లో రెండోసారి నమోదు చేసుకోవద్దని కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు తెలిపారు. తెలంగాణలో ఒకే వ్యక్తికి 2 చోట్ల ఓట్లు ఉంటే డెమొగ్రఫీ సిమిలర్ ఎంట్రీస్ ద్వారా అధికారులు గుర్తిస్తున్నారు. కానీ తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల్లో ఓట్లు ఉంటే గుర్తించడానికి ప్రస్తుతానికి ప్రత్యేక సాఫ్ట్‌వేర్ లేదు. దీంతో ఈసీఐ వేరువేరు రాష్ట్రాల్లో ఓట్లు ఉంటే గుర్తించడానికి ఏఐ సాంకేతికతతో కేంద్రీకృత వ్యవస్థను తీసుకురావడానికి ప్రయత్నాలు చేస్తోంది. సర్వే ప్రక్రియ పూర్తైన తర్వాత కేంద్రం తీసుకొచ్చే ఈ సాంకేతికతతో 2 ఓట్లు ఉన్నవారిని గుర్తించి, ఈఆర్వోలు విచారణ చేశాక చర్యలు తీసుకుంటామని అధికారులు అంటున్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఓటర్లుగా నమోదైన ఎంతో మంది 2 రాష్ట్రాల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందుతున్నారు. వీటిని కొనసాగించడానికి, తమ ఆస్తుల రక్షణకు తెలుగు రాష్ట్రాల్లో ఎన్యూమరేషన్ పత్రాలను నింపాలని ఆలోచిస్తున్నారు.

# పొట్ట చుట్టూ కొవ్వు తగ్గాలంటే..



వ్యాయామం చేయకపోవడం, జీవనశైలిలో మార్పుల నేపథ్యంలో బరువుతో పాటు పొట్ట కూడా పెరుగుతుంది. అలాంటప్పుడు కొవ్వు పదార్థాలు తగ్గించడం మాత్రమే కాదు..కొన్ని పదార్థాలను రోజూ తీసుకోవాలి. వాటిలోని పోషకాలు పొట్ట చుట్టూ కొవ్వు పేరుకోకుండా చూస్తాయి.

**ఓట్స్ :** ఉదయం పూట నూనెతో చేసిన అల్పాహారాలకు బదులుగా ఓట్స్‌కి ప్రాధాన్య ఇవ్వాలి. తద్వారా జీవక్రియలరేటు వృద్ధి అవుతుంది. రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి.



తక్షణ శక్తి అంది ఎకునకవ సమయం ఆకలి వేయదు. దీనిలోని పీచు కూడా జీర్ణవ్యవస్థకు ఎంతో మేలు చేస్తుంది. ఓట్స్ తీసుకునేటప్పుడు అందులో చక్కెరకు బదులుగా ఏవైనా తాజా పండ్ల ముక్కలు, రసాలు కలిపితే సహజ చక్కెరలు అందుతాయి. పొట్ట వస్తుందనే భయం కూడా ఉండదు.



**పండ్లు :** ఆకలిగా అనిపించినప్పుడు ఏ మిఠాయిలో, ఇతర చిరుతిళ్లో తినే బదులు పండ్లు ఎంచుకోవడం మంచిది. వీటివల్ల చక్కెర, కొవ్వు శరీరంలో చేరతాయన్న బాధ ఉండదు. పోషకాలూ ఎక్కువగా అందుతాయి. బరువూ తగ్గుతారు.

**బాదం ..** మోనోశ్యాచురేటెడ్ ఫ్యాట్స్ శరీరంలో కొవ్వును కరిగించే శక్తిని పెంచుతాయని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. వీటివల్ల శరీరంలో నీరు ఊడా పేరుకోకుండా ఉంటుంది. ఆ పోషకాలు అందాలంటే బాదంతో పాటు ఇతర ఓట్స్ కూడా తినాలి.

**గుడ్లు :** మాంసకృతులు అధికంగా అందించే గుడ్డు పొట్ట చుట్టూ ఉండే కొవ్వుని కరిగించడంలో కీలకపాత్ర పోషిస్తుంది. ముఖనయంగా తెల్లసొన తీసుకోవడం వల్ల బి 12, డి విటమిన్లు, ఒమేగా-3 ఫ్యాటీ ఆమ్లాలు శరీరానికి అధికంగా అందుతాయి. ఇవి బరువు తగ్గడంలో కీలకపాత్ర పోసిస్తాయి.దీనివల్ల ఎముక సాంద్రత పెరుగుతుంది. గుండె పని తీరు కూడా మెరుగవుతుంది. □

# కేన్సర్ కుదేసినా .. కొత్త ఉత్సాహం



ఎవరికైనా కేన్సర్ సోకితే ఇక అవే అంతిమ ఘడియలు అనుకునే రోజుల్నించి 'కేన్సర్ నయ'మౌతుంది. అనే రోజులకు చేరుకున్నాము. రాచపుండు బ్రహ్మరాక్షసి అనే అభిప్రాయం ఏనాడో మన మస్కిష్కం నుండి మాయమైంది. కేన్సర్ నుంచి కోలుకున్న ఎందరిలోనో కొత్త ఉత్సాహం నింపిన సందర్భాలు ఉన్నాయి. ఎంతో మంది కేన్సర్ రోగులు ముఖ్యంగా మహిళలు కేన్సర్ సోకినా సుదీర్ఘ కాలం జీవిస్తున్న కథలెన్నో మనకి తారసపడుతుంటాయి. సర్జరీలు, ఖీమోథెరపీలు మనల్నేం చేయవు అనుకుంటేనే మరెంత కాలం జీవించగలం అనే నమ్మకంతో జీవించే స్తున్నారు. రోగుల్లో ఉదయించే 'స్వస్థ' భావన వారిని చాలా కాలం ప్రాణం పోస్తుంది. నఫీసా అల్లి (69) ప్రఖ్యాత నటి. హిందీ చిత్రసీమ లోనే కాకుండా ఇతర భారతీయ భాషల ప్రేక్షకుల్ని ఆకట్టుకుంది. 1972 నుంచి 1974 వరకు జాతీయ స్విమ్మింగ్ చాంపియన్ మిస్ ఇంటర్నేషనల్ పోటీలో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించింది. రెండో రన్నర్అప్‌గా నిలిచింది. 2018 నవంబరులో స్టేజి 3 పెరిటోనియల్ అండాశయ కేన్సర్ ఆమెను వేధించింది అయినా ఆమె నిరుత్సాహం పొందలేదు. ఆమె బహుళరంగాల్లో రాణించిన సామాజి సామాజిక కార్యకర్తగానూ చురుకుగా ఉండేవారు. 2022లో 'ఉంఛాయి' చిత్రం ఆమె ఆఖరి చిత్రం. అర్జున అవార్డు గెలుచుకున్న సోలో క్రీడాకారుడు కల్నల్ రవీందర్ సింగ్ సోధి భార్య. వివాహానంతర దశలన్నీ దాటి తన ముగ్గురు పిల్లల సేవలో నిమగ్నమైంది. 18 ఏళ్ల విరామం అనంతరం మళ్లీ నటనా వృత్తిలో ప్రవేశించింది. ఎయిడ్స్ అవగాహనా సదస్సుకు ప్రత్యేక యాంకర్‌గా పనిచేసింది. 2005 సెప్టెంబరులో చిల్డ్రన్స్ ఫిల్మ్ సొసైటీ ఆఫ్ ఇండియా



ఛైర్మన్‌గానూ బాధ్యతలు నిర్వహించారు. ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్‌లో చురుకైన నేతగా పనిచేసింది. ఏనాడూ ఏ కార్యక్రమంలో పాల్గొనకుండా ఇంట్లోనే కూర్చుండి పోవాలని, ఖాళీగా ఉండాలని అనుకోలేదు. ఉద్యమ అంశాలు చేపట్టినపు డల్లా ఎంతో నిబద్ధతతో పనిచేసేవారు. 2004లో దక్షిణ కల్‌కతా నియోజకవర్గం నుంచి లోక్‌సభకు తృణమూల్ కాంగ్రెస్ తరపున పోటీచేసి ఓటమి పాలయ్యారు. హాలీవుడ్ నటి, మాజీ అందాల సుందరి, ఉద్యమ కారిణి, సామాజిక కార్యకర్త 69 ఏళ్ల నఫీసా ఆలీ కేన్సర్ నయమయ్యాక కొత్త ఉత్సాహాన్ని కూడగట్టుకుని మరికొందరు కేన్సర్ రోగులకు మార్గదర్శకంగా ఉంటు న్నారు. ఇంటిల్లి పాదీ తనతో గడిపిన ఎంతో ఉత్సాహాన్ని కల్గించే అనుభావాలను పంచు కుంటున్నారు. ఇటీవల 11 వేల అడుగుల ఎత్తులో నఫీసా ట్రెక్కింగ్ చేసిన అనుభవాలను వివరిస్తూ తనకెంతో ఉత్సాహం కలిగించిన పర్వతారోహణను మరింతగానో మెచ్చుకు న్నారు. కేన్సర్ శస్త్ర చికిత్స, అనేక సార్లు కీమోథెరపీ సెషన్ల తర్వాత తాను కొత్త అనుభవంతో కూడిన నూతనోత్సాహం తన మదిలో మెది లిందని అన్నారు. మొన్న ఏప్రిల్ నెలలో తన పొట్టపై శస్త్రచికిత్స తాలూకు మచ్చను చూపే ఫోటోను అభిమానులతో పంచుకున్నారు. తాజాగా తన కుటుంబ సభ్యులతో టెక్కింగ్, పిక్నిక్ అనుభవాలతో కూడిన ఫొటోలను విడిచిపెట్టారు. తాజాగా రోహ్తాంగ్ పాస్ సమీపంలో 11 వేల అడుగుల ఎత్తులో ట్రెక్కింగ్ చేస్తేన్న అనేక వీడియా లను, ఫొటోలను పంచుకు న్నారు. తీరని వ్యధలున్నా, జీవితాన్ని భయపెట్టి అధఃపాతాళానికి పడి పోయినట్లుగా చేసే కేన్సర్ వంటి భయంకర రుగ్మత నుండి కోలు కొన్నాక కృంగిపోకుండా, కుదేలయి పోకుండా తాను కొత్త ఉత్సాహాన్ని పొందుతూ ఇతరుల్లో నూతనోత్సాహాన్ని అందివ్వగలుగుతున్న అందాల తార నఫీసాను స్ఫూర్తిగా తీసుకునే వారికెవరికైనా కేన్సర్ కొత్త జీవితాన్ని ప్రసాదిస్తుంది.

# గణేశుడు

విఘ్నాలను తొలగించి కార్యసిద్ధిని ప్రసాదించే దేవుడు.గణేశుడు మహిశ్రీ గణేశుని రూపం ఎంతో ప్రత్యేకమైనది. ఏనుగు తల, పెద్ద చెవులు, చిన్న కళ్ళు, పెద్ద పొట్టతో ఆయన దర్శనమిస్తారు. ఈ రూపంలోని ప్రతి అంశం ఒక గొప్ప సందేశాన్ని తెలియజేస్తుంది. పెద్ద చెవులు ఎక్కువగా వినాలని, చిన్న కళ్ళు ఏకాగ్రతతో చూడాలని, పెద్ద పొట్ట సుఖదుఃఖాలను సమానంగా స్వీకరించాలని సూచిస్తాయి.జ్ఞానానికి ప్రతీగణపతి జ్ఞానానికి, వివేకానికి ప్రతీక. విద్యార్థులు విద్యాభివృద్ధి కోసం, కళాకారులు తమ కళల్లో విజయాల కోసం, ఉద్యోగులు మరియు వ్యాపారులు తమ కార్యాలలో పురోగతి కోసం గణేశుని ఆశీర్వాదాలను కోరుతారు. ఆయన అనుగ్రహం ఉంటే విజయం సులభంగా లభిస్తుం దని భక్తుల విశ్వాసం.గణేశుని అవతార పురాణాల ప్రకారం, పార్వతీదేవి తన శరీరానికి పూసుకున్న పసుపుతో ఒక బాలుడిని సృష్టించి ద్వారపాలకునిగా నియ మించింది. ఆ బాలుడే గణేశుడు. ఒకసారి పరమశివుడు లోపలికి వెళ్లడానికి ప్రయత్నిం చగా గణేశుడు అడ్డుకున్నాడు. కోపంతో శివుడు అతని తలను ఖండించాడు. తరువాత పార్వతీదేవి దుఃఖాన్ని చూసి, శివుడు ఏనుగు తలను అమర్చి గణేశునికి ప్రాణం పోశాడు. అప్పటి నుంచి గణేశుడు దేవతలందరిలో అగ్రపూజను పొందే దేవుడిగా ప్రసిద్ధి చెందాడు. వినాయక చవితివినాయక చవితి గణేశునికి అంకితమైన పవిత్ర పండుగ. ఈ రోజున భక్తులు మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి, ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఉండ్రాళ్లు, మోదకాలు వంటి నైవేద్యాలను సమర్పించి భక్తిశ్రద్ధలతో ప్రార్థిస్తారు. ఈ పండుగ భక్తి, ఐక్యత ఆనందానికి ప్రతీకగా నిలుస్తుంది. శ్రీ గణేశుడు మనకు జ్ఞానం, వినయం, సహనం మరియు ధైర్యం అనే విలువలను బోధిస్తాడు. జీవితంలో ఎదురయ్యే అడ్డంకులను విశ్వాసంతో, పట్టు దలతో అధిగమించాలని ఆయన సందేశం. విఘ్నాలను తొలగించి విజయాన్ని ప్రసాదించే దైవంశ్రీ గణేశుడు. ఆయనను భక్తిశ్రద్ధలతో ఆరాధిస్తే జ్ఞానం, ఐశ్వర్యం, శాంతి మరియు సుఖసంతోషాలు లభిస్తాయని విశ్వాసం. □

# క్రిస్పీ పనీర్ ఫింగర్స్



**కావలసినవి** : పనీర్-200 గ్రాములు, మైదాపిండి-రెండు టేబుల్ స్పూన్లు, మొక్కజొన్న పిండి-టేబుల్ స్పూన్ ఉప్పు-తగినంత, పసుపు-చిటికెడు, కారం, మిరియాల పొడి, గరం మసాలా, అల్లం వెల్లుల్లి ముద్ద-అర చెంచా చొప్పున, మిక్స్‌డ్ హెర్బ్స్-పావుచెంచా, బ్రెడ్ పొడి-పావు కప్పు, నూనె-వేయించడానికి సరిపడా.

**తయారీ :** పనీర్‌ను పొడుగ్గా ముక్కలు కోసుకోవాలి. వాటి మీద కారం, ఉప్పు, మిరియాల పొడి, గరం మసాలా, పసుపు, అల్లం వెల్లుల్లి ముద్ద, మిక్స్‌డ్ హెర్బ్స్ వేసి.. ముక్కలు తునగకుండా కలియ తిప్పా.లి ఇలా పొడులన్నీ పట్టించిన తర్వాత ఒక పావు గంట పక్కనుంచాలి. మరో పాత్రలో మైదాపిండి, మొక్కజొన్న పిండి, తగినంత ఉప్పు, మిరియాల పొడి వేసి, కొన్ని నీళ్లతో ఉండలు కట్టకుండా చిక్కగా కలపాలి. మసాలా పట్టించిన పనీర్ ముక్కలను మొదట ఈ మిశ్రమంలో, తర్వాత బ్రెడ్ పొడిలో ముంచి తీసి, కాగుతున్న నూనెలో వేయించాలి. అంతేబంగారురంగులో కరకరలాడే పనీర్ ఫింగర్స్ సిద్ధం. □

# పాలు తాగుతుంటే తేన్పులా..



పిల్లలు మొదటి ఆరు నెలలు తల్లి పాల మీదే ఆధార పడతారు. కొన్ని సందర్భాల్లో తల్లికి పాలు ఎక్కువగా ఉత్పత్తవుతాయి. ఇలాంటప్పుడు పిల్లలు కూడా గబాగబా పాలు తాగుతుంటారు. కొన్ని సందర్భాల్లో తల్లి ఆహారంలో లోపం ఉన్నట్లయితే పాలు తక్కువగా వస్తుంటాయి. ఇలాంటప్పుడు పాలు సరిపోకనఖాళీ రొమ్మునే సక్ చేస్తుంటారు. ఈ క్రమంలో ఎక్కువ గాలి పొట్టలోకి చేరుతుంది. మరికొన్ని సందర్భాల్లో పాపాయిని బుజ్జగించడానికి తేనె పీకను ఉపయోగిస్తుంటారు. ఈ పీక పెట్టినప్పుడు కూడా గాలిని మింగుతుంటారు. పాపల విషయంలో ఇలాంటి పరిస్థితులు ఉన్నాయోమే పరిశీలించుకోవాలి. ఇలా పొట్టలో గ్యాస్ ఎక్కువైనప్పుడు తేన్పుల ద్వారా గాలి బయటకు వెళుతుంది. దీనివల్ల బేబీకి కాస్త ఉపశమనం కలుగుతుంది. అయితే ఇలాంటి సమస్య ఉన్నప్పుడు పాపలను ఒక పక్కకు తిప్పి పడుకోబెట్టడం లేదా భుజం మీద వేసుకొని బర్పింగ్ చేయడం.. వంటి పద్ధతులు పాటించాలి. ఫలితంగా గాలి బయటికి వెళ్లిపోతుంది. అప్పటి సమస్య తగ్గుముఖం పట్టకపోతే తల్లి తీసుకునే ఆహారంలో మార్పులు చేసు కోవాల్సి ఉంటుంది. ముఖ్యంగా స్పైసీ ఫుడ్‌కి దూరంగా ఉండడం. బాగా ఉడికించిన ఆహారాన్ని ఎక్కువగా తీసుకోవడం వంటివి చేయాలి. □

తెర

# 'ఇరుముడి' స్పెషల్ పోస్టర్ రిలీజ్



మాస్ మహారాజా రవితేజ, ప్రముఖ పాన్ ఇండియా నిర్మాణ సంస్థ 'మైత్రీ మూవీ మేకర్స్' నిర్మిస్తున్న 'ఇరుముడి' చిత్రం కోసం దర్శకుడు శివ నిర్వాణ జతకట్టారు. ఈ చిత్రానికి సంబంధించిన 'ది హార్ట్ ఆఫ్ ఇరుముడి' గ్లింప్స్‌కు వచ్చిన అద్భుతమైన స్పందనతో సినిమాపై ఇప్పటికే భారీ అంచనా లు నెలకొన్నాయి. భక్తి, కుటుంబ భావోద్వేగా లు, యాక్షన్ అంశాల సమ్మేళనంగా తెరకెక్కు తున్న ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉండబోతోంది. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్‌కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. మాస్ మహారాజా రవితేజ, తన కూతురు నుదుటిపై ప్రేమగా ముద్దుపెడుతూ కనిపించడం ఆకట్టుకుంటోంది. ఎనర్జిటిక్ కమర్షియల్ ఎంటర్‌టైనర్స్‌తో ప్రేక్షకులను అలరించిన రవితేజ 'ఇరుముడి'లో పూర్తిగా భిన్నమైన, భావోద్వేగాలకు ప్రాధాన్యం ఉన్న పాత్రలో కనిపించ నున్నారు. మధ్యతరగతి కుటుంబానికి చెందిన వ్యక్తిగా ఆయన నటన ప్రేక్షకులకు గొప్ప అనుభూతిని కలిగించనుంది. ఈ చిత్రంలో సాయికుమార్, అజయ్ ఘోష్, రమేష్ ఇందిర, స్వాసిక, బేబీ నక్షత్ర కీలక పాత్రలు పాత్రల్లో కనిపించనున్నారు. నిర్మాతలు నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ భారీ స్థాయిలో నిర్మిస్తున్న ఈ చిత్రానికి జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తు న్నారు. విష్ణు శర్మ సినిమాటోగ్రఫీ, సాహి సురేష్ ప్రొడక్షన్ డిజైన్, ప్రవీణ్ పూడి ఎడిటర్ శివ నిర్వాణ కథ, స్క్రీన్‌ప్లే, సంభాషణలు అందించగా, నరేష్ బాబు పి స్క్రిప్ట్ కోఆర్డినేటర్ గావ్యవహరిస్తున్నారు. వరలక్ష్మీ ్మ వ్రతం శుభ సందర్భంగా ఇరుముడి ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది

# చివరి శ్వాస వరకు పని చేస్తూనే పోవాలి : అల్లాణి శ్రీధర్



అల్లాణి శ్రీధర్ తెలుగు సినిమా రచయిత, నిర్మాత, దర్శకుడు. 1988లో కొమరంభీమ్ చిత్రంతో దర్శకత్వ అరంగేట్రం చేశారు. ఉత్తమ జాతీయ సమైక్యత చిత్రంగా, ఉత్తమ దర్శకుడుగా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నుండి 1990లో నంది అవార్డు అందుకున్నారు ఈయన.ఆయన తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన గద్దర్ అవార్డ్స్ విది విధానాల కమిటీలో సభ్యునిగా పని చేశాడు. జూన్ 24.6. 2026 అల్లాణి శ్రీధర్ పుట్టినరోజు సందర్భంగా ఫిలిం క్రిటిక్స్ అసోసియేషన్ ఆయనకు ఫిలించాంబర్‌లో మీట్ ది ప్రెస్ కార్యక్రమం ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమానికి ఎగ్జిక్యూటివ్ మెంబర్ సీనియర్ జర్నలిస్ట్ ధీరజ్ అప్పాజీ వ్యాఖ్యతగా వ్యవహరించారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్ట్ బాలిరెడ్డి మాట్లాడుతూ... గోస్వామి తులసిదాస్ సినిమా అన్నది మనం మర్చిపోలేని సినిమా అని గుర్తు చేయడం జరిగింది. శ్రీధర్‌గారితో నాకు చాలా ఏళ్ళ అనుబంధం ఉంది. ఆయన మరిన్ని చిత్రాలు తీసి సక్సెస్ సాధించాలని కోరుకుంటు న్నాను అన్నారు. సీనియార్ జర్నలిస్ట్ లక్ష ్మణరావు మాట్లాడుతూ... శ్రీధర్‌గారితో అనుబంధం కొంత గ్యాప్ వచ్చినప్పటికీ.. ఆ రోజుల్లో ఆయన చేసిన సినిమాలు అభ్యుదయ భావాలకు ప్రతీకగా నిలిచాయి. శ్రీమతి జమునారాణి సీనియర్ జర్నలిస్ట్ మాట్లాడుతూ...ఈ వేదికపైన రెండు విషయాలు చెప్పుకోవాలంటే సంతోషంగా ఉంది. ఫిలిం క్రిటిక్స్ అధ్యక్షులు బత్తుల ప్రసాద్ మాట్లాడుతూ..ఈ మీట్ ది ప్రెస్ కార్యక్రమం ద్వారా ప్రతిభ ఉన్న ప్రతి ఒక్కరికీ చిరు సత్కారం చేయాలని అనుకుంటు న్నాము. అల్లాని శ్రీధర్ గురించి చెప్పాలంటే నా గరించి నేను చెప్పుకున్నట్లు ఉంటుంది. ఫిలిం క్రిటిక్స్ జనరల్ సెక్రటరి సురేష్‌కొండేటి మాటా ్డడుతూ... వార్తలో ఉన్నప్పుడు నేను 90లలో నేను శ్రీధర్‌గారిని ఇంటర్వ్యూ చేయడం జరిగింది. అంతేకాక ఆతరువాత సంతోషం సినీ వారపత్రికకు కూడా ఆయనను నేను పర్సనల్‌గా ఇంటర్వ్యూ చేశాను. అల్లాణి శ్రీధర్ మాట్లాడుతూ... నేను జన్మదినం అనేది గొప్పగా అనుకోవడం లేదు. ఈ రోజు ఈ వేదికపైన ఇంత మంది మిత్రలును కలుసుకోవడం నా జన్మ దినం కాదుగాని పునర్మనదినంగా అనుకుంటున్నాను అన్నారు.

# NBK112 అమరావతిలో 25న లాంచ్



NBK112 అమరావతిలో జూన్ 25న గ్రాండ్ లాంచ్ ముఖ్య అతిథులుగా మంత్రులు నారా లోకేష్, కందుల దుర్గేష్ గాడ్ అఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ, సంచలన దర్శకుడు కొరటాల శివ తొలిసారిగా NBK112 చిత్రం కోసం జతకడుతున్నారు. ఈ ప్రాజెక్ట్ ఇప్పటికే అభిమానులు, సినీ వర్గాల్లో భారీ అంచనాలు పెంచింది. Power Meets Purpose, Mass Becomes A Movement అనే పవర్ ఫుల్ ట్యాగ్‌లైన్‌తో వచ్చిన అనౌన్స్‌మెంట్ పోస్టర్, ఈ చిత్రం ఎంత భారీ స్థాయిలో ఉండబోతుందో సూచించింది. ఇద్దరు విజయవంతమైన నిర్మాతలు SLV సినిమాస్ సుధాకర్ చెరుకూరి, యువసుధ ఆర్ట్స్ సుధాకర్ మిక్కిలినేని ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌ను నిర్మిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్‌పై ఉన్న అంచనాలను మరింత పెంచుతూ, అమరావతి సమీపంలోని వెంకటాయపాలెంలో ఉన్న గిగిదీ ఆలయంలో జూన్ 25న గ్రాండ్ లాంచ్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్ మంత్రులు నారా లోకేష్, కందుల దుర్గేష్ ముఖ్య అతిథులుగా హాజ6రుకానుండటంతో ఈ కార్యక్రమం అత్యంత ప్రతిష్టాత్మకంగా జరగనుంది. బాలకృష్ణ భారీ స్థాయి స్క్రీన్ ఇమేజ్‌కు సరిపోయేలా కొరటాల శివ ఒక పవర్ ఫుల్ కథని సిద్ధం చేశారు. మాస్ సినిమాలు చేయడంలో ప్రసిద్ధి చెందిన ఇద్దరు దిగ్గజాలు తొలిసారిగా కలిసి పనిచేస్తుండటంతో ఈ చిత్రంపై అంచనాలు భారీగా పెరిగాయి.ఈ చిత్రానికి సంబంధించిన ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు మేకర్స్ త్వరలో ప్రకటించనున్నారు.

# 'వసుదేవసుతం'.. ట్రైలర్ లాంచ్

'వసుదేవసుతం'.. ట్రైలర్ లాంచ్ రెయిన్‌బో సినిమాస్ బ్యానర్ మీద ధనలక్ష్మి ్మ బాదర్ల నిర్మాణంలో వైకుంఠ్



బోను తెరకెక్కించిన చిత్రం 'వసుదేవసుతం'. ఈ సినిమాలో మాస్టర్ మహేంద్రన్, అంబికా వాణి జంటగా నటించారు. ఇప్పటి వరకు మూవీ నుంచి రిలీజ్ చేసిన పోస్టర్లు, గ్లింప్స్, టీజర్ అందరినీ ఆకట్టుకు న్నాయి. ఈ సినిమాని జూలై 10న రిలీజ్ చేయబోతోన్నారు. ఒరిస్సాలోని వాసుదేవుని ఆలయం చుట్టూ ఈ కథ తిరుగుతుంది. ఆలయంలోని బ్రహ్మ పదార్థం కోసం శత్రు మూకలు చేసే విన్యాసాన్ని అడ్డుకునే పాత్రలో హీరో మహేంద్రన్ అదరగొట్టేశారు. ట్రైలర్ ఒక్కసారిగా ప్రేక్షకుల్లో అంచనాల్ని పెంచేసింది. మాస్టర్ మహేంద్రన్ మాట్లాడుతూ.. 'వసుదేవసుతం' కోసం నిర్మాతలు చాలా కష్టపడ్డారు. కథను నమ్మి ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా ఖర్చు పెట్టారు. దర్శకుడు ఎన్నో కష్టాల్ని ఎదుర్కొని ఈ మూవీని పూర్తి చేశారు. దర్శకుడు వైకుంఠ్ బోను మాట్లాడుతూ.. .. నిర్మాతకి ముందు ఓ రెండు కథలు చెప్పాను. అవి బాగానే ఉన్నాయని అన్నారు. మళ్లీ ఒరిస్సాలోని ఫేమస్ టెంపుల్ బ్యాక్ డ్రాప్‌లో ఓ కథను రాసుకున్నాను.నిర్మాత త్రినాథ్ కేశవ మాట్లాడుతూ.. 'వసుదేవసుతం'. మాకు తొలి చిత్రం. మా సినిమాలో అందరూ అద్భుతంగా నటించారు. మాకు సపోర్ట్ చేసిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. మా మూవీ జూలై 10న రాబోతోంది. అంబికా వాణి మాట్లాడుతూ.. 'వసుదేవసుతం'.సినిమాకు పని చేయడం ఆనందంగా ఉంది. నాకు తెలుగు సరిగ్గా రాలేదు. నేను నేర్చుకుంటాను. నాకు ఇందులో అవకాశం ఇచ్చిన దర్శక, నిర్మాతలకు థాంక్స్. అజయ్ సాయి మాస్టర్ మాట్లాడుతూ.. ..'వసుదేవసుతం'. సినిమాలో రెండు పాటల్ని కొరియోగ్రఫీ చేశాను. చాలా గ్యాప్ తరువాత మళ్లీ మణిశర్మ గారి పాటకు పని చేశాను. ట్రైలర్ నాకు చాలా నచ్చింది. మాస్టర్ మహేంద్రన్ ఇందులో అద్భుతంగా నటించాడు.

# 'గాసిప్' 26న విడుదల



మోస్ట్ టాలెంటెడ్, ఎనర్జిటిక్ రాశి సింగ్ ప్రధాన పాత్రలో నటిస్తున్నా వైభవ్ సినీ స్కల్ప్ట్ స్టూడియోస్ బ్యానర్‌పై యతి నిర్మాతగా ప్రేక్షకుల ముందుకు రానున్న చిత్రం "గాసిప్". నేటి తరానికి కనెక్ట్ అయ్యే ఎమోషన్స్, అందమైన ప్రేమ కథతో మేళవిస్తూ సోషల్ సెటైర్‌గా డైరెక్టర్ వైభవ్ కౌండిన్య ద్వారా ఈ చిత్రం తెరకెక్కుతోంది. శక్తికాంత్ కార్తీక్ సంగీతాన్ని అందిస్తున్న ఈ చిత్రానికి సతీష్ సినిమాటోగ్రఫీ చేయగా జై కుమార్ ఎడిటింగ్ చేశారు. ఈ సంద ర్భంగా నటుడు మహేష్ యడ్లపల్లి మాట్లాడుతూ... ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన సాయికిరణ్ అడికి నా హృదయపూర్వక ధన్యవాదాలు. ప్రస్తుత సమాజంలో చూస్తున్న కొన్ని సంఘటనలకు దగ్గరగా ఉన్న ఒక విషయాన్ని సినిమాగా చేశాము. ప్రేక్షకులకు బాగా కనెక్ట్ అవుతుంది. నటుడు గురు చరణ్ మాట్లాడుతూ... "గాసిప్ చిత్రం కోసం నాకు వైభవ్ కాంటాక్ట్ చేశారు. నా క్యారెక్టర్ గురించి చెప్పిన తర్వాత ఆయన చేసిన ఆడిషన్ నాకు ఛాలెంజ్‌గా అనిపించింది. నిర్మాత యతి మాట్లాడుతూ... "ఈ కార్యక్రమానికి వచ్చిన అందరికీ థాంక్స్. ఈ సినిమా కోసం పని చేసిన ప్రతి ఒక్కరికీ పేరుపేరున థాంక్స్. అతిథిగా హాజరైన దర్శకుడు సాయి కిరణ్ అడివి మాట్లాడుతూ... "వైభవ్ నాకు ఎంతోకాలం నుండి పరిచయం ఉన్న వ్యక్తి, చాలా క్లారిటీ ఉన్న వ్యక్తి. చిత్ర దర్శకుడు వైభవ్ కౌండిన్య మాట్లాడుతూ... నా తొలి చిత్రం "గాసిప్"కు మీరు చూపిస్తున్న ఆదరణకు ధన్యవాదాలు. ఈ సినిమాకు నేను రచయితగా, దర్శకుడిగా పని చేశాను. మన జీవితాల్లో గాసిప్ అనేది సాధారణ విషయమే. కానీ మనం సరదాగా మాట్లాడే మాటలు కొన్నిసార్లు ఇతరుల జీవితాలపై తీవ్ర ప్రభావం చూపిస్తాయి. హీరోయిన్ రాశి సింగ్ మాట్లాడుతూ.... ముందుగా మా సినిమా ట్రైలర్, పాట విడుదల చేసి మాకు మద్దతుగా నిలిచిన సాయి కిరణ్, వంశీ, పృథ్వీరాజ్‌కి హృదయపూర్వక ధన్యవాదాలు.

# 'రాజా ది రాజా' జూలై 17న రిలీజ్



యూత్‌ఫుల్ ప్రమోషనల్ కంటెంట్‌తో ఇప్పటికే ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచిన'రాజా ది రాజా' చిత్రం మూవీ లవర్స్‌లో మంచి బజ్‌ను క్రియేట్ చేస్తోంది. రుత్విక్, విశాఖ ధీమన్ జంటగా నటిస్తున్న ఈ యూత్‌ఫుల్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌కు అనిల్ బోయిడపు దర్శకత్వం వహిస్తున్నారు. వృందావన్ క్రియేషన్స్ బ్యానర్‌పై కె. నిహారికా దాసరి ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, కె. శ్రీలతా రెడ్డి సమర్పిస్తు న్నారు. తాజాగా చిత్ర బృందం ఈ సినిమాను జూలై 17న విడుదల చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించింది. రిలీజ్ డేట్ పోస్టర్‌లో హీరో, హీరోయిన్‌ల మధ్య కెమిస్ట్రీతో పాటు వారి సరదా ప్రయాణాన్ని హైలైట్ చేశారు. కలర్ ఫుల్ విజువల్స్, ఆకట్టుకునే డిజైన్ చిత్రంలోని రొమాంటిక్ మూడ్‌ను ప్రజెంట్ చేస్తోంది. ఈ చిత్రానికి మార్క్ కె రాబిన్ సంగీతం అంది స్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ సింగిల్ చార్ట్‌బస్టర్‌గా నిలిచింది. ఈ చిత్రంలో సాయికుమార్, డాక్టర్ నరేష్ విజయకృష్ణ, అవసరాల శ్రీనివాస్, విష్ణు ఓయి, పార్వతీశం, రాజశ్రీ నాయర్, రోహిణి, బద్రం, మైమ్ మధు, ఆనంద్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ వంటి ప్రముఖ పంపిణీ సంస్థ ఈ చిత్రాన్ని విడుదల చేయడం ట్రేడ్ వర్గాల్లో సినిమాపై పెరుగుతున్న నమ్మకాన్ని సూచిస్తోంది. రాజా ది రాజా యూత్‌తో పాటు ఫ్యామిలీ ఆడియన్స్‌ను ఆకట్టుకునే రిఫ్రెషింగ్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకులని అలరించనుంది.

# మెస్సీ వెనుకే ఎంబాపె

## నాకౌట్‌కు ఫ్రాన్స్, నార్వే అర్హత * జోర్డాన్‌కు షాకిచ్చిన అల్జీరియా


రెండు గోల్స్‌తో ఫ్రాన్స్‌కు విజయాన్నందించిన ఎంబాపె


అల్జీరియాకు గోల్ చేస్తున్న నాథిర్ బెన్‌బొలి


గెలుపు సంబరాల్లో నార్వే ఆటగాళ్లు

**ఫెన్సిల్వేనియా(అమెరికా), జూన్ 23**
సాకర్ ప్రపంచకప్‌లో ఫ్రాన్స్ దూసుకుపోతోంది. వరుసగా రెండో విజయాన్ని అందుకుంది. గ్రూప్-ఐలో భాగంగా ఇరాక్‌తో జరిగిన మ్యాచ్‌లో ఫ్రాన్స్ 3-0 గోల్స్ తేడాతో గెలుపొందింది. వందో మ్యాచ్‌లో ఫ్రాన్స్ స్టార్ ఆటగాడు కైలియన్ ఎంబాపె డబుల్ గోల్స్‌తో మెరవగా, ఓస్మన్ డెంబ్లె మరోగోల్ చేశాడు. ఈవిజయంతో గ్రూప్-ఐ నుంచి నాకౌట్‌కు ఫ్రాన్స్ అర్హత సాధించింది. వర్షంఅడ్డంకితో రెండు గంటల ఆలస్యంగా మొదలైన ఈమ్యాచ్‌లో ఎంబాపె అద్భుత ఆటతీరుతో గోల్స్ వర్షం కురిపించాడు. ఆట 14వ నిమిషంలో కార్నర్ నుంచి బంతిని గోల్ పోస్టులోకి తరలించిన ఎంబాపె సాకర్ వరల్డ్ కప్‌లో 15 వ గోల్ సాధించాడు.

ఈ గోల్ ఆధిక్యంతోనే ఫ్రాన్స్ తొలి అర్ధభాగం ముగించింది. రెండో అర్ధభాగంలోనూ ఫ్రాన్స్ దూకుడుకు ఎదురులేకపోయింది. పలుసార్లు ఇరాక్ డిఫెండర్లను చమ్కాఇస్తూ గోల్స్ చేసినంత పనిచేసింది. ఇక 54వ నిమిషంలో మరోసారి మెరిసిన ఎంబాపె రెండో గోల్ సాధించడంతో పాటు ఫ్రాన్స్‌ను 2-0తో ఆధిక్యంలోకి తీసుకెళ్లాడు. మరో పది నిమిషాలకు బాలన్ డీ ఓర్ అవార్డు విజేత ఓస్మన్ డెంబ్లె గోల్ చేయడంతో ఫ్రాన్స్ ఖాతాలో మూడో గోల్ చేరింది. మరోవైపు 1986 తర్వాత రెండో ఫిఫా ప్రపంచకప్ ఆడుతున్న ఇరాక్ ఆడిన రెండు మ్యాచ్‌ల్లో ఓటమిపాలై టోర్నీ నుంచి నిష్క్రమించింది.

### సెంచరీ క్లబ్‌లో ఎంబాపె

ఎంబాపెకు ఇది వందో అంతర్జాతీయ మ్యాచ్. సెంచరీ క్లబ్‌లో చేరిన ఎంబాపె... రెండు గోల్స్‌తో ఫిఫా కప్‌లో గోల్స్ సంఖ్యను 16కు పెంచుకున్నాడు. ఫిఫా చరిత్రలో అత్యధిక గోల్స్ కొట్టిన ఆటగాళ్ల జాబితాలో ఎంబాపె.. జర్మనీ దిగ్గజం మిరాస్లావ్ క్లోస్ (16 గోల్స్) సంయుక్తంగా రెండో స్థానంలో ఉన్నాడు. అంతక ముందు 15వ గోల్ కొట్టి బ్రెజిల్ దిగ్గజం రొనాల్డో రికార్డును సమం చేశాడు. ఇక ఫిఫా ప్రపంచకప్‌లో ఈసారి మెస్సీ, ఎంబాపె మధ్య నంబర్ గేమ్ నడుస్తోంది. వస్తా నీ వెనుక అన్నట్లుగా మెస్సీకి పోటీగా ఎంబాపె వరుస గోల్స్‌తో రెచ్చిపోతున్నాడు. రాబోయే మ్యాచ్‌లో మిరాస్లావ్ క్లోస్ రికార్డును బద్దలు కొట్టనున్న ఎంబాపె ఆ తర్వాత మెస్సీని దాటినా ఆశ్చర్యం లేదు.

### సెనెగల్‌పై నార్వే విజయం

ఫిఫా ప్రపంచకప్‌లో నార్వే నాకౌట్‌కు అర్హత సాధించింది. గ్రూప్-ఐలో భాగంగా సెనెగల్‌తో జరిగిన లీగ్ మ్యాచ్‌లో నార్వే 3-2తో విజయాన్ని అందుకుంది. నార్వే తరఫున స్టార్ ఆటగాడు ఎర్లింగ్ హాలండ్ రెండు గోల్స్ సాధించి కీలకపాత్ర పోషించాడు. మరో గోల్ మార్కస్ పెడెర్సన్ సాధించి పెట్టాడు. తొలి అర్ధభాగం 43వనిమిషంలో మార్కస్ పెడెర్సన్...నార్వేకు తొలి గోల్ అందించాడు. ఇక రెండో అర్ధభాగం ప్రారంభమైన మూడో నిమిషంలోనే ఎర్లింగ్ హాలండ్ అద్భుత గోల్ కొట్టాడు. మరో పది నిమిషాల తర్వాత రెండో గోల్ చేశాడు. అటు సెనెగల్ తరఫున ఇస్మాయిల్ 53వ నిమిషంలో, ఇంజ్యూరీ టైమ్(90+3వ నిమిషం)లో రెండు గోల్స్ కొట్టాడు. ఈ విజయంతో నార్వే నాకౌట్ దశకు చేరుకోగా సెనెగల్ ఆడిన రెండింటిలో ఓడి ఇంటిబాట పట్టింది. ఫిఫా ప్రపంచకప్‌లో వరుసగా రెండు మ్యాచ్‌లు గెలవడం నార్వేకు ఇదే తొలిసారి. ఇక ఎర్లింగ్ హాలండ్ అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో గోల్స్ సంఖ్య 59కు చేరింది. లీగ్ దశలో నార్వే తన చివరి మ్యాచ్‌ను ఫ్రాన్స్‌తో ఆడనుంది.

### జోర్డాన్‌పై అల్జీరియా సంచలనం

గ్రూప్-జెలో సంచలనం నమోదైంది. జోర్డాన్‌పై 2-1 గోల్స్ తేడాతో అల్జీరియా సంచలన విజయం సాధించింది. ఫిఫా ప్రపంచకప్‌లో గెలుపు బోణీ చేయాలన్న జోర్డాన్ ఆశలపై నీళ్లు చల్లింది. తొలి అర్ధభాగంలో జోర్డాన్ ఆధిక్యం చాటగా, రెండో అర్ధభాగంలో అల్జీరియా ఆధిపత్యం ప్రదర్శించింది. తొలి అర్ధభాగం 36వ నిమిషంలో నిజర్ అల్‌రష్‌దన్ గోల్‌తో జోర్డాన్ 1-0 ఆధిక్యం కనబరిచింది. రెండో అర్ధభాగం ప్రారంభమైన 25 నిమిషాల వరకు ఆధిక్యాన్ని కాపాడుకుని గెలుపుపై ధీమాతో నిలిచింది. 69వ నిమిషంలో నాథిర్ బెన్‌బొలి గోల్ చేసి అల్జీరియాను 1-1తో సమవుజ్జీగా నిలిపాడు. ఇక మరో పది నిమిషాల్లో మ్యాచ్ ముగుస్తుందగా అమినె గుయిరి గోల్ చేసి అల్జీరియాకు విజయం సాధించిపెట్టాడు. జోర్డాన్ ఆడిన రెండింటిలోనూ ఓటములతో ఫిఫా ప్రపంచకప్ నుంచి నిష్క్రమించింది. అర్జెంటీనా రెండు విజయాలతో గ్రూప్-జె నుంచి ఇప్పటికే నాకౌట్ బెర్తును ఖరారు చేసుకోగా, రెండో బెర్తు కోసం ఆస్ట్రియా-అల్జీరియా మధ్య పోటీ నెలకొంది. ఈ మ్యాచ్‌లో నెగ్గిన జట్టు నాకౌట్‌లో ప్రవేశిస్తుంది.

ఆట

# ఒకే ఒక్కడు



**డాలస్, జూన్ 23 :** సాకర్ అభిమానులను లియోనెల్ మెస్సి మానియా ఊపేస్తోంది. అంచనాలకు అనుగుణంగా ఈ ఫిఫా వరల్డ్‌కప్‌లో అర్జెంటీనా స్టార్ గోల్స్ వర్షం కురిపిస్తున్నాడు. ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనే ఏకంగా అయిదు గోల్స్ కొట్టిన మెస్సి... ఫుట్‌బాల్ చరిత్రలో అరుదైన ఘనత అందుకున్నాడు. ఆస్ట్రియాతో మ్యాచ్‌లో మరో రెండు గోల్స్ చేసిన మెస్సి.. సాకర్ ప్రపంచ కప్‌లో అత్యధిక గోల్స్ చేసిన ఆటగాడిగా నిలిచాడు. మొత్తం 18 గోల్స్‌తో జర్మనీ దిగ్గజం మిరోస్లావ్ క్లోజ్(16 గోల్స్)ను అధిగమించాడు. తొలి మ్యాచ్‌లో హ్యాట్రిక్‌తో అర్జెంటీనాకు అద్భుత విజయం అందించిన మెస్సి... రెండో మ్యాచ్‌లోనూ చెలరేగాడు. 38వ నిమిషంలో ఓ గోల్, అదనపు సమయం (90+5 నిమిషం)లో మరో గోల్ సాధించాడు. ఇప్పటివరకు అర్జెంటీనా అయిదు గోల్స్ చేస్తే అవన్నీ మెస్సి అందించినవే కావడం విశేషం. 18 గోల్స్‌తో మెస్సి అగ్రస్థానానికి దూసుకెళ్లాడు. నిజానికి మెస్సి ఖాతాలో మరో గోల్ చేరాల్సింది. 9వ నిమిషంలో లభించిన పెనాల్టీని లియోనెల్ మెస్సి వృథా చేశాడు. లేదంటే గోల్స్ సంఖ్య 19కు, ఈ ఫిఫా ప్రపంచ కప్‌లో రెండో హ్యాట్రిక్ నమోదయ్యేది.

2006 జర్మనీలో జరిగిన ఫిఫా ప్రపంచకప్‌లో తొలి సారి ఆడిన లియోనెల్ మెస్సికిది ఇది ఆరో సాకర్ వరల్డ్‌కప్. సెర్బియాపై తొలి గోల్ సాధించిన మెస్సి అప్పటినుంచి గోల్స్ వర్షం కురిపిస్తూనే ఉన్నాడు. 2010 సౌతాఫ్రికాలో జరిగిన ఫిఫా వరల్డ్‌కప్‌లో గోల్స్ ఖాతా తెరవలేదు. ఇక 2014 ఫిఫా కప్‌లో నాలుగు గోల్స్, 2018లో ఒక గోల్, ఖతర్‌లో జరిగిన 2022 ఫిఫా కప్‌లో ఏకంగా ఏడు గోల్స్ సాధించాడు. ఈ ప్రపంచకప్‌లో ఇప్పటికే అయిదు గోల్స్ నమోదుచేశాడు. వరుసగా రెండో ఫిఫా కప్ అందించే జోరులో కొనసాగుతున్నాడు. ఒక ఫిఫా ప్రపంచకప్‌లో అత్యధిక గోల్స్ చేసిన ప్లేయర్‌గా జస్ట్ ఫొంటైన్(ఫ్రాన్స్, 13 గోల్స్) పేరిట రికార్డు ఉంది.



# పద్మశ్రీ రోహిత్, పద్మభూషణ్ విజయ్ అమృత్‌రాజ్

**న్యూఢిల్లీ, జూన్ 23:** ఇండియన్ టెన్నిస్ లెజెండరీ విజయ్ అమృత్‌రాజ్ పద్మభూషణ్, క్రికెటర్ రోహిత్ శర్మ పద్మశ్రీ అవార్డులు అందుకున్నారు. రాష్ట్రపతి నిలయంలో జరిగిన కార్యక్రమంలో వీరిద్దరికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పురస్కారాలను ప్రదానం చేశారు. టీమిండియా ఉమెన్ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ గత నెలలో అవార్డు అందుకోగా, తాజాగా రోహిత్ పద్మశ్రీ స్వీకరించాడు. టీమిండియాకు అందించిన సేవలకు గుర్తింపుగా రోహిత్ శర్మకు కేంద్ర ప్రభుత్వం ఈ పురస్కారం ప్రకటించింది. రోహిత్ కెప్టెన్సీలో భారత్ 2024 టీ20 ప్రపంచకప్‌ను గెలుచుకోవడంతో పాటు, 2025 ఛాంపియన్స్ ట్రోఫీని కూడా కైవసం చేసుకుంది. పద్మశ్రీ అందుకున్న భారత క్రికెట్ ప్రముఖుల జాబితాలో ఇప్పుడు రోహిత్ శర్మ కూడా చేరాడు. కాగా భారత టెన్నిస్‌కు గుర్తింపు తెచ్చిన విజయ్ అమృత్‌రాజ్... పలు విజయాలు అందించాడు. 1974, 1987లో డేవిస్ కప్‌లో భారత్‌ను రన్నరప్‌గా నిలపడంతో కీలక పాత్ర పోషించాడు. కెరీర్‌లో 16 సింగిల్స్, 13 డబుల్స్ టైటిల్స్ గెలుపొందాడు.

# పాక్‌ను చిత్తుచేసిన భారత్ హాకీ వీరులు

**లండన్, జూన్ 23:** ఎఫ్ఐహెచ్ ప్రో లీగ్ హాకీలో టోర్నీలో భారత్ విజయపరంపర కొనసాగిస్తోంది. మంగళవారం జరిగిన మ్యాచ్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌పై 4-3 గోల్స్ తేడాతో గెలుపొందింది. ఓ దశలో వెనకబడ్డా పుంజుకున్న హర్మన్‌ప్రీత్ సేన... అద్భుత ప్రదర్శన చేసింది. భారత్‌కు అభిషేక్, నీలకాంత శర్మ, సుఖ్‌జీత్ సింగ్, రాజిందర్ సింగ్ చేసిన గోల్స్ అందించారు. పాకిస్థాన్ తరఫున అహ్మద్ నదీమ్, అబు మహమూద్, మొయిన్ షకీల్ గోల్స్ చేశారు. ఎనిమిదో నిమిషంలో పాకిస్థాన్‌కు లభించిన పెనాల్టీ కార్నర్ అవకాశాన్ని నదీమ్ సమీపం నుండి గోల్‌గా మలచడంతో 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లారు. రెండో క్వార్టర్‌లో సర్కిల్ మధ్య నుండి అభిషేక్ చక్కటి గోల్‌తో స్కోరును సమం చేశాడు. రెండు నిమిషాల తర్వాత, హర్మన్‌ప్రీత్ కొట్టిన డ్రాగ్‌ఫ్లిక్ గోల్ పోస్టుకు తగిలి రీబౌండ్ కాగా నీలకంఠ దాన్ని గోల్‌గా మలిచాడు. 40వ నిమిషంలో సుఖ్‌జీత్ అద్భుతమైన డైవింగ్ షాట్‌తో భారత్ ఆధిక్యాన్ని 3-1కు చేర్చాడు. జూన్ 25న ఇంగ్లాండ్‌తో తదుపరి మ్యాచ్ ఆడనుంది.



# పెట్టుబడుల విత్‌డ్రాతో నష్టాల్లో సెన్సెక్స్, నిఫ్టీ

**ముంబై, జూన్ 23:** దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం తీవ్రస్థాయి అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. బలహీనమైన అంతర్జాతీయ సంకేతాలు, విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ, ర్యాలీ తర్వాత లాభాల స్వీకరణ ప్రభావంతో సెన్సెక్స్ దాదాపు 900 పాయింట్లు క్షీణిస్తే నిఫ్టీ 23,850స్థాయి దిగువకు జారిపోయింది. బీఎస్ఈ సెన్సెక్స్ 893.39పాయింట్లు క్షీణించి76,200.68వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ278.80పాయింట్లు నష్టపోయి 23,824.10 వద్ద స్థిరపడింది. ఆసియా మార్కెట్లలో కూడా భారీ అమ్మకాలు నమోదయ్యాయి. ముఖ్యంగా దక్షిణ కొరియా కోస్పీ సూచీ 9 శాతానికి పైగా కుప్పకూలడంతో ట్రేడింగ్ తాత్కాలికంగా నిలిపివేసింది. ఐటీ, మెటల్ రంగ షేర్లలో భారీ అమ్మకాలు నమోదయ్యాయి. మరోవైపు అమెరికా డాలర్ బలపడటం, రూపాయి బలహీనపడటం, ఇన్ఫోసిస్ 3.42శాతం, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 1.75 శాతం, రిలయన్స్ ఇండస్ట్రీస్ 1.55 శాతం నష్టపోయినిఫ్టీకి ఎక్కువ నష్టం తెచ్చాయి . బీఎస్ఈ మిడ్‌క్యాప్ సూచీ 0.88 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 0.62 శాతం క్షీణించాయి.

ఎన్ఎస్ఈలో 1,020 షేర్లు లాభపడగా, 2,280 షేర్లు నష్టపోయాయి. 99షేర్లు మార్పులేకుండా ముగిశాయి. 10ఏళ్ల ప్రభుత్వ బాండ్ రాబడి 6.851 శాతం నుంచి 6.826 శాతానికి తగ్గింది. రూపాయి విలువ డాలర్‌తో పోలిస్తే 94.73 వద్ద స్థిరపడింది. ఎంసీఎక్స్‌లో బంగారం ఫ్యూచర్స్ ధర 0.96 శాతం తగ్గి 10 గ్రాములకు రూ.1,46,722కు చేరితు బ్రెంట్ ముడిచమురు ధర బ్యారెల్‌కు 77.41 డాలర్లకు పడిపోయింది. గ్లోబల్ మార్కెట్లు ఒత్తిడిలో అమెరికా ఫెడరల్ రిజర్వ్ మరిన్ని వడ్డీ రేటు పెంపులు చేపట్టే




అవకాశాలు పెరగడంతో ప్రపంచ మార్కెట్లలో ఆందోళనలు నెలకొన్నాయి. ఈ ఏడాది ముగిసేలోపు కనీసం రెండు సార్లు 25 బేసిస్ పాయింట్ల చొప్పున వడ్డీ రేట్లు పెరగవచ్చని మార్కెట్లు అంచనా వేస్తున్నాయి. వాల్ స్ట్రీట్‌లో సోమవారం ఎస్అండ్‌పీ 500 సూచీ 0.37 శాతం, నాస్‌డాక్ 1.32 శాతం పడిపోయాయి. డౌ జోన్స్ సూచీ స్వల్ప లాభంతో ముగిసింది. ఎమ్‌క్యూర్ ఫార్మాస్యూటికల్స్ షేరు 1.55 శాతం పెరిగితే వేదాంత షేరు భారీ బ్లాక్ డీల్స్ కారణంగా 7.73 శాతం కుప్పకూలింది.

ఇన్ఫో ఎడ్జ్ (ఇండియా) 2.79 శాతం, ఎన్‌పీఎస్‌టీ 5.54 శాతం ఎగిసింది. సిర్మా ఎస్‌జీఎస్ టెక్నాలజీ 3.05 శాతం, ఇంటరార్చ్ బిల్డింగ్ సొల్యూషన్స్ రూ.165 కోట్ల ఆర్డర్ పొందడంతో 1.19 శాతం లాభపడింది. బిర్లా కార్పొరేషన్ 1.32 శాతం, డిఫ్యూజన్ ఇంజినీర్స్ 2.55 శాతం పెరిగాయి. టర్టిల్‌మింట్ ఫిన్‌టెక్ సొల్యూషన్స్ ఐపీఒకు 1.19 రెట్లు సబ్‌స్క్రిప్షన్ లభించింది. వాటర్‌వేస్ లీజర్ టూరిజం ఐపీఒకు కేవలం 0.18 రెట్లు మాత్రమే స్పందన వచ్చింది. అద్వైత్ జ్యువెల్స్ ఐపీఒకు మాత్రం భారీ స్పందన లభించి 10.49 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది.



# ధరల్లో భారీ పతనం.. 3 శాతం తగ్గుదల

# పసిడి, వెండిపై ఫెడ్ రిజర్వ్ ఎఫెక్ట్

**ముంబై, జూన్ 23 :** అమెరికా ఫెడరల్ రిజర్వ్ మరిన్ని వడ్డీ రేట్ల పెంపులకు పాల్పడవచ్చన్న అంచనాలు ప్రపంచ పెట్టుబడిదారుల సెంటిమెంట్‌పై ప్రభావం చూపడంతో మంగళవారం బంగారం, వెండి ధరలు బలహీనయ్యాయి. పసిడి వెండి ధరలు 3 శాతం వరకు తగ్గాయి. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లో ఆగస్టు డెలివరీ బంగారం ఫ్యూచర్స్ ధర 10 గ్రాములకు రూ.1,46,776 వద్ద ప్రారంభమైంది. గత ముగింపు ధర రూ.1,48,188తో పోలిస్తే రూ.1,412తక్కువ. మధ్యాహ్నం 12 గంటల సమయానికి బంగారం ధర రూ.1,46,379 వద్ద ట్రేడవుతూ, గత ముగింపుతో పోలిస్తే రూ.1,739 నష్టాన్ని నమోదు చేసింది. ట్రేడింగ్ సెషన్‌లో గరిష్టంగా రూ.1,47,090, కనిష్టంగా రూ.1,46,070 స్థాయిలను తాకింది. ఇక జూలై డెలివరీ వెండి ఫ్యూచర్స్‌లో బంగారంతో పోలిస్తే మరింత ఒత్తిడి కనిపించింది. వెండి ధర కిలోకు రూ.2,27,676 వద్ద ప్రారంభమై, గత ముగింపు ధర రూ.2,34,310తో పోలిస్తే రూ.6,634తగ్గింది. తదుపరి ట్రేడింగ్‌లో వెండి ధర2,27,119 వద్ద కొనసాగుతూ రూ.7,191 నష్టాన్ని చవిచూసింది. రోజంతా కనిష్టంగా రూ.2,26,556 స్థాయిని తాకి 3.30 శాతం వరకు పడిపోయింది. గరిష్టంగా 2,28,800 వద్ద నమోదైంది. రానున్న కాలంలో రూ.2,30,500 రూ.2,31,600 మధ్య ప్రతిఘటన ఉండగా, రూ.2,28,000మద్దతుస్థాయికి దిగువకు వెళితే ధరలు రూ.2,26,000, ఆపై రూ.2,24,000 వరకు పడిపోయే అవకాశం ఉందని బులియన్ నిపుణులు అంచనా వేశారు. మరోవైపు, వెండి ధర మళ్లీ రూ.2,30,000 మార్కును అధిగమిస్తే కోలుకునే అవకాశాలు మెరుగుపడతాయన్నారు. అమెరికా డాలర్ బలపడటం, ద్రవ్యోల్బణాన్ని అదుపులో ఉంచేందుకు ఫెడరల్ రిజర్వ్ కఠిన ద్రవ్య విధానాన్ని కొనసాగించవచ్చన్న అంచనాలే విలువైన లోహాల ధరల బలహీనతకు ప్రధాన కారణమని నిపుణులు వివరించారు. అదనంగా, ఈ వారం విడుదల కానున్న అమెరికా ఉపాధి, నిరుద్యోగ గణాంకాలపై పెట్టుబడిదారులు దృష్టి సారించారని, అవే బంగారం, వెండి ధరల దశదిశలు నిర్ణయించే కీలక అంశాలుగా మారవచ్చని నిపుణుల అంచనా.

# బ్యాంకింగ్ వ్యవస్థలోకి 1.41లక్షల కోట్ల నగదు ప్రవేశపెట్టిన ఆర్బీఐ



**ముంబయి, జూన్ 23:** బ్యాంకింగ్ వ్యవస్థలోకి భారీగా నగదును విడుదల చేసింది. ఏడు రోజుల వీఆర్ఆర్ అంటే వేరియబుల్ రేట్ రెపో వేలం ద్వారా రూ.1.41లక్షల కోట్ల తాత్కాలిక నిధులను విడుదలచేసింది. జీఎస్టీ చెల్లింపుల కారణంగా వ్యవస్థలో ఏర్పడిన నగదు కొరతను అధిగమించేందుకు ఆర్‌బీఐ ఈచర్యలు చేపట్టింది. ఇటీవలి జీఎస్టీ చెల్లింపుల వలన బ్యాంకుల నుంచి పెద్ద మొత్తంలో నగదు బయటకు వెళ్లింది. దీంతో బ్యాంకింగ్ వ్యవస్థలో ద్రవ్య లభ్యత ఒక్కసారిగా పడిపోయింది. ఈనెల 21న రూ.30,685 కోట్ల మిగులుతో ఉన్న వ్యవస్థ, 22నాటికి రూ.19,971 కోట్ల లోటుకు చేరుకుంది. ఈ పరిణామంతో స్వల్పకాలిక మనీ మార్కెట్ వడ్డీ రేట్లపై తీవ్ర ఒత్తిడి పెరిగింది. సగటు కాల్ మనీ రేటు 5.43 శాతానికి చేరింది. ఇది ఆర్‌బీఐ రెపో రేటు కన్నా 0.18 శాతం ఎక్కువ. ఈ క్రమంలో రంగంలోకి దిగిన ఆర్‌బీఐ, వ్యవస్థలో తగినంత నగదు ఉండేలా చర్యలు తీసుకుంది. 5.26శాతం కటాఫ్ రేటుతో బ్యాంకులకు నిధులను అందించింది. ఇలాంటి సమయాల్లో ఆర్‌బీఐ జోక్యం చేసుకోకపోతే, నిధుల సమీకరణ వ్యయంపెరిగి, ఆర్థిక వ్యవస్థలో రుణ ప్రవాహానికి ఆటంకం కలుగుతుంది. ఇది ఆర్థిక మందగమనానికి దారితీసే ప్రమాదం ఉంది. ఆర్బీఐ సాధారణంగా పన్ను చెల్లింపులు, ముందస్తు పన్ను చెల్లింపులు లేదా ఇతర కాలానుగుణ రుణ డిమాండ్ వంటి కారణాల వల్ల ఏర్పడే స్వల్పకాలిక నగదు లోటును సరిచేయడానికి వివిధ ద్రవ్య విధాన సాధనాలను ఉపయోగిస్తుంది.

తాత్కాలిక నగదు అవసరాల కోసం వీఆర్ఆర్ వేలం ప్రక్రియను నిర్వహిస్తుంది. బ్యాంకులు తమ వద్ద ఉన్న ప్రభుత్వ సెక్యూరిటీలను ఆర్‌బీఐ వద్ద తాకట్టు పెట్టి నిధులు పొందుతాయి. దీర్ఘకాలిక ద్రవ్య లభ్యత కోసం ఆర్‌బీఐ సెకండరీ మార్కెట్ నుంచి ప్రభుత్వ సెక్యూరిటీలను కొనుగోలు చేయడం లేదా డాలర్‌రూపాయి స్వాప్ వేలాలను నిర్వహించడం వంటి చర్యలు చేపడుతుంది. తాజాచర్యతో బ్యాంకింగ్ వ్యవస్థలో స్వల్పకాలిక నిధుల ఒత్తిడి తగ్గి, ఆర్థిక కార్యకలాపాలు సజావుగా సాగేందుకు మార్గం సుగమమైంది.


# మూడు రోజుల్లోనే 52లక్షల కోట్లు హాంఫట్



**ముంబై, జూన్23:** పీవోతో మార్కెట్‌లోకి అడుగుపెట్టిన సంచలనం నమోదుచేసిన అంతరిక్ష సంస్థ స్పేస్‌ఎక్స్‌కు భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఎలాన్ మస్క్‌కు చెందిన ఈ కంపెనీ షేర్లు వరుసగా మూడోరోజూ పతనమయ్యాయి. కేవలం మూడు రోజుల్లోనే కంపెనీమార్కెట్ విలువ 600 బిలియన్ డాలర్లకుపైగా (సుమారు రూ.52 లక్షల కోట్లు) కరిగిపోయింది. స్పేస్‌ఎక్స్ షేరు మరో 16 శాతం క్షీణించి 154.60 డాలర్ల వద్ద ముగిసింది. కంపెనీ స్టాక్ మార్కెట్‌లో లిస్ట్ అయిన తర్వాత నమోదైన కనిష్ఠ స్థాయి ఇదే.

గత మూడు ట్రేడింగ్ సెషన్లలో షేరు మొత్తం 23శాతం పడిపోయింది. దీంతో మార్కెట్ విలువ భారీగా తగ్గినా కంపెనీ మొత్తం విలువ ఇంకా 2 ట్రిలియన్ డాలర్లకు పైగానే ఉంది. ఏఐ రంగంలో విస్తరణకోసం స్పేస్‌ఎక్స్ భారీమొత్తంలో నిధులు సమీకరించేందుకు బాండ్లు జారీ చేయనున్నట్లు ప్రకటించింది. దీనివల్ల కంపెనీపై అప్పుల భారం పెరిగే అవకాశం ఉందని, ఏఐ పెట్టుబడులు ఆశించిన ఫలితాలు ఇస్తాయా అనే సందేహాలు కూడా ఇన్వెస్టర్లలోవ్యక్తమయ్యాయి. దీంతో షేర్లపై అమ్మకాల ఒత్తిడి పెరిగినట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. రికార్డు ఐపీవో తర్వాత స్పేస్‌ఎక్స్ షేర్లపై రిటైల్ ఇన్వెస్టర్ల ఆసక్తి భారీగా కనిపించింది. తొలి ఐదు రోజుల్లోనే వ్యక్తిగత పెట్టుబడిదారులు 405మిలియన్ డాలర్ల విలువైన షేర్లను కొనుగోలు చేశారు. స్పేస్‌ఎక్స్ భవిష్యత్ వృద్ధిపై ఇప్పటికే భారీ అంచనాలు ఉండటంతో షేర్ ధర చాలా పెరిగిందని, అందుకే అమ్మకాల ఒత్తిడి కనిపిస్తోందని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు.

# ఎఐతో 21వేల మందికి కోతపెట్టిన ఒరాకిల్




**న్యూయార్క్:** కృత్రిమ మేధ(ఏఐ) టెక్నాలజీ వేలాది ఉద్యోగాలపై ప్రభావం చూపిస్తోంది. అమెరికా టెక్నాలజీ దిగ్గజం ఒరాకిల్ 2026 ఆర్థిక సంవత్సరంలో ప్రపంచవ్యాప్తంగా సుమారు 21వేల మందిని ఉద్యోగాల నుంచి తొలగించినట్లు వెల్లడించింది. ఏఐ ఆధారిత కార్యకలాపాల విస్తరణ, వ్యాపార పునర్వ్యవస్థీకరణలో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంస్థ తన వార్షిక నివేదికలో పేర్కొంది. గత ఏడాది 1.62 లక్షల మంది ఉద్యోగులు ఉండగా 2026 మే 31 నాటికి ఆ సంఖ్య 1.41 లక్షలకు తగ్గింది. సంస్థ ఉద్యోగుల సంఖ్యలో ఇది దాదాపు 13 శాతం తగ్గుదల. ఏఐ టెక్నాలజీల వినియోగం ఇప్పటికే ఉద్యోగ కోతలకు దారితీసిందని, భవిష్యత్తులో కూడా ఇలాంటి కోతలు కొనసాగొచ్చని ఒరాకిల్ స్పష్టం చేసింది. ఒరాకిల్ ప్రస్తుతం డేటాబేస్ సాఫ్ట్‌వేర్ సంస్థగానే కాకుండా, ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్ రంగాల్లో కీలక సంస్థగా ఎదగడానికి భారీ పెట్టుబడులు పెడుతోంది. ఓపెన్‌ఏఐ వంటి సంస్థల అవసరాల కోసం భారీ డేటా సెంటర్ల నిర్మాణంలో నిమగ్నమైంది. ఇందుకోసం ఈ ఆర్థిక సంవత్సరంలో సుమారు 70 బిలియన్ డాలర్ల మూలధన వ్యయం చేయనున్నట్లు ప్రకటించింది. ఈ ప్రణాళికలకు నిధులు సమకూర్చేందుకు మరో 40 బిలియన్ డాలర్లు రుణాలు, ఈక్విటీ రూపంలో సమీకరించాలని సంస్థ భావిస్తోంది. ఈ భారీ ఏఐ పెట్టుబడులు సంస్థపై ఆర్థిక ఒత్తిడిని పెంచుతున్నాయి. పునర్వ్యవస్థీకరణ, ఉద్యోగుల తొలగింపుల కోసం 2026 ఆర్థిక సంవత్సరంలో ఒరాకిల్ 1.84 బిలియన్ డాలర్లు ఖర్చు చేసింది. ఈ వ్యయం కేవలం 374 మిలియన్ డాలర్లు మాత్రమే ఉండటం గమనార్హం.

# 109.27 కోట్లకు ఇంటర్నెట్ కనెక్షన్లు: ట్రాయ్




**న్యూఢిల్లీ, జూన్ 23:** భారత టెలికాం రంగం శరవేగంతో వృద్ధిని కొనసాగిస్తోంది. దేశంలో ఇంటర్నెట్, టెలిఫోన్ వినియోగదారుల సంఖ్య భారీ స్థాయిలో పెరిగినట్లు టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) తాజా నివేదిక వెల్లడించింది. 2026 మార్చి నాటికి దేశంలో మొత్తం ఇంటర్నెట్ సబ్‌స్క్రైబర్ల సంఖ్య 109.27కోట్లకు చేరింది. 2025 డిసెంబర్ చివరి నాటికి ఈ సంఖ్య 102.86 కోట్లుగా ఉండగా, కేవలం మూడు నెలల్లోనే 6.24 శాతం వృద్ధి నమోదైంది. ట్రాయ్ నివేదిక ప్రకారం మొత్తం ఇంటర్నెట్ వినియోగదారులలో 104.62 కోట్ల మంది వైర్‌లెస్ (మొబైల్) ద్వారా, 4.65 కోట్ల మంది వైర్డ్ కనెక్షన్ల ద్వారా ఇంటర్నెట్ సేవలు పొందుతున్నారు. వీరిలో బ్రాడ్‌బ్యాండ్ వినియోగదారుల సంఖ్య 106.58 కోట్లుగా ఉండగా, న్యారోబ్యాండ్ (56 కేబీపీఎస్ కంటే తక్కువ వేగం) సబ్‌స్క్రైబర్లు 2.69 కోట్లుగా ఉన్నారు. త్రైమాసిక ప్రాతిపదికన బ్రాడ్‌బ్యాండ్ సబ్‌స్క్రైబర్ల బేస్ 5.81 శాతం పెరగడం విశేషం. ఇంటర్నెట్‌తో పాటు మొత్తం టెలిఫోన్ సబ్‌స్క్రైబర్ల సంఖ్య కూడా 133.05 కోట్లకు పెరిగింది.

దీంతో దేశవ్యాప్తంగా టెలిడెన్సిటీ (ప్రతి 100 మందికి ఉన్న ఫోన్ కనెక్షన్లు) గత త్రైమాసికంలోని 91.74 శాతం నుంచి 93.26 శాతానికి మెరుగుపడింది. వైర్‌లైన్ టెలిడెన్సిటీ సైతం 3.33 శాతం నుంచి 3.38 శాతానికి పెరిగింది. వినియోగదారుల నుంచి వచ్చే సగటు నెలవారీ ఆదాయం (ఏఆర్‌పీయూ) కూడా టెలికాం సంస్థలకు సానుకూలంగా ఉంది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.